
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 285

శుక్రవారం 5-1-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రాసెసింగ్ ఫీజే తీసుకోండి

రక్తం విషయంలో ఆస్పత్రులు, బ్లడ్‌బ్యాంక్‌లకు డీసీజీఐ ఆదేశాలు -6లో



జియో కొత్త కస్టమర్లు

31.59 లక్షలు -13లో



నన్ను అరెస్టు చేయడానికి కుట్రలు

బీజేపీ ప్రభుత్వం తనను అరెస్టు చేయడానికి కుట్రలు పన్నిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు.

- వివరాలు 6లో



వాంటెడ్ ఉగ్రవాది మట్టూ అరెస్ట్

హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది జావెద్ అహ్మద్ మట్టూ(32)ను ఎట్టకేలకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు పట్టుకున్నారు.

- వివరాలు 6లో



కోర్టు హాల్లో మహిళా జడ్జిపై దాడి

అమెరికా లాస్ వెగాస్‌లోని రీజినల్ జస్టిస్ సెంటర్‌లో ఓ కేసు విచారణ సందర్భంగా నిందితుడు మహిళా జడ్జిపై దాడి చేశాడు.

- వివరాలు 6లో



కొలరాడో తీర్పును రద్దు చేయండి

కొలరాడో కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

'అద్దె బస్సు' డిమాండ్లు పరిశీలిస్తాం



ఆర్టీసీ అద్దె బస్సు నిర్వాహకుల డిమాండ్లను పరిశీలించి వాటి అమలు సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇచ్చేందుకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. వారం రోజుల్లో నివేదికను పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించింది.

- వివరాలు 3లో

7.62 లక్షల ఎకరాల్లో వరి నాట్లు



యాసంగి సీజన్‌లో వరి నాట్లు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. వానాకాలం సీజన్ పంటల కోతలు పూర్తి కావస్తుండటంతో రైతులు యాసంగిపై దృష్టి సారించారు. ఇప్పటికీ అనేకచోట్ల వరి, సోయాబీన్, పత్తి కోతలు పూర్తయ్యే దశలో ఉన్నాయి.

- వివరాలు 5లో

పురపాలికల్లో అవిశ్వాస రాజకీయం



నిజామాబాద్ జిల్లా ఆర్మూరు మునిసిపాలిటీలో కౌన్సిలర్లు మునిసిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గగా మరో ఏడు మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలపై చర్చకు జిల్లా కలెక్టర్లు కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు.

- వివరాలు 5లో

రోబో మనుషులు వస్తున్నారు!



భవిష్యత్తులో ఏం జరుగుతుందన్నది చెప్పేవారికి ఎంతో డిమాండ్. మరి అలా 2024లో ఏమేం జరగవచ్చని 'కృత్రిమ మేధ (ఏఐ)'ను అడిగితే.. కాస్త మంచి ముచ్చట్లు చెప్పానే.. మరికాస్త ఆందోళన రేపే అంచనాలేవేసింది. ఆ వివరాలేమిటో తెలుసుకుందామా..

- వివరాలు 14లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venco Chicken | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	85	Dressed with Skin	155
₹ 78	Retail Live Bird	107	Skin Less	177


Issued in the interest of consumers



ఇక నువ్వేం మాట్లాడకు! మా పార్టీలో చేరుతున్నావ్ అంతే!

● ఉల్లాసంగా ఉత్సాహంగా.. కడలి ఒడిలో





ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షద్వీప్ పర్యటన సందర్భంగా సముద్రంలో నీటి అడుగున సాహస క్రీడలో స్వయంగా పాల్గొన్నారు. అక్కడి జల చరాలను, వాటి జీవనాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అరేబియా సముద్రంలో ఉల్లాసకరమైన అనుభవం సొంతం చేసుకున్నానంటూ మోదీ తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. లక్షద్వీప్‌లో తన పర్యటన సందర్భంగా స్నాకలింగ్‌కు ప్రయత్నించానని తెలిపారు.

- వివరాలు 6లో

జాతీయ హోదా చాన్స్ లేదు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మరో విధంగా సాయం



షెకావత్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్

- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌లతో భేటీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి షెకావత్.... ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తామని హామీ
- ఏ ప్రాజెక్టుకూ జాతీయహోదా ఇచ్చే ఉద్దేశం లేదని స్పష్టీకరణ
- పాలమూరుకు 90 టీఎంసీలు వినియోగించుకుంటామన్న రాష్ట్ర నేతలు
- మిగతా అనుమతులు త్వరగా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి
- కేంద్ర మంత్రులు అమిత్‌షా, హర్‌దీప్‌సింగ్‌తోనూ రాష్ట్ర బృందం భేటీ
- రాష్ట్రానికి అదనంగా ఐపీఎస్ అధికారులను కేటాయించాలి.. ఉమ్మడి ఆస్తుల విభజనకు సహకరించాలి... హైదరాబాద్ మెట్రో రెండో దశ నవరణ ప్రతిపాదనలను ఆమోదించాలని విన్నపం

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాలపై ఆధారపడి చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ ప్రాజెక్టుకు మరో రకంగా సాయం అందిస్తామని పేర్కొంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో కూడిన రాష్ట్ర బృందానికి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఏఐసీసీ నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల సన్నాహక భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన రేవంత్, ఉత్తమ్.. గురువారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరీ, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌లతో విడివిడిగా భేటీ అయ్యారు. షెకావత్‌తో సమావేశంలో మిగతా 2వ పేజీలో ▶

గెలుపే ధ్యేయంగా కలిసి పనిచేద్దాం

- కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశానిర్దేశం... పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ ప్రధాన కార్యదర్శులతో భేటీ

- వివరాలు 6లో



హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కేసీఆర్‌కు వైఎస్ జగన్ పరామర్శ

ప్రమాదం, సర్జరీ గురించి అడిగి తెలుసుకున్న ఏపీ సీఎం

- ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపైనా ఆరా
- జగన్‌కు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ నేతలు

2లో

కానిస్టేబుల్ నియామకాలకు

లైన్‌క్లియర్



అందరికీ 4 మార్కులు కలపాలన్న సింగిల్ జడ్జి తీర్పును కొట్టివేసిన హైకోర్టు బెంచ్

- ప్రశ్నల్లో అభ్యంతరాలపై నిపుణుల కమిటీలు ఏర్పాటు చేయాలి
- నాలుగు వారాల్లో నియామక ప్రక్రియ పూర్తి చేయాలి
- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ధర్మాసనం ఆదేశాలు
- ఉద్యోగాలకు ఎంపికైన 15,750 మంది అభ్యర్థులకు ఊరట

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీసు శాఖలో 15,750 కానిస్టేబుల్ నియామకాలకు లైన్ క్లియర్ అయింది. ఎంపిక పరీక్షలో అభ్యర్థులకు నాలుగు మార్కులు కలిపి మళ్లీ ఫలితాలు ప్రకటించాలన్న సింగిల్ జడ్జి తీర్పును ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. అభ్యంతరాలు ఉన్న ప్రశ్నలకు సంబంధించి నిపుణుల కమిటీలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ)ను ధర్మాసనం ఆదేశించింది. ఆ కమిటీల నివేదికలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, వెంటనే నియామక ప్రక్రియ ప్రారంభించి నాలుగు వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

సింగిల్ జడ్జి తీర్పుతో..

రాష్ట్రంలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం 2022 ఆగస్టు 30న తుది రాతపరీక్ష జరిగింది. అందులో దాదాపు 23 ప్రశ్నలపై అభ్యంతరాలు తెలుపుతూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్టు అభ్యర్థులు పేర్కొన్నారు. తప్పుగా రూపొందించిన ప్రశ్నలు, ఇచ్చిన తప్పు సమాధానాలను తొలగించాలని కోరడంతోపాటు తెలుగులోకి అనువదించని కొన్ని ప్రశ్నలను సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. ''ఈ పరీక్షలో నాలుగు ప్రశ్నలను మినహాయించి అభ్యర్థులందరికీ నాలుగు మార్కులు ఇవ్వాలి. 122, 130, 144 ప్రశ్నలను తెలుగులోకి అనువదించలేదు. 57 ప్రశ్న తప్పుగా ఉంది. వాటిని ప్రశ్నపత్రం నుంచి తొలగించాలి. ఈ మార్పులతో పేపర్లను మళ్లీ మూల్యాంకనం చేసి, ఫలితాలను ప్రకటించాలి. తదుపరి నియామక ప్రక్రియ కొనసాగించాలి''అని తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో మిగతా 10వ పేజీలో ▶

ఎమ్మెల్సీలు చెరొకటి

కాంగ్రెస్‌కు ఒకటి.. బీఆర్ఎస్‌కు మరొకటి ఖాయం!

- రెండు పార్టీల నుంచి అధిక సంఖ్యలో ఆశావహులు
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో పలువురు నేతలకు హామీలు
- అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారే అవకాశం



సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్యే కోటా స్థానాల్లో ఒకటి అధికార కాంగ్రెస్ పార్టీకి, మరో స్థానం బీఆర్ఎస్‌కు దక్కనుంది. రెండు స్థానాలకు రెండు పార్టీల తరఫున ఇద్దరు అభ్యర్థులే నామినేషన్ వేసే పక్షంలో ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డిలు.. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వాస్తవానికి మిగతా 10వ పేజీలో ▶

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 29న పోలింగ్

- షెడ్యూల్ విడుదల చేసిన ఎలక్షన్ కమిషన్
- 11న వెలువడనున్న నోటిఫికేషన్

- వివరాలు 10లో



ట్రోఫీతో కెప్టెన్లు రోహిత్ శర్మ, డీన్ ఎల్గర్

రెండు రోజుల్లోనే...

దక్షిణాఫ్రికాపై భారత్ ఘనవిజయం

- 642 బంతుల్లో ముగిసిన రెండో టెస్టు.. బుమ్రాకు 6 వికెట్లు
- 1-1తో సమంగా ముగిసిన సిరీస్

భారత పేస్ బౌలర్ల ప్రతాపానికి దక్షిణాఫ్రికాతో జరిగిన చివరిదైన రెండో టెస్టులో టీమిండియా కేవలం రెండు రోజుల్లోనే ఘన విజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమంగా ముగించింది. ఐదు సెషన్‌లలోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా నిర్దేశించిన 79 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అందుకుంది. అంతకుముందు జస్‌ప్రీత్ బుమ్రా (6/61) ధాటికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 176 పరుగులకే ఆలౌటైంది. ఓవరాల్‌గా భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు 642 బంతుల్లోనే (107 ఓవర్లు) ముగియడం విశేషం. టెస్టు క్రికెట్ చరిత్రలో తక్కువ బంతుల పరంగా, తక్కువ ఓవర్ల పరంగా ఫలితం వచ్చిన మ్యాచ్‌గా భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో 15 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికాను 55 పరుగులకే కుప్పకూల్చిన భారత బౌలర్, హైదరాబాద్ పేసర్ సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. సిరీస్ మొత్తంలో 12 వికెట్లు తీసిన బుమ్రాకు... 201 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా బ్యాటర్ డీన్ ఎల్గర్‌కు సంయుక్తంగా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. - వివరాలు 13లో

కమీషన్ తీసుకుంటే విచారణ చేయించండి



'కాళేశ్వరం'పై రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్

- నా ఆదాయం, రేవంత్‌రెడ్డి ఆదాయంపై విచారణకు సిద్ధం...
- మా ఇద్దరి ప్రస్థానం ఎలా మొదలైందో, ఎవరిపై ఎలాంటి ఆరోపణలు వచ్చాయో అందరికీ తెలుసు
- ఫార్మాసిటీపై 15 రోజుల్లోనే యూ టర్న్ ఎందుకు?... ఫార్మా లాబీయింగ్‌కు లొంగిపోయారా?

2లో

సిరిసిల్ల నేతన్నలకు రూ.130 కోట్ల ఆర్వీఎం ఆర్డర్లు

'సాక్షి' కథనం ఎఫెక్ట్

టెక్స్‌టైల్ పార్క్‌కు వస్త్రోత్పత్తి ఆర్డర్లు

సిరిసిల్ల: సిరిసిల్ల నేతన్నలకు రూ.130 కోట్ల రాజీవ్ విద్యామిషన్ (ఆర్వీఎం) వస్త్రోత్పత్తి ఆర్డర్లు రానున్నాయి. సిరిసిల్లలో ఉత్పత్తి అయిన వస్త్రానికి గిట్టుబాటు ధర లేక నిల్వలు పేరుకుపోయిన నేపథ్యంలో 'ఆధునిక మగ్గాలు ఆగాయి'శీర్షికన ఈనెల 3న 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర జౌళి శాఖ అధికారులు స్పందించి సిరిసిల్ల టెక్స్‌టైల్‌పార్క్ వస్త్రోత్పత్తిదారులతో సమావేశం నిర్వహించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు టెక్స్‌టైల్‌పార్క్‌లోని యూనిట్లకు ఆర్వీఎం వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇస్తామని జౌళి శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్‌రావు మిగతా 10వ పేజీలో ▶

సోషల్ మీడియాపై ఫోకస్ పెంచాలి

అసెంబ్లీ ఎన్నికల్లో దీని ప్రభావం బాగా కన్పించింది

కరీంనగర్ లోక్‌సభ సన్నాహక భేటీలో కేటీఆర్

- ఓటమి నుంచి విజయ తీరాలకు చేరేందుకు పట్టుదలతో పనిచేయాలి
- అధికారంలో ఉండగా పొరపాట్లు జరిగిన మాట వాస్తవమే... ప్రభుత్వ పనులపై దృష్టి పెట్టి పార్టీని నిర్లక్ష్యం చేశాం
- పొరపాట్లు పునరావృతం కాకుండా ముందుకుసాగాలి.... ఒక్కో బూత్‌లో అదనంగా 50 ఓట్లు సాధించాలి



సమావేశంలో చర్చించుకుంటున్న హరీశ్, కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: చీకటి వస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, ఓటమి నుంచి విజయ తీరాలకు చేరేందుకు పట్టుదలతో పనిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలో ఉండగా పొరపాట్లు, లోటుపాట్లు చోటు చేసుకున్న మాట వాస్తవమేనని, ప్రభుత్వ పనులపై దృష్టి పెట్టి పార్టీని కొంతనిర్లక్ష్యం చేశామని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, పది పదిహేనేళ్లు కాకపోతే 20 ఏళ్లకైనా పదవి నుంచి దిగాల్సిందేనని, అదే జీవితమని వ్యాఖ్యానించారు. శాసనసభ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం బాగా కనిపించిందని, మన పార్టీ యంత్రాంగం కూడా సోషల్ మీడియాపై ఫోకస్ పెంచాలని సూచించారు. లోక్‌సభ నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో భాగంగా గురువారం తెలంగాణ భవన్‌లో కరీంనగర్ సమావేశం జరిగింది. మాజీ మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేటీఆర్ హాజరై పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

పార్టీకి పునర్జన్మనిచ్చింది కరీంనగరే

'గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రతి నాయకుడు, కార్యకర్త ముందుకు సాగాలి. ప్రత్యర్థి పార్టీలు సాగించే దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు దీటుగా తిప్పికొట్టాలి. విద్యార్థి, యువజన, మైనార్టీ సమ్మేళనాలతో పాటు సోషల్ మీడియా టీం మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ సర్కార్ ధోబీ ఘాట్లకు కరెంటు బిల్లులు చెల్లించలేదు

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: లాండ్రీలు, ధోబీఘాట్‌లు, హెయిర్ కటింగ్ సెలూన్‌లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగిస్తామని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గత ప్రభుత్వం 2021–22 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించిందని, అందుకయ్యే వ్యయాన్ని మాత్రం డిస్కంలకు చెల్లించలేదని మంత్రి పేర్కొన్నారు. అయితే బకాయిల పేరిట విద్యుత్ కనెక్షన్ తొలగించొద్దని డిస్కంలకు మంత్రి సూచించారు. ఈ విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించడానికి నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖను కోరుతామన్నారు. ఈ ఏడాది జనవరి మూడోతేదీ వరకు వాషర్‌మెన్‌లో లబ్ధిదారులు 76,060 మంది కాగా, బకాయిలు రూ.78.55 కోట్లు అని, నాయీ బ్రాహ్మణ లబ్ధిదారులు 36,526 మంది కాగా, బకాయిలు రూ.12.34 కోట్లు ఉన్నాయన్నారు.

నిరాశ చెందొద్దు.. సముచిత స్థానం కల్పిస్తాం

విక్రమ్‌గౌడ్‌కు కిషన్‌రెడ్డి హామీ



విక్రమ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి, దివంగత ముఖేశ్‌గౌడ్ కుమారుడు ఎం.విక్రమ్‌గౌడ్ భేటీ అయ్యారు. పార్టీలో చేరి మూడేళ్లు గడుస్తున్నా తగిన ప్రాధాన్యత దక్కలేదని, తనకు ఎలాంటి పదవిలేదని పేర్కొన్నట్టు తెలిసింది. ఈ విషయంలో నిరాశ చెందవద్దని, త్వరలోనే పార్టీలో సముచితస్థానం కల్పిస్తానని ఆయనకు కిషన్‌రెడ్డి హామీనిచ్చినట్టు సమాచారం. గురువారం కిషన్‌రెడ్డిని విక్రమ్ కలిసిన సందర్భంగా వివిధ అంశాలు చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది.

'కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజలకు నమ్మకంలేదు'

సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన మొదటి 10 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం 30 లక్షల మంది నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి రాగానే హామీలను అమలు చేస్తానని చెప్పి, మాటతప్పిన కాంగ్రెస్ పార్టీ 420నేనని తీవ్రవ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌పార్టీ నేతలు ఎన్నికల్లో ఇచ్చిన మిగతా హామీలను కూడా అమలు చేస్తారన్న నమ్మకం ప్రజలకు పోయిందన్నారు.

కిషన్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారు

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతికహక్కు కిషన్‌రెడ్డికి లేదన్నారు. గురువారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి జీవితం తెరిచిన పుస్తకమని, అందుకే ప్రజలు ఆయనను విశ్వసించారని పేర్కొన్నారు. రేవంత్ అక్రమంగా సంపాదించారని కిషన్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయాలు మొదలు పెట్టినప్పటి నుంచి రేవంత్ ఎన్నడూ అధికార పార్టీలో లేరని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అక్రమంగా సంపాదిస్తుంటే, కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఎందుకు విచారణ జరిపించలేదని ప్రశ్నించారు. పదేళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కేసీఆర్ అవినీతిపై ఎందుకు విచారణ చేయించలేదని నిలదీశారు. 'కేసీఆర్‌ను కాపాడింది బీజేపీ కాదా, కేసీఆర్ బిడ్డ కవితపై లిక్కర్ అవినీతి ఆరోపణలు ఉంటే అరెస్ట్ చెయ్యకుండా కాపాడింది మీరు కాదా..'అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటుందన్నారు.

'కాళేశ్వరం'పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించవద్దని, సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 అక్టోబర్ 21న కాళేశ్వరానికి చెందిన మేడిగడ్డ ప్రాజెక్టు ఏడో బ్లాక్‌లోని 19–21 పియర్స్ కుంగిపోయాయన్నారు. అదే సమయంలో అన్నారం ప్రాజెక్టు ముందు భాగంలో కూడా బుంగపడి నీరు బయటకు వచ్చిందన్నారు. ఈ రెండు ప్రమాద ఘటనలతో అత్యంత ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్రంలో అనేక అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయన్నారు. విషయం ప్రాజెక్టు మొత్తం వ్యయ అంచనా రూ. 1.27లక్షల కోట్లు కాగా, ఇప్పటివరకు రూ. 93 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఈ ప్రాజెక్టుకైన వ్యయం, నాణ్యత, నిధుల దుర్వినియోగంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు వైఎస్ జగన్ పరామర్శ

ప్రమాదం, సర్జరీ గురించి అడిగి తెలుసుకున్న ఏపీ సీఎం

- ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపైనా ఆరా
- జగన్‌కు ఘన స్వాగతం పలికిన బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తెలంగాణ మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావును పరామర్శించారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల అనంతరం ఫామ్‌హౌస్‌లో జారి పడిన కేసీఆర్‌కు తుంటి ఎముక విరిగిన విషయం తెలిసిందే. అనంతరం ఆయనకు హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ జరగగా, కొద్దిరోజుల నుంచి జూబ్లీహిల్స్ నందినగర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను పరామర్శించేందుకు వైఎస్ జగన్ హైదరాబాద్‌కు వచ్చారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆయనకు మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి జగన్ నేరుగా కేసీఆర్ ఇంటికి వెళ్లారు. అక్కడ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఎదురెళ్లి జగన్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. కాగా కేసీఆర్‌ను పలకరించిన జగన్ పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. అనంతరం కేసీఆర్‌కు జరిగిన ప్రమాదం, సర్జరీ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తర్వాత ఇరువురు నేతలు పలు అంశాలపై మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా జగన్ అల్పాహారం, తేనీరు తీసుకున్నారు. కేసీఆర్‌కు తిరుమల వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కాగా ఆయనకు కేటీఆర్, ఇతర నాయకులు కారు వద్ద వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులున్నారు. జగన్ వెంట ఏపీకి చెందిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘురాం, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

నాలుగైదు వారాల్లో కేసీఆర్ రికవరీ

మరో నాలుగైదు వారాల్లో కేసీఆర్ పూర్తిగా రికవరీ అవుతారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. జగన్ పరామర్శ అనంతరం తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రస్తుతం బెడ్ మీదే రెస్ట్ తీసుకుంటున్నారని, మరో నాలుగైదు వారాల్లో సాధారణ స్థితికి చేరుకుంటారని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకే జగన్ వచ్చారని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని స్పష్టం చేశారు.



ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను సాదరంగా ఆహ్వానించి తీసుకెళ్తున్న కేటీఆర్

కమీషన్ తీసుకుంటే విచారణ చేయించండి

'కాళేశ్వరం'పై రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్

- నా ఆదాయం, రేవంత్‌రెడ్డి ఆదాయంపై విచారణకు సిద్ధం
- మా ఇద్దరి ప్రస్థానం ఎలా మొదలైందో, ఎవరిపై ఎలాంటి ఆరోపణలు వచ్చాయో అందరికీ తెలుసు
- ఫార్మాసిటీపై 15 రోజుల్లోనే యూటర్న్ ఎందుకు?
- ఫార్మా లాబీయింగ్‌కు లొంగిపోయారా?



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో తాను కమీషన్ తీసుకున్నట్లు కొందరు ఆరోపిస్తున్నందున దానిపై విచారణ జరిపించాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదాయం ఎంతో, తన ఆదాయం ఎంతో విచారణకు సిద్ధమని ప్రకటించారు. బీజేపీలో తన ప్రస్థానం ఎలా మొదలైందో, రేవంత్‌రెడ్డి రాజకీయ జీవితం ఎలా ప్రారంభమైందో ఎవరు ఏ రకంగా డబ్బు సంపాదించారో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. ఎవరిపై ఎలాంటి ఆరోపణలు వచ్చాయో మొత్తం తెలంగాణ సమాజం ఎదుటే ఉందని వ్యాఖ్యానించారు. మాజీ సీఎం కుటుంబంతో వ్యాపార భాగస్వామ్యం ఉన్నది కూడా ఎవరికో అందరికీ తెలుసునన్నారు. 'తాను కేసీఆర్‌కు బినామీ కాదు..తనపై ఆరోపణలు చేస్తున్న వారే కేసీఆర్‌కు బినామీలు' అని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిరర్థకంగా మారడంతో అందరూ బాధ పడుతున్నారని, దీనిపై న్యాయ విచారణతో పాటు సీబీఐ విచారణ జరిపించాలని తాను కోరితే కాంగ్రెస్ నేతలు ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు విషయం పక్కన పెట్టి తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత సీఎం గతంలో ఎంపీగా కాళేశ్వరం అవినీతిపై తన దగ్గర ఆధారాలు ఉన్నాయని సీబీఐకి లేఖ రాస్తున్నట్లు చెప్పారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉన్నపుడు సీబీఐ విచారణకు లేని అభ్యంతరం సీఎం అయ్యాక ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. న్యాయ విచారణ పేరిట కాలయాపన చేసి కేసీఆర్‌ను కాపాడాలనుకుంటే తాను చేసేదేమీ లేదన్నారు.

లంకె బిందెల కోసం వచ్చారా రేవంత్

లంకె బిందెలు ఉన్నాయని వస్తే ఇక్కడ ఖాళీ బిందెలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఆయన లంకె బిందెల కోసం వచ్చారా అని కిషన్‌రెడ్డి నిలదీశారు. ఫార్మా సిటీ రద్దు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మళ్లీ ఫార్మా సిటీ ఉంటుందని చెప్పారని 15 రోజుల్లోనే ప్రభుత్వం ఎందుకు యూటర్న్ తీసుకుందనీ, అందులో మతలబు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఫార్మా కంపెనీల లాబీయింగ్‌కు లొంగిపోయారా అని నిలదీశారు.

మోదీ మెడిసిన్ ప్రపంచానికే సంజీవని..

మోదీ మెడిసిన్‌కు కాలం తీరిపోయిందని రేవంత్‌రెడ్డి చెబుతున్నారు... ఆయన ఎప్పుడు ఆ మందు వేసుకున్నారని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. 'మీ రాహుల్ గాంధీ ఉన్నన్ని రోజులు ఆ మెడిసిన్ రిజెక్ట్ కాదు.. మోదీ మెడిసిన్ ప్రపంచానికే సంజీవని'' అని వ్యాఖ్యానించారు. 'బీఆర్‌ఎస్ ఔట్ డేటెడ్ పార్టీ. ఆ పార్టీ అవసరం తెలంగాణకు లేదు, లోక్‌సభ ఎన్నికల్లో చిరునామా గల్లంతవ్వడం ఖాయం'' అని అన్నారు.

అభయ హస్తం పేరుతో ప్రజల్లో గందరగోళం

'అభయ హస్తం పేరుతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. ఆ ఫారం నింపడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు.. కాలయాపన కోసమే ఇదంతా. ఇందులో రాజకీయం తప్ప చిత్తశుద్ధి లేదు. ఫార్మ్ బ్లాక్‌లో కొనుక్కోవాల్సి వస్తుంది. దరఖాస్తు అవసరం లేకుండానే ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి ఇవ్వలేదు... ఆ విషయం తెలిసి కూడా దరఖాస్తులకు రేషన్ కార్డ్ జత చేయమనడం ఎందుకు? లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లబ్ధికోసమే ప్రజలను తమచుట్టూ తిప్పుకుని ఇబ్బందిపెడుతున్నారు' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

కేసీఆర్ ఆ హక్కు కోల్పోయారు

- తెలంగాణ పదాన్ని ఉచ్చరించే అర్హత ఆయనకు లేదు
- రాష్ట్రంలో నంబర్ వన్ 420 కేసీఆరే
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ ఎస్‌గా టీఆర్‌ఎస్‌ను మార్చి తెలంగాణ పదాన్ని ఉచ్చరించే నైతిక హక్కును కేసీఆర్ కోల్పోయారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అవినీతి బయటపడుతుందని కాళేశ్వరం ప్రాజెక్టుకి జాతీయ హోదా అడగలేదని విమర్శించారు. రాష్ట్రంలో నంబర్ వన్ 420 ఎవరైనా ఉన్నారంటే అది కేసీఆరే అని ధ్వజమెత్తారు. తాను మోసగాడు అయినందున అందరూ మోసగాళ్లే అని కేటీఆర్ అనుకుంటే ఎలా అని ప్రశ్నించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల రోజుల్లోనే హామీలను అమలు చేయలేదని, కాంగ్రెస్‌ను 420 అని కేటీఆర్ అనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణ వసతి కల్పించిందని గుర్తు చేశారు. తాము ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలని ఒకసారి కేటీ ఆర్ మననం చేసుకుంటే మంచిదన్నారు. దళితుడిని సీఎం చేస్తానని, ఆ తర్వాత మూడెకరాల భూమి అంటూ దళితులని కేసీఆర్ మోసం చేశారన్నారు. న్యాయ, సీబీఐ విచారణలలో ఏది పెద్దదో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లోకి వైఎస్ షర్మిల

- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్ సమక్షంలో చేరిక
- వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటన
- సోనియా గాంధీతో మర్యాదపూర్వకంగా సమావేశం



ఖర్గే, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వైఎస్ షర్మిల

సాక్షి, న్యూఢిల్లీ: యువజన శ్రామిక రైతు తెలంగాణ పార్టీ (వైఎస్సార్‌టీపీ) అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ఈ సందర్భంగా షర్మిల ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏపీ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, ఏపీ పీసీసీ చీఫ్ రుద్రరాజు, ఏఐసీసీ సీనియర్ నేత కొప్పుల రాజుతోపాటు షర్మిల భర్త బ్రదర్ అనిల్ కుమార్, పలువురు వైఎస్సార్‌టీపీ నేతలు పాల్గొన్నారు. కాగా, షర్మిలకు కండువా కప్పిన అనంతరం బ్రదర్ అనిల్‌కు సైతం ఖర్గే కండువా కప్పేందుకు ప్రయత్నించగా ఆయన సున్నితంగా నిరాకరించారు. షర్మిల సైతం తాను ఒక్కదానినే చేరుతున్నట్లు పేర్కొనగా మరి వేదికపైకి మీరెందుకు వచ్చారని ఖర్గే నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం అనంతరం పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో షర్మిల దంపతులు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆ తర్వాత షర్మిల మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్ అభ్యున్నతికి పనిచేస్తా...

కాంగ్రెస్‌లో చేరడంపట్ల తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆత్మ సంతోషిస్తుందని షర్మిల పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనేది తన తండ్రి కల అని.. ఆ కల నెరవేర్చేందుకు, పార్టీ అభ్యున్నతి కోసం పనిచేస్తానని చెప్పారు. కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ఉద్దేశంతోనే తెలంగాణలో కాంగ్రెస్‌కు తాను మద్దతు ప్రకటించి పోటీ చేయలేదని వెల్లడించారు. కడప ఎంపీ సీటు నుంచి పోటీ చేస్తారా లేక ఏదైనా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా అని మీడియా ప్రశ్నించగా పార్టీ ఆదేశిస్తే అండమాన్ నుంచైనా పోటీకి సిద్ధమని షర్మిల ప్రకటించారు. మరో రెండ్రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పారు. మరోవైపు ఏపీలో షర్మిలకు ఎలాంటి బాధ్యతలు ఇవ్వాలనేది పార్టీ అధిష్టానం కసరత్తు చేస్తుందని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్ పేర్కొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటూ రాదు



ఆ ఎన్నికల తర్వాత కారు పార్టీ కనుమరుగవుతుంది

- ఓడినా బీఆర్‌ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదు
- బీఆర్‌ఎస్ 420నో కాదో ప్రజలకు తెలుసు
- నెలరోజులకే ప్రభుత్వంపై అక్కసు ఎందుకు: మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒక్క స్థానం కూడా గెలిచే అవకాశం లేదని పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తరువాత కారు పార్టీ కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా బీఆర్‌ఎస్ నాయకుల్లో అహంకారం తగ్గలేదన్నారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. 2018 ఎన్నికల్లో గెలిచిన తరువాత 36 రోజుల వరకు కనీసం అసెంబ్లీ సమావేశాలు కూడా ఏర్పాటు చేయని బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలరోజులు కూడా కాకముందే రెండు హామీలను అమలు చేయడమే కాక, ప్రజల నుంచి అభయహస్తం అమలు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలియదా అని ఆయన ప్రశ్నించారు. డిసెంబర్ 3న ఫలితాలు వచ్చిన నాలుగు రోజుల్లోనే మంత్రివర్గం ఏర్పడటం, మంత్రివర్గం ఏర్పాటైన రెండురోజుల్లోనే శాసన సభ సమావేశాలు ప్రారంభించడమేకాక, మహిళ లకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని పెంచిన విషయాన్ని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఆరున్నర కోట్ల మంది మహిళలు బస్సులో ఉచిత ప్రయాణం చేశారన్నారు. మీరు అధికారంలోకి వచ్చిన తరువాత రెండునెలల వరకు మంత్రివర్గం కూడా ఏర్పాటు చేయకపోవడం బాధ్యతారాహిత్యం కాదా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ విడుదల చేసిన బుక్‌లెట్‌పై మంత్రి మండిపడ్డారు. నెల కాకుండానే ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కడం దారుణమన్నారు.

తొందరపాటు ఎందుకు.. ముందు పార్టీని చక్కదిద్దుకోండి

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్‌కు ఎందుకంత తొందరపాటు అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ప్రజలకి ఇచ్చిన వాగ్దానాలను ఒకటి తర్వాత ఒకటి పూర్తి చేస్తున్నామన్నారు. మీరేమైనా సూచనలు చేస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాలు పెట్టడం కాదు క్షేత్రస్థాయికి వెళ్లి చూడండని హితవు పలికారు.. విభజన హామీలపై ఏమాత్రం పోరాటం చేయని బీఆర్‌ఎస్ 420నో కాదో ప్రజలకు తెలుసు నని అన్నారు. అధికారం పోయిందనే అక్కసుతో ఆరోపణలు చేయడం సరికాదని, ముందు పార్టీని చక్కదిద్దుకోవాలని సూచించారు. కొంతమంది ఆటో డ్రైవర్‌లను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకొనే ప్రయత్నం చేస్తున్నారని శ్రీధర్‌బాబు విమర్శించారు.

ఆ ఐదు ఎంపీ సీట్లపై సీపీఐ ఫోకస్

పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాలపై ఫోకస్ పెట్టామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. ఖమ్మం, వరంగల్, పెద్దపల్లి, నల్లగొండ, భువనగిరి స్థానాలపైన దృష్టి పెట్టామని, అందులో ఏదో ఒకస్థానంలో పోటీ చేస్తామన్నారు. రెండు రోజులపాటు జరిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ, సమితి సమావేశాల వివరాలను గురువారం సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషాతో కలిసి కూనంనేని మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలపై విశ్లేషణ జరిగిందని, ఎన్నికల అవగాహన ఒప్పందంతో తాము సంతృప్తికరంగా లేమన్నారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వానికి కొంత సమయమిస్తామని, ప్రజల పక్షాన గొంతును వినిపిస్తామని కూనంనేని తెలిపారు.

జాతీయ హోదా చాన్స్ లేదు

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, సీఎస్ శాంతికుమారి, సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ మురళీధర్, సీఈ హమీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హోదా పరిశీలనే లేదు..

పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదాతో పాటు వివిధ అనుమతులకు సంబంధించిన రెండు వినతిపత్రాలను రాష్ట్ర బృందం షెకావత్‌కు అందజేసింది. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి.. ''ప్రస్తుతం దేశంలో సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చే విషయాన్ని కేంద్రం పరిశీలించడంగానీ, పరిగణనలోకి తీసుకోవడంగానీ లేదు. జాతీయ హోదా అంశాన్ని కేంద్రం పక్కనపెట్టింది. పోలవరం తర్వాత కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఇచ్చిన జాతీయ హోదానే వెనక్కి తీసుకోవాలనే యోచన ఉంది. అయితే జాతీయ హోదాకు బదులు పాలమూరు ప్రాజెక్టుకు మరో రకంగా సాయం చేస్తాం. ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిన నిధులు ఇచ్చేందుకు కృషి చేస్తాం. ఈ పథకం ద్వారా గరిష్ట సాయం అందేందుకు ఆస్కారం ఉంటుంది'' అని స్పష్టం చేశారు.

అనుమతులు ఇప్పించండి

పాలమూరు ప్రాజెక్టును మిగులు జలాల ఆధారంగా చేపట్టినా.. తర్వాత ప్రభుత్వం 75 శాతం డిపెండబులిటీ ఆధారంగా ప్రాజెక్టుకు 90 టీఎంసీల నీటిని కేటాయించిందని కేంద్ర మంత్రికి రాష్ట్ర బృందం తెలిపింది. ఇందులో మైనర్ ఇరిగేషన్ కింద వినియోగించుకోలేని 45 టీఎంసీలు, గోదావరి మళ్లింపు జలాల ఆధారంగా రాష్ట్రానికి దక్కే వాటా 45 టీఎంసీలు ఉన్నాయని వివరించింది. రూ.55,086 కోట్ల వ్యయ అంచనాతో చేపట్టిన ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇప్పటికే కేంద్ర జల సంఘం పరిశీలనకు పంపామని వెల్లడించింది. ప్రాజెక్టుకు ఇప్పటివరకు అటవీ, పర్యావరణ, వైల్డ్ లైఫ్ వంటి అనుమతులు వచ్చాయని.. హైడ్రాలజీ, ఇరిగేషన్ ప్లానింగ్, కాస్ట్ ఎస్టిమేట్, అంతర్రాష్ట్ర వ్యవహారాలకు సంబంధించిన అనుమతులు రావాల్సి ఉందని తెలిపింది. ఈ అనుమతులు వీలైనంత త్వరగా ఇప్పించేలా చొరవ చూపాలని కోరింది.

సానుకూలంగా స్పందించారు.. ఉత్తమ్: ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా విధానం లేదని కేంద్ర మంత్రి షెకావత్ చెప్పారని భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాకు తెలిపారు. ఇతర పథకాల కింద పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు సాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ప్రాజెక్టుకు ఇంకా రావాల్సిన అనుమతులు ఇప్పించే అంశంపై సానుకూలంగా స్పందించారని వివరించారు. కేంద్రం వేరే విధంగా సాయం చేస్తామన్న కేంద్ర మంత్రి హామీకి రాష్ట్రం ఓకే చెప్పిందా? అని ప్రశ్నించగా.. దీనిపై సీఎం నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

'విభజన'ను పూర్తి చేయండి

తెలంగాణ రాష్ట్రానికి అదనంగా ఐపీఎస్ అధికారులను కేటాయించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు కేవలం 76 మంది ఐపీఎస్‌లనే కేటాయించారని తెలిపారు. జిల్లాల విభజన, వివిధ శాఖల పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్రానికి అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు ఇవ్వాలని కోరారు. దీనిపై అమిత్ షా సానుకూలంగా స్పందించారు. 2024లో కొత్తగా వచ్చే ఐపీఎస్ బ్యాచ్ నుంచి తెలంగాణకు అధికారులను అదనంగా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ సీఎంగా బాధ్యతలు స్వీకరించాక రేవంత్ తొలిసారిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. ఢిల్లీ నార్త్ బ్లాక్‌లోని అమిత్ షా కార్యాలయంలో గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వినతిపత్రం ఇచ్చారు. ''రాష్ట్ర పునర్విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల విభజనను పూర్తి చేయాలి. పదో షెడ్యూల్ పరిధిలోని సంస్థల వివాదాన్ని పరిష్కరించాలి. ఢిల్లీలోని ఉమ్మడి రాష్ట్ర భవన్ విభజనను సాఫీగా పూర్తి చేయాలి. చట్టంలో ఎక్కడా పేర్కొనకుండా ఉన్న సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకుంటున్న విషయంపై దృష్టి సారించాలి. తెలంగాణలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ.88 కోట్లు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ.90 కోట్లు అదనంగా కేటాయించాలి. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్, హైకోర్టు భవనం, లోకాయుక్త, ఎస్‌హెచ్‌ఆర్సీ వంటి భవనాలను వినియోగించుకున్నందున.. ఆ రాష్ట్రం నుంచి వడ్డీతో కలిపి మొత్తం రూ.408 కోట్లు ఇప్పించాలి..'' అని వినతిపత్రంలో కోరారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ శుక్రవారం ఉదయం ఢిల్లీలో యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనితో భేటీ కానున్నారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీని రూపొందించాలన్న ఉద్దేశంతో ఈ భేటీ జరగనుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

టీపీసీసీ తీర్మానం అందజేత..: సోనియా గాంధీ తెలంగాణ నుంచే పోటీ చేయాలంటూ టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానాన్ని రేవంత్‌రెడ్డి అధిష్టానానికి అందించారు. గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతల సమావేశానికి తెలంగాణ నుంచి సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరయ్యారు.

'మెట్రో' సవరణలను ఆమోదించండి

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరీతో భేటీ అయిన సీఎం రేవంత్ బృందం రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రం సమర్పించింది. ''హైదరాబాద్ మెట్రో రెండో దశ సవరించిన ప్రతిపాదనలు ఆమోదించండి. సవరించిన ప్రతిపాదనల ప్రకారం ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే విషయాన్ని పరిశీలించండి. హైదరాబాద్‌లోని మూసీ రివర్ ఫ్రంట్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. అమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్స్ వాటర్ స్పోర్ట్స్, బిజినెస్ ఏరియా, దుకాణ సముదాయాలతో బహుళ విధాలా ఉపయోగపడేలా చేయాలని నిర్ణయించాం. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. అవసరమైన మద్దతు ఇవ్వాలి. రాష్ట్రంలో పేదలకు నిర్మించి ఇచ్చే ఇందిరమ్మ ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరు చేసేలా అనుమతి ఇవ్వాలి. తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలి..'' అని రాష్ట్ర బృందం కోరింది.



అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన చిరంజీవి

సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి, ఆయన సతీ మణి సురేఖ మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారంరాత్రి ఇక్కడి ప్రజాభవన్‌లో భట్టిని కలుసుకున్న సందర్భంగా కశ్మీర్ శాలువాతో చిరంజీవి సత్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో భట్టి సన్మానించారు. డిప్యూటీ సీఎం వెంట ఆయన సతీమణి మల్లు నందిని విక్రమార్క, కుమారుడు సూర్య విక్రమాదిత్య ఉన్నారు.

విద్యుత్ సంస్థల సామర్థ్యం పెంచాలి

ప్రణాళికలు సిద్ధం చేయండి • ఉన్నతాధికారులతో భట్టి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనాల ప్రకారం 2031–32 సంవత్సరాల మధ్య విద్యుత్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గురువారం విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రామగుండం ఎన్టీపీసీ ఫేజ్–2 లో 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి గాను థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర విభజన చట్టం హామీల ప్రకారం ఎన్టీపీసీ ద్వారా 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఆధ్వర్యంలో జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో అదనంగా 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మాణం పనులను చేపట్టాలని చెప్పారు. వచ్చే వేసవిలో విద్యుత్ కొరత ఏర్పడకుండా జాగ్రత్త పడాలని అధికారులను భట్టి ఆదేశించారు. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో ఇన్‌చార్జి సీఎండీ సయ్యద్ ముర్తుజా రిజ్వీ సహా పలువురు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

చిన్నారులపై లైంగిక వేధింపులా?

1098 లేదా 87126 56858 నంబర్లలో ఫిర్యాదు చేయాలి

సాక్షి, హైదరాబాద్: చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడే, చిన్నారుల అక్రమరవాణాకు పాల్పడేవారిపై రాష్ట్ర మహిళాభద్రత విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఈ మేరకు నిందితుల సమాచారం అందించేందుకు ఫోన్ నంబర్లను ప్రకటించింది. ఇలాంటి అంశాలపై ఫిర్యాదు చేసేందుకు 1098 లేదా డయల్ 100 టోల్ ఫ్రీ నంబర్‌కుగానీ, +91 87126 56858కుగానీ ఫిర్యాదు చేయాలని మహిళాభద్రత విభాగం 'ఎక్స్'లో పేర్కొంది. ఆపరేషన్ స్మైల్–10లో భాగంగా ఈ ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్టు తెలిపింది.



కొత్తగా బాధ్యతలు చేపట్టిన అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ అడ్వొకేట్ జనరల్స్ ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డిలను గురువారం సన్మానిస్తున్న హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్. చిత్రంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు, కార్యదర్శులు ప్రదీప్, దేవేందర్, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్ తదితరులు.

డాక్టర్ జావెద్ అలీకి జేసీ బోస్ ఫెలోషిప్

బంజారాహిల్స్: ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ డాక్టర్ జావెద్ అలీ ప్రతిష్టాత్మక జేసీ బోస్ ఫెలోషిప్ (వైద్య రంగం) అందుకున్నారు. నేత్ర వైద్యంలో భాగమైన డాక్రియాలజీ (కన్నీళ్లకు సంబంధించిన శాస్త్రం)కి ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, శాస్త్ర–ఇంజనీరింగ్ పరిశోధన బోర్డు (ఎస్ఈఆర్‌బీ) ఈ ఫెలోషిప్‌ను ఆయనకు ప్రదానం చేశాయి. డాక్టర్ జావెద్ అలీ తన పరిశోధనలకు నెలకు రూ. 25 వేల చొప్పున ఫెలోషిప్, ఐదేళ్లపాటు ఏడాదికి రూ. 15 లక్షల రీసెర్చ్ గ్రాంట్‌ను అందుకోనున్నారు. అలాగే ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కూడా ఏటా ఓవర్ హెడ్ ఫండింగ్ పొందనుంది. జేసీ బోస్ ఫెలోషిప్ డాక్టర్ జావెద్ అలీ మాట్లాడుతూ జేసీ బోస్ ఫెలోషిప్ అందుకోవడం చాలా గౌరవంగా భావిస్తున్నానన్నారు.

'అద్దె బస్సు' డిమాండ్లు పరిశీలిస్తాం

ఇందుకోసం కమిటీ ఏర్పాటు

- వారంలో నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయం: ఆర్టీసీ
- మంత్రి పొన్నంతో భేటీ అయిన అద్దె బస్సుల యజమానులు
- సమ్మె నిర్ణయం వాయిదా.. యథావిధిగా బస్సులు నడుస్తాయన్న ఎండీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ అద్దె బస్సు నిర్వాహకుల డిమాండ్లను పరిశీలించి వాటి అమలు సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇచ్చేందుకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. వారం రోజుల్లో నివేదికను పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించింది. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి వచ్చాక రద్దీ విపరీతంగా పెరగటంతో ఐదు రకాల సమస్యలు ఎదురవుతు న్నాయని, వాటిని పరిష్కరించాలంటూ కొద్దిరోజులుగా అద్దె బస్సు యజ మానులు కోరుతున్నారు. అయినా ఆర్టీసీ స్పందించటం లేదని ఆరోపిస్తూ శుక్రవారం నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. గురువారం ఉదయం అద్దె బస్సు యజమానుల సంఘం ప్రతినిధులు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే ఎండీతో మాట్లాడి, సంఘం ప్రతినిధులతో చర్చించాలని స్పష్టం చేశారు.

చర్చలు జరిపిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

మంత్రి ఆదేశాల మేరకు బస్‌భవన్‌లో ఎండీ సజ్జనార్, ఉన్నతాధికారులతో కలిసి సంఘం ప్రతినిధులతో చర్చించారు. బస్సుల్లో రద్దీ ఎక్కువై డీజిల్ వినియోగం పెరిగినందున కేఎంపీఎల్‌ను జిల్లా సర్వీసుల్లో 4.50కి, సిటీలో 4కు మార్చాలని, టైర్లు ఎక్కువగా అరుగుతున్నందున ఆర్టీసీకి



అందించే బల్క్ ధరలకే తమకూ కొత్త టైర్లు కేటాయించాలని, ఓవర్ లోడింగ్‌తో నిర్వహణ ఖర్చులు పెరిగినందున అద్దె మొత్తాన్ని రూ.3 చొప్పున పెంచాలని వారు కోరారు. దీనిపై కమిటీ వేసి అమలు సాధ్యాసాధ్యాలపై నిర్ణయం తీసుకుంటామని ఎండీ సజ్జనార్ వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు సమ్మె ప్రతిపాదనను సంఘం ప్రతినిధులు విరమించుకున్నట్టు సమావేశానంతరం ఎండీ ప్రకటించారు. యధావిధిగా బస్సులు నడుస్తాయని, సంక్రాంతికి ప్రత్యేక బస్సులు కూడా అందుబాటులో ఉంటాయని, మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ఇబ్బందుల్లేకుండా కొనసాగుతుందని వెల్లడించారు. సమావేశంలో ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, వినోద్, అధికారులు మైపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి సహా పలువురు బస్సు యజమానుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయాలి

1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు



సూర్యాపేట: ప్రత్యేక రాష్ట్రం కోసం 1969లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో కమిటీని ఏర్పాటు చేయాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గౌరవిస్తామని చెప్పిందని, ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉద్యమకారులను ఆదుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించిందని చెప్పారు. ఈ దరఖాస్తులో ఉద్యమకారులు తమపై నమోదైన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను పొందుపర్చాలని పేర్కొందని తెలిపారు. అయితే 54 సంవత్సరాల క్రితం జరిగిన ఉద్యమంలో నమోదైన ఎఫ్ఐఆర్ కాపీలు, జైలు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు పోలీస్, జైళ్ల శాఖల అధికారులు నిరాకరిస్తున్నారని చెప్పారు. దీంతో చాలామంది ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఓ కమిటీని వేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సీతారాంరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరు లు పాల్గొన్నారు.

విద్య, పరిశోధనలో సంస్కరణలు అవసరం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణ సంస్థలో సంస్కరణలు అవసరమని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కూడా ఇదే కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యా శిక్షణ, పరిశోధన సంస్థ ప్రమాణాలు ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచేలా మంచి శిక్షణ, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులను అనుసంధానించేలా కార్యక్రమాలుండాలని స్పష్టం చేశారు. విద్యా పరిశోధన శిక్షణ సంస్థను విద్యావసరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.

సోషల్ మీడియాపై ఫోకస్ పెంచాలి

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశం నిర్వహించాలి. వారిని ఎన్నికలకు సన్నద్ధం చేయాలి. ప్రతి ఓటు కీలకం. కాబట్టి ఓట్లు చీలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు కష్టం వస్తే ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ పార్టీనే. బీజేపీ నేతలపై ప్రజలకు విశ్వాసం లేదు. కరీంనగర్ ప్రజల ఆశీర్వాదమే 23 ఏళ్ల పార్టీ రాజకీయ ప్రస్థానం. పార్టీకి జన్మనిచ్చి, కష్టకాలంలో పునర్జన్మ నిచ్చింది కూడా కరీంనగరే. కేసీఆర్‌ను ఉద్యమ సమయంలో కాపాడుకుని, తెలంగాణను సగర్వంగా నిలిపింది కూడా కరీంనగరే..' అని కేటీఆర్ కొనియాడారు.

ప్రజలకు కృతజ్ఞత చెప్పాలి

'కొత్తగా ఏర్పడిన రాష్ట్రం కావడంతో పదేళ్ల అకుంఠిత దీక్షతో పనిచేశాం. అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టాం. రెండుసార్లు అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పాలి. పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు తలెత్తుకునే పనులే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేశారు తప్ప తలదించుకునే పని చేయలేదు. ప్రభుత్వం, పార్టీ వేరు కాదనే ఉద్దేశంతో పనిచేశాం. సంస్థాగత నిర్మాణంపై అంతగా దృష్టి పెట్టలేదు. వివిధ స్థాయిల్లో పార్టీ కమిటీలకు జిల్లా అధ్యక్షులను నియమించినా, పూర్తి కమిటీలు వేయలేదు. అనుబంధ కమిటీల నిర్మాణం చేయలేకపోయాం. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని కార్యకర్తలకు పనులు ఇవ్వలేదు. పనులిస్తే దుష్ప్రచారం చేస్తారని భావించామే తప్ప, చిన్న చూపుతో కాదు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సర్పంచ్ మొదలుకొని అన్ని పదవుల్లో బీఆర్ఎస్ వాళ్లే ఉన్నప్పటికీ, మనోడు గెలవాలనే కసితో పని చేయలేదు. ఇతర పార్టీల్లో నలుగురైదుగురే ఉన్నా కసితో పని చేశారు. అందుకే వారు విజయం సాధించారు..' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఎవరికీ భయపడొద్దు

'నిన్నగాక మొన్న అధికారంలోకి వచ్చిన వాళ్లు గర్వంతో విర్రవీగుతారు. కొత్త బిచ్చగాళ్ల తీరుగా పట్టించుకోవద్దు. కేసుల పేరుతో బెదిరించినా భయపడొద్దు. మేము అండగా ఉంటాం. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు పోలింగ్ ఏజెంట్లను కూడా ప్రభావితం చేస్తారు. అప్రమత్తంగా ఉండాలి. కరీంనగర్‌లోని ఏడు అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లను చూస్తే ఇతర పార్టీల కన్నా బీఆర్ఎస్‌కే ఆధిక్యం ఉంది. ప్రతి ఒక్కరూ ఒక్కొక్క బూత్‌లో 50 ఓట్లు ఎక్కువ వేయిస్తే లక్ష ఓట్లతో విజయం సాధిస్తాం. ప్రశ్నించే గొంతుక వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది..' అని కేటీఆర్ చెప్పారు. మాజీమంత్రి హరీశ్‌రావు ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఎంపీ కె.కేశవరావు, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల సన్నద్ధత విషయంలో పార్టీ వ్యూహాన్ని వివరించారు.

అవమానం తట్టుకోలేక
రైతు ఆత్మహత్య

- కొట్టి బలవంతంగా బైక్ లాక్కెళ్లిన ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు
- బైక్ ఓనర్‌కు ఏ సమాధానం చెప్పాలో తెలియక బలవన్మరణం



ధర్నా చేస్తున్న లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

భువనగిరి క్రైం: ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుల చేష్టలతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గూగుల్‌గుట్ట తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన బానోతు మంజీనాయక్(35) తన వ్యక్తిగత అవసరం కోసం నాలుగు రోజుల క్రితం ధరావత్ సంధ్యకు చెందిన ద్విచక్ర వాహనాన్ని తీసుకుని బయటకు వెళ్లాడు. అయితే ఆ బైక్‌పై ఫైనాన్స్ కిస్తీలు ఉన్నాయి. దీంతో వారు ఆ బైక్ కోసం చూస్తుండగా, మంజీనాయక్ తారసపడ్డాడు. దీంతో ఫైనాన్స్‌కు సంబంధించిన వ్యక్తులు మంజీనాయక్‌ను కొట్టి బలవంతంగా ఆ బైక్‌ను లాక్కెళ్లారు. దీంతో బైక్ ఓనర్‌కు ఏం సమాధానం చెప్పాలో తెలియక, మనస్తాపానికి లోనై బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం విషయం తెలుసుకున్న లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు, బంధువులు పెద్ద సంఖ్యలో భువనగిరి జిల్లా కేంద్రంలోని ఫైనాన్స్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఫైనాన్స్ సంస్థ నిర్వాకం వల్ల అమాయక రైతు బలయ్యాడన్నారు. ఫైనాన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, మరణించిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పార్టీ నుంచి ఒక్కరు పోతే కాంగ్రెస్ నుంచి పది మంది వస్తారు

మాజీ మంత్రి గంగుల కమలాకర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి ఒక్కరు బయటకు పోతే కాంగ్రెస్ పార్టీ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వస్తారని మాజీ మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన పార్లమెంటరీ పార్టీ సన్నాహక సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కానీ తాము ఇప్పుడున్న ప్రభుత్వం కూలిపోవాలని కోరుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై తాము అడుగుతుంటే మంత్రి శ్రీధర్ బాబు అసహనంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతుల దగ్గర విత్తనాల కోసం డబ్బులు లేవని, రైతు బంధు ఎప్పుడు పడుతుందో స్పష్టంగా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని గంగుల ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను ఈసారి గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామనీ, వినోద్ కుమార్ ఎంపీగా గెలవడం ఇప్పుడు అవసరమని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో అంధులకు సౌండ్ సిస్టం

వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హామీ



లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

చాదర్‌ఘాట్ (హైదరాబాద్): మెట్రో రైల్ స్టేషన్ మాదిరిగానే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అంధుల కోసం ప్రత్యేక సౌండ్ సిస్టం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని గురువారం మలక్‌పేటలోని జాతీ య వికలాంగుల పార్కులో ఆయన విగ్రహానికి మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధుల కోసం లిపిని కనుగొని వారి జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప మేధావి బ్రెయిలీ అని కొనియాడారు. దివ్యాంగుల సంక్షేమం, అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. దివ్యాంగుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నవిధంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రానున్న ఉద్యోగ నోటిఫికేషన్‌లో దివ్యాంగుల కోటాను పెంచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె అంధులకు ల్యాప్‌టాప్‌లు, 4జీ ఫోన్‌లు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ లిపిలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల, ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్ కేఆర్ఎస్ లక్ష్మి, ముత్తినేని వీరయ పాల్గొన్నారు.

అధికారం పోయిందని బీఆర్ఎస్‌కు అక్కసు

- మహిళలకు ఉచిత బస్సు వసతి వద్దంటారా
- బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ధ్వజం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అధికారం పోయిందనే అక్కసు బీఆర్ఎస్‌లో కనిపిస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ప్రజలు గడీల పాలన కాదు.. గల్లీ బిడ్డల పాలన కావాలని కోరుకున్నారని అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2018లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించడానికే 35 రోజుల సమయం తీసుకుందన్నారు. కానీ డిసెంబర్ 7న కాంగ్రెస్ సర్కార్ ప్రమాణ స్వీకారం చేసిన రెండురోజులకే రెండు పథకాలు అమలు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై బీఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు వసతి ఇవ్వద్దు అంటారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ఉద్యమం అంటున్నారన్నారు. 'పదేళ్లు దోచుకున్న 420లు మీరు అని ప్రజలు గుర్తించే ఓడగొట్టారు. బీఆర్ఎస్ 420 పార్టీ. ధర్నా చౌక్ లేకుండా చేసింది మీరు'అని సీతక్క ధ్వజమెత్తారు.

మండల కేంద్రాల నుంచి గ్రామాలకు రోడ్లు ఉండాలి

రాష్ట్రంలోని మండల కేంద్రాల నుంచి అన్ని గ్రామీణ ప్రాంతాలు, తండాలకు రోడ్ల అనుసంధానం ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె సచివాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంచాయతీరాజ్ పనులకు నాబార్డు నుంచి నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, నాసిరకమైన పనులు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాఖాపరమైన సమస్యలు, పెండింగ్ బిల్లుల విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

SANTHIRAM MEDICAL COLLEGE & GENERAL HOSPITAL
NH-40, NANDYAL - 518501, Andhra Pradesh, India.
(Recoginized by Govt. of India & National Medical Commission, New Delhi)
Contact : 7702999391, 9866308444.
email: principal_srmcnandyal@yahoo.co.in Website: www.santhirammedicalcollege.com
Applications are invited from the eligible candidates for the following Posts.
Professors, Associate Professors, Assistant Professors, Senior Residents.
Pre & Para Clinical Departments:
Clinical Departments:
Note:
1. Free accommodation will be provided with in the campus and all are required to reside inside the campus.
2. All the teaching faculty will be selected as per the N.M.C. norms.
3. Salary is negotiable and will be fixed based on their experience, expertise and dedication.
Candidates are required to send their Bio-data by Email to mail ID: principal_srmcnandyal@yahoo.co.in on or before 20-01-2024. PRINCIPAL

ANNAMACHARYA INSTITUTE OF TECHNOLOGY AND SCIENCES - RAJAMPET
Estd 1998 (AUTONOMOUS)
New Boyanapalli, RAJAMPET, Annamayya District. (formerly Kadapa Dist.) A.P.
Approved by AICTE, New Delhi & Affiliated to JNTUA, Anantapuramu
Accredited by NBA & NAAC with 'A' Grade.
Counseling Code: AITS website: www.aitsrajampet.ac.in
WANTED FACULTY
Applications are invited for the following positions at the Institute.
Professors / Associate Professors / Assistant Professors in the Departments of CSE, CSE(AI), CSE(DS), Artificial Intelligence & Data Science, Artificial Intelligence & Machine Learning, ECE, Civil, Physics, MBA, MCA, Psychiatry, Yoga Trainer.
Qualifications: As per AICTE Norms
Non-Teaching positions: Radio Jockey
Qualification: As per Ministry of Broadcasting norms / at least six months of experience as Radio Jockey.
Salary: Commensurate with qualifications & experience.
Apply before 08-01-2024 through www.aitsrajampet.ac.in/recruitment
Ph.9666675279. PRINCIPAL





నీ చెంపలను గర్వంతో, ప్రజల యెదుట ఉబ్బించకు.
భూమిపై అహంకారంతో నడవకు. నిశ్చయంగా, అల్లాహ్ డాంబికాలు
చెప్పుకొని, విర్రవీగే వాడంటే ఇష్టపడడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 5 జనవరి 2024

కూటమిలో అనైక్యతా రాగం

ఎన్నికల సంవత్సరంలోకి వచ్చేశాం. కొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పటికే రామమందిరం సహా రకరకాల వ్యూహాలతో జనంలోకి దూసుకుపోతోంది. మరి, బలమైన అధికార పక్షాన్ని ఢీ కొట్టాల్సిన ప్రతిపక్షాల మాటేంటి? అవి ఇప్పటికీ అయోమయంలో ఉన్నట్టున్నాయి. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పార్టీలు పేరుకు ఒకే సమూహంగా ఉన్నా, అనేక అంశాల్లో అవి ఒక్క తాటి మీదకు రాలేకపోతున్న దుఃస్థితి కళ్ళకు కడుతోంది. ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, ఎవరెక్కడ పోటీ చేయాలి, సీట్ల సర్దుబాటేంటి తదితర అంశాలు దేవుడెరుగు, కనీసం ఈ కూటమికి ఎవరు కన్వీనర్‌గా ఉండాలనే అంశంలోనూ ఏకాభిప్రాయం కొరవడింది. ఈ వార్తలు కూటమి బలహీనతలను బట్టబయలు చేస్తున్నాయి. బిహార్‌లో జేడీయూ నేత నితీశ్ కుమార్‌ను దింపి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను సీఎంను చేసేందుకు ఇటీవల జరిగిన విఫల యత్నం 'ఇండియా' కూటమి పక్షాలు సొంత కాళ్ళు నరుక్కొనే మూర్ఖత్వమే!

ప్రాధాన్యం తగ్గుతోందని భావిస్తున్న బిహార్ సీఎం నితీశ్ కుమార్‌ను విపక్ష 'ఇండియా' కూటమి కన్వీనర్‌ను చేసి, బుజ్జగించాలన్నది తాజా ప్రతిపాదన. అయితే, అందుకు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సహా కొన్నిపక్షాలు ప్రతికూలం. ఈ అంశంపై కూటమి పక్షాల మధ్య గురువారం జరగాల్సిన వర్చ్యువల్ సమావేశం సైతం ఆఖరి నిమిషంలో రద్దయింది అందుకే. ఇక, కూటమిలోని రెండు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ల మధ్య ఢిల్లీ, పంజాబ్‌లలో సీట్ల సర్దుబాటుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) వర్గంతో, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీతో కూడా సరిగ్గా ఇదే పంచాయతీ కాంగ్రెస్‌కు నడుస్తోంది. అలాగే, బీజేపీతో రాజకీయ రంగు పులుముకుంటున్న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి వెళ్ళాలా, వద్దా అనే అంశంపైనా నిశ్చితాభిప్రాయం మృగ్యం. వెరసి, కూటమి పార్టీల మధ్య పరస్పర విరుద్ధ ప్రయోజనాలు, సమన్వయ లోపాలు ఎన్నికలు సమీపిస్తున్నా జవాబు లేని ప్రశ్నలుగానే మిగిలాయి.

2024 ఎన్నికల్లో మోదీని గద్దె దించాలనే లక్ష్యంతో ఈ పార్టీలన్నీ ఒక దగ్గరకు చేరాయి. కాంగ్రెస్ చొరవతో విస్తృత చర్చల తర్వాత గత జూలై 18న 26 పార్టీల కూటమిగా 'ఇండియా' ఆవిర్భవించింది. 80 మంది ఎంపీలున్న కాంగ్రెస్ ప్రాథమికంగా పెద్దన్న పాత్ర పోషిస్తుంటే, ఆ పార్టీకి వివిధ రాష్ట్రాల్లో ప్రత్యర్థులైన ఆప్, టీఎంసీ, వామపక్షాలు సైతం కూటమిలో ఉన్నాయి. ఈ బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటుకు ముందు గత ఫిబ్రవరి, మే నెలల్లో 3 రాష్ట్రాల్లో (త్రిపుర, మేఘాలయ, కర్ణాటక) ఎన్నికలు జరిగాయి. కూటమి ఏర్పడ్డాక నవంబర్‌లో 5 రాష్ట్రాలు (తెలంగాణ, మిజోరమ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) ప్రజాతీర్పు కోరాయి. రెండుసార్లూ ప్రతిపక్షాలు ఉమ్మడి ప్రత్యర్థి బీజేపీతో పాటు, తమలో తాము ఢీకొన్న పరిస్థితి. కూటమి ఉన్నా కాంగ్రెస్ ఒంటరిగా బరిలోకి దిగింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్‌లలో కాంగ్రెస్, తన కూటమి పక్షాలైన ఎస్పీ, జేడీయూలతోనూ పోటీ పడింది. ఫలితంగా మిశ్రమ ఫలితాలే దక్కాయి.

దేశంలో తూర్పు నుంచి పడమటి వరకు రాహుల్ గాంధీ చేయనున్న సరికొత్త 'భారత్ న్యాయ యాత్ర' ఈ జనవరి ప్రథమార్ధం లోనే ఆరంభం కానుంది. ఎన్నికల ముందు ప్రతిపక్షాల బలప్రదర్శనకు ఈ యాత్రను అనువుగా మలుచుకోవాలని కాంగ్రెస్ భావన. కూటమి సభ్యుల మధ్య సీట్ల పంపిణీ ఫార్ములాకు తుది రూపం ఇవ్వాలని ఆ పార్టీ అస్తుబిస్తు అవుతోంది. లోక్‌సభలో ఎన్నికలు జరిగే 543 స్థానాల్లో 290 సీట్లలో స్వయంగా పోటీ చేయాలని కాంగ్రెస్ యోచన. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో సీట్ల సర్దుబాటు చేసుకోవాలనీ, వీలైనచోటల్లా బీజేపీ సారథ్య ఎన్డీఏ అభ్యర్థికీ – తమ అభ్యర్థికీ మధ్య ముఖాముఖి పోరు జరిగేలా చూడాలని 'ఇండియా' ప్రయత్నం. అయితే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, రాహుల్‌తో ఎంత స్నేహంగా ఉన్నా సీట్ల సర్దుబాటులో నిక్కచ్చిగానే నిలబడతారు. పశ్చిమ బెంగాల్‌లో హస్తం పార్టీ క్రితంసారి గెలిచిన 2 స్థానాలు తప్ప, ఇంకేమీ ఇవ్వబోమన్నది టీఎంసీ ప్రతిపాదన. ఆ 'భిక్ష' అవసరం లేదనీ, మోదీకి అనుకూలంగా మమత పని చేస్తున్నారనీ అయిదు సార్లు ఎంపీగా ఎన్నికైన పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధినేత అధిర్ రంజన్ చౌధురి వ్యాఖ్య. స్థానిక అనివార్యతల రీత్యా రానున్న రోజుల్లో 'ఇండియా' కూటమిలో ఇలాంటి అపరిణత వ్యాఖ్యలు, పరస్పర దూషణలు మరిన్ని వినిపిస్తాయి.

ఐక్యత లేకపోవడం, ఈ అంతర్గత కుమ్ములాటలు కూటమిని బలహీనం చేస్తున్నాయి. ఇటీవల ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్, టీఎంసీల మధ్య పోరు బీజేపీకే లాభించింది. రేపు లోక్‌సభ ఎన్నికల్లోనైనా కూటమి పక్షాల మధ్య సర్దుబాటు, సమన్వయం సవ్యంగా సాగుతుందా అన్నది అనుమానమే. నిజానికి, విజయవంతమైన రాహుల్ 'భారత్ జోడో యాత్ర' మొదలు మోదీపై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం, పార్లమెంట్‌లో మూకుమ్మడి సస్పెన్షన్ల దాకా ప్రతిపక్షాలు గత ఏడాది వార్తల్లో నిలిచాయి. కానీ, కేవలం వార్తల్లో ఉంటే సరిపోదు. బీజేపీపై పోరాటం, మోదీని గద్దె దించడమే ఏకైక అజెండా అయితే అదీ జనానికి రుచించదు. కూటమికి లాభించదు. అందుకని, ఇప్పటికైనా ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు మార్గాలేమిటో 'ఇండియా' కూటమి పర్యాలోచించాలి. గమ్యానికి తగ్గట్టు గమనం ఉండాలన్నది విస్మరించి, భాగస్వామ్య పక్షాలు అభిప్రాయ భేదాలను కొనసాగిస్తే కష్టం. పిట్ట పోరు పిట్ట పోరు... పిల్లి తీర్చినట్టు అధికార బీజేపీకే కలిసొస్తుంది. ఏ పార్టీకి ఆ పార్టీ తనవైన లెక్కలు వేసుకొనే ఎన్నికల ముంగిట దాన్ని నివారించడం 'ఇండియా' కూటమికి పెను సవాలు. కలవని రైలు పట్టాల లాగే స్నేహంతో ప్రతిపక్షాలకు ఒరిగేదేమిటి?

బంగ్లా సుస్థిరత కొనసాగేనా?

విశ్లేషణ



ఆనంద్ కుమార్

భారత్‌కు సన్నిహిత పొరుగుదేశం, నమ్మదగిన భాగస్వామి అయిన బంగ్లాదేశ్‌లో జనవరి 7న ఎన్నికలు జరగనున్నాయి. 2009 నుంచి దేశ ప్రధానిగా అప్రతిహతంగా కొనసాగుతున్న షేక్ హసీనా ఈసారి కూడా తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశాలు ఎక్కువే ఉన్నాయి. అయితే, ఎన్నికలు స్వేచ్ఛగా జరగడం లేదనీ, హసీనా ఇటీవలి సంవత్సరాలలో నియంతగా మారిందనీ ఆమె విమర్శకులు ఆరోపిస్తున్నారు. అదే సమయంలో ఆమె పదవీకాలం బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరతను తెచ్చిపెట్టింది. గత దశాబ్దంలో బంగ్లాదేశ్ తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగింది. గడచిన 20 ఏళ్లలో 2.5 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

జనవరి 7న బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. పాలక అవామీ లీగ్ అధికారాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తోంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ఎన్నికలను బహిష్కరించడం వల్ల ఈ పని మరింత సులభమవుతోంది. స్వతంత్ర అభ్యర్థులతో పాటు కొన్ని చిన్న, పెద్దగా పేరులేని రాజకీయ పార్టీలు అధికార పక్షానికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్నప్పటికీ, అవి పెద్ద సవాలుగా మారే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి అఖండ మెజారిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే, బీఎన్‌పీ ఈ ఎన్నికలలో పాల్గొనక పోవడం అనేది అవామీ లీగ్ సాధించనున్న విజయంలోని ఆకర్షణను అయితే కచ్చితంగా తగ్గిస్తుంది.

బేగమ్‌ల పోరు

బంగ్లాదేశీయులు దేశ పితామహుడిగా భావించే షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తె అయిన షేక్ హసీనా అవామీ లీగ్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. సైనిక నియంత జియావుర్ రెహమాన్ భార్య ఖలీదా జియా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి సారథ్యం వహిస్తున్నారు. ఈ ఇద్దరు మహిళలను బంగ్లాదేశ్‌లోని పరస్పరం పోరాడుతున్న బేగమ్‌లు ('బ్యాటిలింగ్ బేగమ్స్') అని కూడా పిలుస్తారు.

బంగ్లాదేశ్‌లో 1990లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ తర్వాత జరిగిన తొలి మూడు ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వంతులవారీగా అధికారంలో ఉన్నాయి. అయితే 2009 నుంచి దేశానికి హసీనా సారథ్యం వహిస్తున్నారు. గత దశాబ్దపున్నర కాలంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగలేదని విమర్శకులు ఆరోపించారు. 2014 ఎన్నికలను బహిష్కరించడం బీఎన్ పీ చేసిన తప్పిదమనీ, అవామీ లీగ్ భారీ మెజారిటీతో అధికారాన్ని నిలుపుకోవడానికి అది వీలు కల్పించిందనీ కొందరు అంటున్నారు. ఈ నిర్ణయం బీఎన్‌పీనీ, దాని అగ్రనేతలనూ పార్లమెంటుకు చాలాకాలం పాటు దూరంగా ఉంచింది. ఖలీదా, తారిఖ్ రెహమాన్ (ఖలీదా కుమారుడు, రాజకీయ వారసుడు) సహా చాలా మంది నాయకులు అవినీతి కేసుల్లో చిక్కుకోవడంతో పార్టీ మరింత అపఖ్యాతి పాలైంది. వారి అక్రమాలకు సంబంధించి విచారణ జరిపి వారికి శిక్ష విధించారు. రెహమాన్ బంగ్లాదేశ్ రాజకీయాలతో సంబంధం లేకుండా లండన్‌లో ఉంటున్నారు. ఖలీదా గృహనిర్బంధంలో ఉన్నారు; పైగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆమె తన పార్టీ రాజకీయ అదృష్టాన్ని పునరుద్ధరించడం కష్టమైపోయింది.

మునుపటి ఎన్నికలకు ముందు బీఎన్ పీ హింసాత్మక చర్యల్లో పాల్గొంది. ఇది బీఎన్‌పీకి చెందిన మరికొందరు అగ్రనేతలను విచారించే అవకాశాన్ని కూడా అవామీ లీగ్‌కు ఇచ్చింది. ఫలితంగా పార్టీ ఇప్పుడు చాలా బలహీనంగా ఉంది. అవామీ లీగ్‌ను ఏ విధంగానూ ఎదుర్కొనే స్థితిలో లేదు.



ఆపద్ధర్మం స్థానంలో...

బీఎన్‌పీ కూటమి కీలక భాగస్వామి అయిన బంగ్లాదేశ్ జమాత్-ఎ-ఇస్లామీని ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధించారు. పార్లమెంటరీ చట్టాలపై తమకు నమ్మకం లేదనీ, ఇస్లామిక్ చట్టం, పాలనకు మాత్రమే కట్టుబడి ఉన్నామనీ ఆ పార్టీ పదేపదే ప్రకటించింది. దీంతో బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం జమాత్ పార్టీ రిజిస్ట్రేషన్‌ని రద్దు చేసింది. హసీనా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన యుద్ధ నేరాల విచారణ నేపథ్యంలో జమాతే ఇస్లామీ అగ్రనేతలకు ఉరిశిక్షలు పడ్డాయి. దాంతో పార్టీ మరింత నష్టపోయింది.

సార్వత్రిక ఎన్నికలను తటస్థ మధ్యంతర ప్రభుత్వం నిర్వహించాలని బీఎన్ పీ డిమాండ్ చేస్తోంది. హసీనా ప్రభుత్వం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించదని ఆ పార్టీ భయపడుతోంది. అయితే ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించడం లేదు. 2018 ఎన్నికలలో పాల్గొనడం ద్వారా తాము తప్పు చేశామని బీఎన్‌పీ ఇప్పుడు నమ్ముతోంది.

2011లో 15వ రాజ్యాంగ సవరణ ద్వారా తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటును అవామీ లీగ్ ప్రభుత్వం తొలగించింది. అంతకు ముందు ఆపద్ధర్మ ప్రభుత్వం నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన పార్టీకి అధికారాన్ని అప్పగించేది. ఏది ఏమైనప్పటికీ, తాత్కాలిక ప్రభుత్వం కొన్ని సంవత్సరాలు (2007–09) కొనసాగింది, సాధారణ ప్రభుత్వం వలె పనిచేయడమే కాకుండా దాని అధికార పరిధికి మించిన అనేక చర్యలు కూడా తీసుకుంది. అలాగే హసీనా, ఖలీదాలను కూడా విచారించింది. స్పష్టంగా, ఆపద్ధర్మ ప్రభుత్వం తప్పు చేయలేని వ్యవస్థ అయితే కాదు. అందుకే బంగ్లాదేశ్ ఇతర ప్రజాస్వామ్య దేశాలలో మాదిరిగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించగల సంస్థలతో ముందుకు రావాలి.

నిశ్శబ్ద విజయాలు ఉన్నప్పటికీ...

షేక్ హసీనా ఇటీవలి సంవత్సరాలలో నియంతగా మారిందని ఆమె విమర్శకులు ఆరోపిస్తుండగా, ఆమె పదవీకాలం బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరతను తెచ్చిపెట్టిందన్నది మరో నిజం. ఇది బంగ్లాదేశ్‌కూ, దాని ప్రజలకూ ప్రయోజనకరంగా నిరూపితమైంది. దేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధిని చవిచూస్తోంది. దక్షిణాసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో బంగ్లాదేశ్ ఒకటి. గత దశాబ్దంలో దాని తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగింది. గత 20 ఏళ్లలో 2.5 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

అనేక ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా హసీనా ప్రభుత్వం అమలు చేసింది. దేశ సొంత ఆర్థిక వనరులు, రుణాలు, అభివృద్ధి సహాయాల కలయికతో, కీలకమైన 2.9 బిలియన్ డాలర్ల పద్మ వంతెనను గంగానదిపై నిర్మించారు. ఈ వంతెన ఒక్కటే దేశ జీడీపీని 1.23 శాతం పెంచడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు.

ఈ విజయాలు ఉన్నప్పటికీ, కోవిడ్ -19 మహమ్మారి నేపథ్యంలో బంగ్లాదేశ్ ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటోంది. నవంబరులో ద్రవ్యోల్బణం 9.5 శాతానికి చేరుకోవడంతో పెరుగుతున్న జీవన వ్యయంతో దేశం పోరాడుతోంది. విదేశీ మారక నిల్వలు ఆగస్టు 2021లో రికార్డు స్థాయిలో 48 బిలియన్ల డాలర్ల నుండి ఇప్పుడు దాదాపు 20 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇవి మూడు నెలల దిగుమతులకు కూడా సరిపోవు. అదనంగా, దాని విదేశీ రుణం 2016 నుండి రెట్టింపు అయింది. అయితే, భారతదేశం అవసరమైన వస్తువులను సరఫరా చేయడం ద్వారా బంగ్లాదేశ్‌కు సహాయం చేసింది.

దశాబ్దపున్నర కాలంగా బంగ్లాదేశ్‌లో ఉన్న రాజకీయ సుస్థిరత ఆర్థికాభివృద్ధికి కారణమైందనడంలో సందేహం లేదు. భారతదేశం, బంగ్లాదేశ్ ఇప్పుడు మరింతగా ఎక్కువ స్థాయి విశ్వాసాన్ని కలిగివున్న భాగస్వామ్య పక్షాలు. దీని ఫలితంగా ఇరు దేశాల మధ్య మెరుగైన రైలు కనెక్టివిటీ, ద్వైపాక్షిక వాణిజ్యం ఏర్పడింది.

అయితే, చైనా నేతృత్వంలోని అంతర్జాతీయ వాణిజ్య కూటమి, రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్‌లో బంగ్లాదేశ్ ప్రవేశించే అవకాశం ఉంది. దీంతో పొరుగుదేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలపై భారత్‌ను జాగ్రత్తగా నడుచుకునేలా చేసింది. భారతదేశం పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించాక పరిస్థితులు తనకు అనుకూలంగా పని చేస్తాయని ఆశిస్తోంది.

వ్యాసకర్త అసోసియేట్ ఫెలో, మనోహర్ పారీకర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ ఎనాలిసెస్, న్యూఢిల్లీ

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సానుభూతి



ఇరాన్‌లో తీవ్రవాదులు పేల్చిన జంట బాంబుల దాడిలో పదులకొద్దీ మంది మరణించారు. వందల మంది గాయపడ్డారు. ఇరాన్ ప్రజలకు, ముఖ్యంగా బాధితుల బంధువులకు నా ప్రగాఢ సానుభూతి.

– తుషార్ గాంధీ, రచయిత

నిపుణులు తప్పయితే?



2024 కోసం నేను ఒక కొత్త పదబంధాన్ని పుట్టిస్తున్నాను. కాన్‌స్పిరసీ రియాలిటీ (కుట్ర వాస్తవం). నిపుణులందరూ ఒక అంశాన్ని కుట్ర సిద్ధాంతంగా కొట్టివేసినప్పటికీ, అది వాస్తవంగా తేలడమే కాన్‌స్పిరసీ రియాలిటీ. గత కొన్నేళ్లలో ఇది చాలాసార్లు జరిగింది.

– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

అందినకాడికి...



నా స్నేహితుడు, ఒక అంకుర సంస్థ వ్యవస్థాపకుడు తన విడాకుల 'ఒప్పందం' కోసం చెల్లించిన మొత్తమెంతో తెలిసింది. 8 నెలలు మాత్రమే నిలిచిన ఈ పెళ్లికి అతడు దాచుకున్న మొత్తం సొమ్ము, అత్యవసర నిధి అన్నీ ఖాళీ అయ్యాయి. 33 ఏళ్ల వయసులో తను మళ్లీ సున్నా నుంచి మొదలుపెట్టాలి. మహిళలూ దయచేసి ఇలా చేయద్దు. ఇది తప్పు.

– శ్రుతీ చతుర్వేది, ఆంట్రప్రెన్యూర్

వందనం



మా అమ్మ ఎనిమిదో తరగతి పాస్, మా నాన్న పన్నెండో తరగతి పాస్. మా జిల్లాలో మా అక్క ఒక్కతే ఇస్రో శాస్త్రవేత్త. మా ఊరిలో నేనొక్కడినే ఐఏఎస్. మా చిన్నప్పటి స్నేహితులు చాలామంది రైతులు. మేము ఈ స్థాయికి వచ్చామంటే, అది మా తల్లిదండ్రుల ఘనతే!

– హిమాంశు త్యాగి, ఐఎఫ్‌ఎస్ అధికారి

తల్లి ప్రేమ



మనం వండిన వంటల్ని మన పిల్లలు తమ పళ్లేల్లో నింపుకొంటూ ఉంటే చూడడాన్ని మించిన సంతోషం మరొకటి ఉండదు. అది ఒక వయసుకొచ్చాకగానీ నాకు అర్థం కాలేదు.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

తెలుగు వారి సాంస్కృతిక కేంద్రం

స్వాతంత్ర్యోద్యమకాలం నుండి తెలుగు భాషకు, సంస్కృతికి విశిష్టసేవలందిస్తున్న గ్రంథాలయాలు ఎన్నో. అలాంటివాటిలో ఒకటి విజయవాడలోని శ్రీవెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం. దీనికి అరుదైన మరో ప్రత్యేకతా ఉంది. అదే... అనుబంధ సంస్థ 'ఆంధ్ర ఆర్ట్ థియేటర్స్'. ఇది అభిమాన సాంస్కృతిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ గ్రంథాలయం ఇప్పుడు మరో ఘనతను సాధించింది. 'పూర్ణకుంభ' పురస్కారానికి ఎంపికైంది. శ్రీ రాజరాజనరేంద్రుల వారి పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల సందర్భంగా **రాజమహేంద్రవరంలో** నిర్వహిస్తున్న ద్వితీయ అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో **జనవరి 5 సాయంత్రం పూర్ణకుంభ పురస్కార ప్రదానం** జరగనుంది. వెలిదండ్ల హనుమంతరావు 1899లో గుడివాడలో జన్మించారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకెళ్లారు. జైలు సిబ్బంది క్రూరత్వానికి గురై రక్తం కక్కి స్పృహ కోల్పోయారు. జైలు నుండి విడుదలైన తర్వాత క్షయతో బాధపడుతూ 1931, అక్టోబర్ 20న తుది శ్వాస విడిచారు. త్యాగనిరతినీ, ధైర్యసాహసాలనూ, ప్రజా సేవలో అనురక్తినీ చూపిన హనుమంతరావు సత్యాగ్రహ దళంలోని వాలంటీర్లుగా పనిచేసిన ముగ్గురు యువ స్వాతంత్ర్య సమరయోధులు గెల్లి రాజగోపాలం, కృత్తివెంటి కుటుంబరావు, నండూరి వెంకటేశ్వరరావులుతో మరికొందరు సహచర మహనీయులు కలిసి వారి పేరిట శాశ్వత స్మృతి చిహ్నం ఏర్పాటు చేయాలన్న సంకల్ప ఫలితమే ఈనాటి శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం!



హనుమంతరాయ గ్రంథాలయం

ముందుగా 1934లో ప్రారంభమైన గ్రంథాలయం 1944 నాటికి తగినన్ని పక్కా భవనాలను అమర్చుకోగలిగింది. అదే సంవత్సరం సొసైటీ యాక్టు క్రింద గ్రంథాలయం రిజిష్టర్ అయింది. నాటకాలు, కళారూపాలను ప్రదర్శిస్తూ ప్రజల కళాభిరుచిని పెంపొందించాలనే తపనతో 'ఆంధ్రా ఆర్ట్ థియేటర్స్'ను ఏర్పాటు చేశారు. గ్రంథాలయ వైజ్ఞానిక శాఖగా ఏర్పాటైన ఈ ఆంధ్రా ఆర్ట్ థియేటర్స్ అనేక ఉత్తమ ప్రదర్శనల ద్వారా ప్రజల మన్ననలను, అనేక పరిషత్తులలో బహుమతులు పొందింది. సాంస్కృతిక ఉత్సవాలు పేరుతో నాటక, నాటికల పోటీలు నిర్వహించింది. 1963లో సినీ నటీనటులు సావిత్రి, సూర్యకాంతం, అక్కినేని నాగేశ్వరరావు వంటి అనేకమంది భూరి విరాళాలు ఇచ్చి గ్రంథాలయంలో అన్ని హంగులూ సమకూర్చారు. తొలి రోజులలో తోలుబొమ్మలాటలతో, చిన్నచిన్న సమావేశాలతో ప్రారంభమైన ఈ సంస్థ సంతోషాన్నిచ్చే 'సురభి' నాటకాలతో పాటు 'రక్తకన్నీరు', 'చింతామణి', 'కన్యాశుల్కం', 'శ్రీకృష్ణ రాయబారం' లాంటి ఎన్నో నాటక ప్రదర్శనల నిలయంగా నిలిచింది.

జాతి, కుల, మత, వర్గ వివక్ష లేకుండా సమాజంలో అన్ని వర్గాల వారికి సమాన స్థాయిలో గ్రంథాలందిస్తూ చదువరుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయక, ఆడిటోరియంలో ఉచిత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ 90వ వార్షికోత్సవ వత్సరంలో ఉన్న శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయానికి పూర్ణకుంభ పురస్కార భాగ్యం ప్రాప్తించడం హర్షణీయం.

– మహబూబ్ ఆజిమ్, హనుమంతరాయ గ్రంథాలయ పాలక మండలి సభ్యులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

అసెంబ్లీ వరకు... 'మహాలక్ష్మి' బస్సు!

అభిప్రాయం



శ్రీనివాస్ మాధవ్

తెలంగాణ శాసన సభ ఎన్నికల ఫలితాలను మహిళలు ప్రభావితం చేశారా? నవంబర్ 28న జరిగిన ఎన్నికలలో 1.13 కోట్లమంది పురుషులు ఓటు వేయగా, 1.14 కోట్ల మంది స్త్రీలు ఓటు వేశారు. 56 నియోజక వర్గాలలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటు వేశారు. మహిళలలో ఈ రాజకీయ చైతన్యం– రాజకీయ సాధికారతకు దారి వేయగలదా?

సొంత పార్టీలోనే ఎన్నో ఒత్తిళ్ళు ఉన్నా, తన పార్టీ నష్టపోయే అవకాశం ఉన్నా తెలంగాణకు కట్టుబడిన సోనియా గాంధి; పరంపరగా తెలంగాణ సమస్యలపై ప్రశ్నలు వేసి నెలల తరబడి పార్లమెంటుపై ఒత్తిడి కొనసాగించిన సుష్మా స్వరాజ్ తెలంగాణ రాష్ట్ర అవతరణలో కీలక పాత్ర పోషించారు. మరి తెలంగాణ శాసన సభకు ఎంత మంది మహిళలు ఎన్నిక అవుతున్నారు? 2018తో (ఆరుగురు) పోల్చితే 2023లో (10 మంది మహిళలు) కొంత మెరుగయినా, మహిళా శాసన సభ్యులు మొత్తం మీద 8 శాతం దాటలేదు.

నూతన ప్రభుత్వ 'మహాలక్ష్మి' (మహిళల ఉచిత బస్సు ప్రయాణం)పై ఎన్ని వ్యాఖ్యలు వస్తూ ఉండవచ్చుగాక. అయినా మహిళల ఆర్థిక సాధికారతకు మహాలక్ష్మి కీలకం. 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్టు 2023' ప్రకారం 146 దేశాలలో భారత్‌కు 127వ స్థానం దక్కింది. మన దేశంలో కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం 28.26 శాతం మాత్రమే. కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం పెరిగితేనే 2047 నాటికి భారత్ అధిక ఆదాయ దేశంగా మారే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు సూచిస్తోంది.

ఇందుకు మహిళల మొబిలిటీ పెంచడం (ఉచిత బస్సు ప్రయాణం) కొంత తోడ్పాటు ఇస్తుంది. కనీసం పని కోసం నడిచి వెళ్ళే వారికి సమయం ఆదా అవుతుంది. పని ప్రదేశాలు అందుబాటులోకి వస్తాయి. ఇంటికి, వంటింటికి మాత్రమే పరిమితం కాకుండా తమ చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించడానికి అవకాశం లభిస్తుంది. దూరంగా ఉండే కళాశాలల నుంచి డ్రాప్ అవుట్ కాకుండా బాలికలు చదువు కొనసాగించడానికి అవకాశం పెరుగుతుంది. కానీ ఇది మాత్రమే సరిపోదు. 'సమయ పేదరికం' (టైం పావర్టీ) మరో అవరోధం. మహిళలు ప్రయాణించాలన్నా, ఉద్యోగం చేయాలన్నా ముందు వారికి తీరిక సమయం ఉండాలి కదా. భారత్‌లో చేసిన ఏకైక 'టైం యూజ్ సర్వే' ప్రకారం 75 శాతం మహిళలు రోజూ 204 నిమిషాలు వంట, భోజన ఏర్పాట్ల కోసం, మరో 100 నిమిషాలు ఉచిత గృహ సేవల కోసం వెచ్చిస్తారు. ఇది 'సమయ పేదరికం' సృష్టిస్తుంది.

సమయ పేదరిక నిర్మూలనకు కొన్ని పరిష్కారాలున్నాయి. సరిపడినన్ని క్రెషెల ఏర్పాటు, అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సౌకర్యాలు కల్పించటం వల్ల పిల్లల



ఆలనా పాలనతో పాటు, పూర్వ ప్రాథమిక విద్య కూడా బోధించవచ్చు. సబ్సిడీ అవసరం, లాభాపేక్ష లేని సామాజిక వంటశాలల సాధ్యాసాధ్యాలు తర్వాతి దశలో పరిశీలించవచ్చు. ఆస్ట్రేలియాలో పౌర సమాజం ప్రయోగాత్మకంగా నిర్వహించిన సామాజిక వంటశాలల వల్ల కుటుంబాలు ఆహార ఖర్చు బాగా తగ్గడం, పోషకాహార లభ్యత, సమాజ ఐక్యత వంటి ప్రయోజనాలు గమనించారు.

మహిళా భద్రత మరో కీలకాంశం. తెలంగాణలో మహిళా పోలీసుల సంఖ్య 9 శాతం దాటలేదు. బిహార్, మహారాష్ట్ర, తమిళనాడులలో ఇది 15–20 శాతం మహిళా పోలీసులు ఉన్నారు. మహిళల ఉచిత గృహ సేవలకు కనీస వేతనాలు చెల్లిస్తే దేశ జీడీపీలో 9 శాతం అవుతుందని ఐఎల్‌ఓ లెక్క గట్టింది. ఖర్చు గురించి సందేహించే వారు మహాలక్ష్మి పథకం చంద్రుడికో నూలు పోగు వంటిదని గుర్తించాలి. 'అభయహస్తం' అమలు కోసం 'ప్రజా పాలన' (గ్రామ సభలు నిర్వహించడం) వల్ల దరఖాస్తుల స్వీకరణను మించిన సామాజిక ప్రయోజనం – గ్రామ సభలో పాల్గొనాలనే చైతన్యం ప్రజలలో, ముఖ్యంగా మహిళలలో కలగడం వల్ల– ప్రత్యక్ష ప్రజాస్వామ్యపు పునాది శక్తిమంతమవుతుంది. గ్రామ సభా సంస్కృతి– అంటే పెద్ద సంఖ్యలో గ్రామ సభలో పాల్గొనే సంస్కృతి శుభ పరిణామం.

గ్రామ సభలో గ్రామీణుల హాజరు వల్ల సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి. అయితే గ్రామ సభలో పాల్గొనేందుకు మహిళలు ముందుకు రావాలంటే వారికి ప్రత్యక్ష ప్రజాస్వామ్య ఆవశ్యకత గురించి నచ్చజెప్పడం కూడా అవసరం. ఇందుకు క్షేత్ర స్థాయి కార్మికులు, పౌర సమాజ ప్రతినిధులు గృహ సందర్శనలు చేయాలి. వారికి అందుకు తగిన శిక్షణ అందించాలి.

మహిళా గ్రామ సభల (గ్రామ సభలో ఎక్కువ మహిళలు హాజరు కావటం) వల్ల మహిళా సర్పంచులు కూడా క్రియాశీలంగా మారే అవకాశం కూడా ఉన్నది. తెలంగాణలో ఆరు వేల మందికి పైగా మహిళా సర్పంచ్‌లు ఉన్నారు. వీరు ఒకటి, రెండు మార్లు సర్పంచ్‌గా పని చేసి కనుమరుగు అవుతున్నారు. వీరిలో సామర్థ్యం, పట్టుదల ఉన్న వారిని కొంత శిక్షణతో శక్తిమంతమైన నేతలుగా మార్చే అవకాశం ఉంది. అలాంటి మహిళా సర్పంచ్‌లను గుర్తించి నాయకత్వ శిక్షణ అందిస్తే సర్పంచుగానే ఆగిపోకుండా శాసన సభ, పార్లమెంటు సభ్యులుగా ఎదుగుతారు. 2029 నాటికి 'నారీ శక్తి వందన్ చట్టం' అమలు అయితే శాసన సభ లో 40కి పైగా మహిళా సభ్యులు ఉండాలి. వారు రాజకీయ కుటుంబాల చాటు నుంచి కాకుండా – పాలనా స్వభావం గలిగిన మహిళా సర్పంచ్‌ల నుండి వస్తే అది ప్రజాస్వామ్య విజయం అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ ఫ్యాకల్టీ, తెలంగాణ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ

చదువుతోనే అన్నీ!

చదువుకోకపోతే మనిషి అజ్ఞాని అవుతాడు. చదువు వల్ల ఏది మంచి, ఏది చెడు అనే విచక్షణా జ్ఞానం కలుగుతుంది. ప్రజలందరు చదువుకోవాలి' అంటాడు మహా భాగవతంలో ప్రహ్లాదునికి చదువు విలువ చెపుతూ హిరణ్యకశిపుడు. ఇది సర్వ కాలాలకు, సర్వ జనులకు వర్తించే సూక్తి.

జ్యోతిర్మయం

చదువు వలన జ్ఞానం వస్తుంది. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. సమాజంలో జరిగే అనేక విషయాలపై అవగాహన, పరిశీలన చదువు వలన వృద్ధి పొందుతాయి. చదువు వ్యక్తికి సమాజంలో గౌరవ స్థానాన్ని ఇస్తుంది. చదువు వినయాన్ని ఇస్తుంది. వినయం ఒక అర్హతను, చదువుకు వినయం కూడితే ఆ వ్యక్తికి మంచి ఉపాధి, ధనం సమకూరుతాయి.

చదువు మనిషికి పరదేశంలో బంధువులా సహాయపడుతుంది. గురువులా ఎన్నో బోధిస్తుంది. చదువుకు సమానమైన సంపద ఈ విశ్వంలో మరొకటి లేదు. దీనిని దొంగలు దోచుకోలేరు. భౌతిక సంపదలు ధనం, నగలు, ఆస్తుల్లా సోదరులు పంచుకోలేరు. ఇస్తున్న కొద్దీ తరిగిపోయేది ధనమైతే, ఎప్పటికీ తరగని నిధి చదువు. తనకు తెలిసిన విషయాలను మనిషి ఇతరులకు చెప్పటానికి చేసే ప్రయత్నంలో జ్ఞానాన్ని పెంచుకోవలసిన అవసరం ఉంటుంది. అలా ఇతరులకు ఇచ్చే కొద్దీ జ్ఞానం పెరుగుతుంది. నేర్చిన చదువు నుంచి, చదివిన పుస్తకాల నుంచి పొందిన జ్ఞానాన్ని, విచక్షణను జీవితంలో అమలుపరిచినప్పుడే చదువుకు నిజమైన సార్థకత!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.నవమి రా.7.55 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** చిత్త సా.4.49 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.10.47 నుండి 12.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.45 నుండి 9.33 వరకు తదుపరి ప.12.28 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.47 నుండి 11.32 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.35.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఇళ్లస్థలాలపై జర్నలిస్టుల బృందానికి మంత్రి పొంగులేటి హామీ



మంత్రి పొంగులేటికి వినతి పత్రం సమర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

సాక్షి,హైదరాబాద్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ చర్యల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, జర్నలిస్టుల సంక్షేమంపై ఒక విధానపరమైన ప్రకటన చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సచివాలయంలో ఐజేయూ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు రాంనారాయణ తదితరులు మంత్రిని కలసి జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం గత ప్రభుత్వాలు జారీ చేసిన జీవోలు, మెమోలను సేకరించాలన్నారు. వాటి ద్వారా ఇచ్చిన స్థలాల వివరాలు, స్వాధీనం చేయకుండా ఉన్న స్థలాల వివరాలు, ఇప్పుడు ఇవ్వడానికి అనువైన స్థలాల వివరాలు పంపించాలని 33 జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని వివరించారు. కాగా, చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ విషయాన్ని ఐజేయూ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తావించగా, ఆ విషయం తన దృష్టికి వచ్చిందని, ముఖ్యమంత్రితో చర్చించి తప్పని సరిగా పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

పురపాలికల్లో అవిశ్వాస రాజకీయం

చాలా మునిసిపాలిటీలలో చైర్‌పర్సన్లపై వేటుకు సిద్ధమైన సభ్యులు

- ఇప్పటికే ఆర్మూరులో నెగ్గిన అవిశ్వాసం.. రేపు ఖానాపూర్ మునిసిపల్ సమావేశం
- 8న నల్లగొండ, నర్సంపేట, 11న మంచిర్యాల, 12న బెల్లంపల్లి, నస్పూర్‌లలో సమావేశాలు
- అవిశ్వాసాలు తప్పించుకొనేందుకు 15 మంది చైర్‌పర్సన్లు కాంగ్రెస్‌లో చేరినా తప్పని బెడద
- పలు మునిసిపల్ కార్పొరేషన్లలోనూ ఇదే తీరు



వినీత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి నెల కూడా గడువక ముందే చాలా పురపాలికల్లో అవిశ్వాస రాజకీయం ఊపందుకుంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూరు మునిసిపాలిటీలో గురువారం జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు మునిసిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గగా మరో ఏడు మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలపై చర్చకు జిల్లా కలెక్టర్లు కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మునిసిపాలిటీలో చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం చర్చ జరుగనుంది. వరంగల్ జిల్లా నర్సంపేటలో అవిశ్వాస నోటీసుకు స్పందించిన కలెక్టర్ ఈ నెల 8న పాలకమండలిని సమావేశపరిచారు. అదేరోజు నల్లగొండలోనూ సమావేశం జరగనుంది. 11న మంచిర్యాల మునిసిపాలిటీ పాలకమండలి సమావేశం కానుండగా ఆ సమావేశంలోనే అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్, ఆ తరువాత గంటకే కొత్త చైర్‌పర్సన్, వీసీ ఎన్నిక ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బెల్లంపల్లితోపాటు నస్పూర్ మునిసిపాలిటీ సమావేశం ఈ నెల 12న జరగనుంది. కాగజ్‌నగర్ మునిసిపాలిటీ చైర్‌పర్సన్ సద్దాం హుస్సేన్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 20న సభ సమావేశం కానుంది. అలాగే ఈ నెల 19న సిద్దిపేట జిల్లా చేర్యాల మునిసిపాలిటీ సమావేశం జరగనుంది. ఇంకా చాలా మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలకు ఇచ్చిన నోటీసులపై జిల్లా కలెక్టర్లు స్పందిస్తున్నారు. అవిశ్వాసాల నుంచి తప్పించుకోవడానికి సుమారు 15 మంది మునిసిపల్ చైర్‌పర్సన్‌లు కాంగ్రెస్‌లో చేరినా పదవీగండం తప్పేలా లేదు.

మరికొన్ని చోట్ల నోటీసులకు సిద్ధం..

నల్లగొండ జిల్లాలో నల్లగొండ మునిసిపాలిటీతోపాటు నేరేడుచెర్ల, భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ మునిసిపాలిటీల్లో అవిశ్వాసాల రగడ నడుస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పెద్ద అంబర్‌పేట మునిసిపాలిటీలతోపాటు మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, గుండ్లపోచంపల్లి, నిజాంపేట మునిసిపాలిటీలు, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ కార్పొరేషన్లలో నోటీసులు జారీ చేసేందుకు సభ్యులు సిద్ధమవుతున్నారు. కామారెడ్డిలో కాంగ్రెస్‌లో చేరిన ఇందుప్రియపై బీఆర్‌ఎస్ అవిశ్వాస నోటీసుకు సిద్ధమవుతోంది. కరీంనగర్‌లో జమ్మికుంట మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పొన్నగంటి మల్లయ్య అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. అయితే రామగుండం కార్పొరేషన్‌లో అవిశ్వాసం ఆలోచన తమ సభ్యులకు లేదని జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ అసమ్మతి సభ్యుల నుంచే..

సుమారు నాలుగేళ్ల క్రితం జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 128 మునిసిపాలిటీలు, 13 కార్పొరేషన్లకుగాను మెజారిటీ స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకోగా నాలుగైదు పాలక మండళ్లనే కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. పురపాలక చట్టం ప్రకారం పాలకమండలి మూడేళ్ల పదవీకాలం పూర్తయ్యాక అవిశ్వాస లేదా విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉండగా ఈ తీర్మానాల గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మునిసిపల్ చట్టంలో మార్పులు చేసింది. అయితే అది గవర్నర్ ఆమోదం పొందలేదు. దీంతో గతేడాది జనవరి 27 తరువాత 36 మునిసిపాలిటీలు, పలు కార్పొరేషన్లలో బీఆర్‌ఎస్ అసమ్మతి సభ్యులు అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. వారికి కాంగ్రెస్, బీజేపీ సభ్యులు తోడై చైర్‌పర్సన్లు, మేయర్లను గద్దె దించాలని ప్రయత్నించారు. అయితే గత ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు పాలకమండళ్లను సమావేశపరచకపోవడం, ఈలోగా మునిసిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లు కోర్టుకెక్కి స్టే తెచ్చుకోవడంతో అప్పట్లో అవిశ్వాసాలకు బ్రేక్ పడింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవిశ్వాస తీర్మానాల్లో మళ్లీ కదలిక మొదలైంది.

'ఆర్మూర్'చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- పదవి కోల్పోయిన వినీత
- అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె భర్త బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేశారనే..!

ఆర్మూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత్‌పై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఆమె తన పదవిని కోల్పోవాల్సి వచ్చింది. మునిసిపల్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, కాంగ్రెస్‌కు చెందిన 24 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. మరో 12 మంది కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. 2020 జనవరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా 33వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా పండిత్ వినీత గెలిచారు. అప్పట్లో చైర్‌పర్సన్ పదవికి బీసీ మహిళా రిజర్వేషన్ కలిసి రావడంతో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో చైర్‌పర్సన్ భర్త పండిత్ పవన్ బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపిస్తూ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సంప్రదించగా ఆయన సూచన మేరకు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నూతన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎంపికపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు త్వరలో ఆదేశాలు జారీ చేయనున్నారు.

7.62 లక్షల ఎకరాల్లో వరి నాట్లు

- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్‌లో వరి నాట్లు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. వానాకాలం సీజన్ పంటల కోతలు పూర్తి కావస్తుండటంతో రైతులు యాసంగి పంటల సాగుపై దృష్టి సారించారు. ఇప్పటికీ అనేక చోట్ల వరి, సోయాబీన్, పత్తి కోతలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. యాసంగి సీజన్‌లో మొత్తం అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 16.32 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. అంటే 29.71 శాతం విస్తీర్ణంలో సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. గత యాసంగి సీజన్‌లో ఇదే సమయానికి 17.02 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈసారి తక్కువగా నమోదు కావడం గమనార్హం. వరి సాధారణ సాగు లక్ష్యం 40.50 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 7.62 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు.

గతేడాది కంటే తక్కువగానే వరి నాట్లు

గతేడాది ఇదే సమయంతో పోలిస్తే మాత్రం నాట్లు తక్కువగానే పడ్డాయి. గతేడాది వరి నాట్లు ఇదే సమయానికి 7.71 లక్షల ఎకరాల్లో వేశారు. ఇక పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.76 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2.77 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.83 లక్షల ఎకరాల్లో (66.21%) సాగైనట్లు పేర్కొంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 5.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.81 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 1.02 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 55,463 ఎకరాల్లో సాగైంది.

'తెలంగాణ భవన్‌కు నోటీసులు అవాస్తవం'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ భవన్‌కు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారన్న అంశంపై భవన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. ఇప్పటివరకు తమకు ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. గతంలో అధికారులు నోటీసు ఇచ్చారని, త్వరలోనే టీవీ చానల్ కార్యాలయం తరలింపునకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు చెప్పామన్నారు. కాగా.. పార్టీ కార్యాలయంలో టీ-న్యూస్ చానల్ నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారులు నోటీసులిచ్చారంటూ వార్తలు రావడం తెలిసిందే.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటిసరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 04, తెలంగాణ రాష్ట్రం
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ - టెండరు ప్రకటన
'ఇ'- టెండరు నం. మరియు తేది
EP No.83/CGM(E)/TC/T3/O&M Div.XXI/2023-24, తేది: 04.01.2024
పని పేరు: హైదర్‌నగర్ సెక్షన్, SD-II, O&M Div-XXI, కంట్రోల్ రూమ్, సికింద్రాబాద్ పరిధిలోని శ్రీ సాయి వే బ్రిడ్జి నుండి ఆరెంజ్ కార్గో క్యారియర్స్ వరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వాణి కెమికల్స్, సూరారం మరియు గాజులరామారం రిజర్వాయర్లకు నీటి సరఫరా మెరుగుపరచుటకు మరియు షాపూర్‌నగర్ రిజర్వాయర్ ప్రిమిసెస్ వద్ద 6.00ML మరియు 7.5ML కెపాసిటీ రిజర్వాయర్లకు నీటి సరఫరా నాణ్యతను మెరుగు పరచుటకు అవసరమైన ప్రత్యేకతలతో పాటు 12mm మందం MS ప్లేట్‌తో ఫ్యాబ్రికేట్ చేయబడిన 1200mm డయా ఇన్‌లైన్ మరియు అవుట్‌కోటెడ్ MS పైప్‌లైన్ తయారీ, సరఫరా, డెలివరీ, వేయుట, జోడించుట, పరీక్షించుట మరియు పనిచేయించుట. (ఫేస్-I)
రేంజింగ్ (సుమారు) : రూ.191.636 లక్షలు
EP No.84/CGM(E)/TC/T3/O&M Div.XXI/2023-24, తేది: 04.01.2024
పని పేరు: హైదర్‌నగర్ సెక్షన్, SD-II, O&M Div-XXI, కంట్రోల్ రూమ్, సికింద్రాబాద్ పరిధిలోని ఆరెంజ్ కార్గో క్యారియర్స్ నుండి పోరస్ ల్యాబొరేటరీస్ వరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వాణి కెమికల్స్, సూరారం మరియు గాజులరామారం రిజర్వాయర్లకు నీటి సరఫరా మెరుగుపరచుటకు మరియు షాపూర్‌నగర్ రిజర్వాయర్ ప్రిమిసెస్ వద్ద 6.00ML మరియు 7.5ML కెపాసిటీ రిజర్వాయర్లకు నీటి సరఫరా నాణ్యతను మెరుగు పరచుటకు అవసరమైన ప్రత్యేకతలతో పాటు 12mm మందం MS ప్లేట్‌తో ఫ్యాబ్రికేట్ చేయబడిన 1200mm డయా ఇన్‌లైన్ మరియు అవుట్‌కోటెడ్ MS పైప్‌లైన్ తయారీ, సరఫరా, డెలివరీ, వేయుట, జోడించుట, పరీక్షించుట మరియు పనిచేయించుట. (ఫేస్-II)
రేంజింగ్ (సుమారు) : రూ.191.636 లక్షలు
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 05.01.2024 మ.3.00 గం. సమాచారాన్ని ముఖ్యంగా Zip ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని టెండరుదారులను కోరడమైనది. తదుపరి వివరాలను www. eprocurement.gov.inలో చూడవచ్చును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (E), ట్రాన్స్‌మిషన్ సర్కిల్, హైదరాబాద్ - 4, తెలంగాణ

నాన్నా.. నేనేం పాపం చేశాను!

- రెండేళ్ల కొడుక్కి ఎలుకల మందు తాగించి, తానూ ఆత్మహత్యాయత్నం
- పసికందు మృతి, తండ్రి పరిస్థితి విషమం
- భార్యపై అనుమానంతో ఘాతుకం
- జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో ఘటన



విగతజీవిగా చిన్నారి

అయిజ: భార్యపై అనుమానంతో రెండేళ్ల కుమారుడిని పొట్టనపెట్టుకున్నాడో ప్రబుద్ధుడు. వివరాలిలా.. అయిజ పట్టణంలో నివాసముంటున్న భార్గవకు నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన శ్రావణితో 2019లో వివాహమైంది. వీరికి కుమార్తె నయనిక, కుమారుడు నందకిశోర్(2) ఉన్నారు. కొంతకాలంగా భార్యను అనుమానిస్తూ భార్గవ తరుచూ గొడవ పడుతున్నాడు. వేధింపులు ఎక్కువ కావడంతో పదిరోజుల క్రితం కుమార్తె, కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లేందుకు శ్రావణి ప్రయత్నించగా.. అడ్డుకున్న భార్గవ.. కుమారుడు నందకిశోర్‌ను లాక్కున్నాడు. దీంతో ఆమె కూతురు నయనికను తీసుకొని వెళ్లిపోయింది. నందకిశోర్ ప్రతిరోజూ అమ్మ కావాలని ఏడుస్తుండడంతో.. భరించలేక పసివాడికి నిద్రమాత్రలు వేసి పడుకోబెట్టాడు. పదిరోజులుగా భార్య లేకపోవడంతో మానసికంగా కుంగిపోయిన భార్గవ వారం క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన అతని తల్లి వడ్లకుమారి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. దీంతో కోలుకున్నాడు. అయితే బుధవారం అర్ధరాత్రి తర్వాత మరోసారి భార్గవ రెండేళ్ల తన కుమారుడు నందకిషోర్‌కు ఎలుకల మందు తాగించి, తానూ తాగాడు. గురువారం ఉదయం తల్లి కుమారి నిద్ర లేచేసరికే కొడుకు, మనవడు అపస్మారక స్థితిలో ఉండడం గమనించి.. స్థానికుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లింది. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం భార్గవ గద్వాల జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా.. పరిస్థితి విషమంగానే ఉందని అంటున్నారు. శాంతినగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భూరికార్డులు సరిచేయడంలో ఏపీ టాప్

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలతో రైతులకు మేలు
- భూన్యాయ నిపుణుడు డాక్టర్ సునీల్‌కుమార్



యాచారం: దేశంలో భూరికార్డులు సరి చేసే విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందు వరుసలో ఉందని భూన్యాయ నిపుణుడు డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. భూ రికార్డుల నమోదు, సరిహద్దుల గుర్తింపు, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసే విషయంలో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ, ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించేందుకు గురువారం ఆయన రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ప్రజా పాలనలో భూసమస్యలపై ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి, ధరణి పోర్టల్‌లో సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారు.. వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భూరికార్డులను నమోదు చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకంపైనే భూమి హద్దులు, మ్యాప్ ముద్రించి అందజేస్తున్నారని తెలిపారు.

బీజేపీ సీనియర్ నేత హనుమంతరావు కన్నుమూత



లంగర్‌హౌజ్ (హైదరాబాద్): బీజేపీ సీనియర్ నేత, మాజీ ప్రధాని వాజ్‌పేయికి అత్యంత ఆప్తుడైన ఆకుల హనుమంతరావు (78) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. లంగర్‌హౌజ్‌లో నివసిస్తున్న ఆయన అప్పటి జనసంఘ్ పార్టీ తరపున రాష్ట్రంలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ వ్యవహారాలపై తన నివాసంలో కూర్చొని అటల్ బిహారీ వాజ్‌పేయితో చర్చించేవారు. దక్షిణాదిలో లంగర్‌హౌజ్ త్రివేణి సంఘంలో బాపూజీ అస్థికలను నిమజ్జనం చేయాలని స్వాతంత్ర్య సమరయోధుడు బోయినపల్లి వెంకట రమణతో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో మాట్లాడి ఒప్పించారు. లంగర్‌హౌజ్‌లో గాంధీజీ సమాధి నిర్మాణంలో కూడా కీలకపాత్ర పోషించారు. ఎమర్జెన్సీ సమయంలో నాసా చట్టం కింద రెండు నెలల జైలు జీవితం కూడా అనుభవించారు. ఆయన కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ.. బ్రెయిన్ స్ట్రోక్‌తో నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందారు.

ప్రముఖుల నివాళి

సీనియర్ నేత ఆకుల హనుమంతరావు లేని లోటు ఎవరూ తీర్చలేరని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. హనుమంతరావు మృతి విషయం తెలిసి దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి సంతాపం తెలిపారు. శుక్ర వారం త్రివేణి సంఘం శ్మశానవాటికలో అంత్యక్రియలు జరగనున్నాయి. మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు కూడా సంతాపం తెలిపారు.

కరీంనగర్‌లో ప్రేమోన్మాది ఘాతుకం

- యువతిపై దాడి చేసి.. గొంతు కోసేందుకు యత్నించి..
- పరారైన నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు



బొద్దుల సాయి

కొత్తపల్లి(కరీంనగర్): ఓ ప్రేమోన్మాది యువతిపై కత్తితో దాడిచేసి పరారైన ఘటన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి కట్టేమిషన్ ఏరియాలో గురువారం సాయంత్రం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపల్లి గ్రామానికి చెందిన బొద్దుల సాయి, ఓ యువతి ఎదురెదురు ఇంట్లో ఉంటున్నారు. సాయి ఇసుక క్వారీలో ఉద్యోగం చేస్తుండగా ఎమ్మెస్సీ పూర్తిచేసిన యువతి ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతోంది. ఆమెను నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ సాయి వేధిస్తున్నాడు. విషయం తెలిసిన పెద్దలు సాయిని మందలించారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ కూడా నిర్వహించారు. తర్వాత కొన్నిరోజులు బాగానే ఉన్న సాయి ఇటీవల మళ్లీ ఆ యువతిని వేధించడం ప్రారంభించాడు. పెళ్లి చేసుకుంటానని యువతి తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపాడు.

ఇంట్లోకి చొరబడి..

గురువారం యువతి తండ్రి ఆడెపు వీరేశం బట్టలు అమ్మేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటకు వెళ్లాడు. తల్లి స్థానికంగా కిరాణాదుకాణంలో సరుకులు అమ్ముతోంది. ఇదే సమయంలో సాయి ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న యువతిపై దాడి చేశాడు. ఈ ఘటనలో యువతి పన్ను విరిగి చేతికి గాయమైంది. అంతటితో ఆగకుండా కత్తితో గొంతుకోసే ప్రయత్నం చేశాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకునేసరికి పరారయ్యాడు. వెంటనే స్థానికులు యువతిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి పరారైన యువకుడి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
No.SA1/122(2)/2023-TH టెండరు ప్రకటన Dt. 03.01.2024.
TSRTC హాస్పిటల్, తార్నాక, హైదరాబాద్ యొక్క పెస్ట్ కంట్రోల్ యాక్టివిటీ కోసం అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కేటాయింపు కోసం సీల్డ్ టెండర్లు ఆహ్వానింపబడ్డాయి. (1) టెండరు ఫారాలు తార్నాకలోని పర్సనల్ ఆఫీసర్ కార్యాలయంలో 06.01.2024 నుండి 16.01.2024 వరకు అన్ని పని దినాలలో 09.30 గంటల నుండి 16.00 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. (2) పూరించిన టెండరు ఫారమ్ 17.01.2024న 14.00 గంటల [illegible] TSRTC హాస్పిటల్ 1వ అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉంచబడిన టెండరు బాక్స్‌లో [illegible] వివరాల కోసం మా వెబ్‌సైట్ http://www.krk.telangana.gov.in (టెండర్లు) సంప్రదించండి. [illegible]
DIPR RO No.9178-PP/CL/Advt/1/2023-24, Dt.04.01.2024

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
చీఫ్ ఎడిటర్ ఆఫీస్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Rc.No.TTD-95021(31)/78/2018-Chief Editor తేది: 02-01-2024
[illegible] http://www.tirumala.org & http://tender.ap.eprocurement.gov.in [illegible] ఫోన్ నం: 0877-2264543, 2264363.
Roc.No.PR4/13962/Adv.No.328/PRO/2024, Dt. 04.01.2024 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
నం.SE/TSEWIDC/HYD/NIT/1137 to 1142/2023-24 తేది: 03-01-2024
[illegible]
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TSEWIDC, హైదరాబాద్
DIPR RO No.9158-PP/CL/Advt/1/2023-24, Dt.04.01.2024

తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
ఫోన్ నెం.040-40032888, ఇ-మెయిల్: cetsmsidc@gmail.com
టెండర్ నోటీస్ నం.18/TSMSIDC/Tech/2023-24, తేది: 04.01.2024
[illegible]
DIPR RO No.9168 - PP/CL/Advt/1/2023-24, Dt.04.01.2024 సం/- చీఫ్ ఇంజనీర్

బహిరంగ ప్రకటన
ఉన్నతస్థాయి కమిటీ - ఒకే దేశం, ఒకే ఎన్నికలు
దేశంలో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రస్తుత చట్టపరమైన పరిపాలనా కార్యాచరణలో తగిన మార్పులు చేయడానికి సాధారణ ప్రజల సభ్యుల నుండి సూచనలను కోరుతూ ప్రకటన
గెజిట్ నోటిఫికేషన్ నం.211 తేది సెప్టెంబర్ 2, 2023 (https://onoe.gov.in/onoe-gazette-notification) ప్రకారం భారత ప్రభుత్వం ఒకే దేశం, ఒకే ఎన్నికల కోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. నిర్దేశ నియమాల ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికి తగిన చట్టపరమైన మరియు పరిపాలనా కార్యాచరణ రూపొందించడానికి, రాజ్యాంగం మరియు సంబంధిత ఎన్నికల చట్టాలకు అవసరమైన సవరణలను గుర్తించడం, సాధారణ ఓటర్ల జాబితా, EVMs/VVPATs మొదలగు వంటి లాజిస్టిక్స్ తయారీ చేయడానికి కమిటీ సిఫార్సులు చేయవలసి ఉంటుంది.
కమిటీ యొక్క నిర్దేశ నియమాల వివరాలను మరియు వైవిధ్య సంస్థల నివేదికలను వెబ్‌సైట్ https://onoe.gov.in/onoe-reports లో చూడవచ్చును. దేశంలో ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికి ప్రస్తుత చట్టపరమైన పరిపాలనా కార్యాచరణలో తగిన మార్పులు చేయడానికి సాధారణ ప్రజల సభ్యుల నుండి వ్రాతపూర్వక సూచనలు కోరబడుచున్నవి. 15 జనవరి 2024 లోగా అందిన సూచనలన్నీ పరిశీలన కోసం కమిటీ ముందు ఉంచబడతాయి. https://onoe.gov.in లో పోస్ట్ చేయవలెను లేదా sc-hlc@gov.in కు ఇమెయిల్ చేయవలెను లేదా దిగువ ఇవ్వబడిన చిరునామాకు తపాలా ద్వారా పంపవలెను.
SECRETARY
High Level Committee - One Nation, One Election
Jodhpur Officers Hostel, (Block No.9)
near National Gallery of Modern Arts
'C' Hexagon (India Gate Circle)
New Delhi - 110003
CBC 24301/11/0003/2324

भारी पानी संयंत्र, मणुगूरु HEAVY WATER PLANT, MANUGURU
ई-निविदाएं आमंत्रित करने हेतु सूचना Notice Inviting e-Tenders
महाप्रबंधक, एचडब्ल्यूपी (एम) भारत के राष्ट्रपति की ओर से, निम्नलिखित कार्यों के लिए दो बोली प्रणाली पर ऑनलाइन आइटम दर आमंत्रित करते हैं।
The General Manager, HWP (M) invites on behalf of President of India online item rate on two bid system for following work (s).
एनआईटी नंबर : एचडब्ल्यूपीएम/एमयू/टीजी/2305/आर2
NIT No. : HWPM/MU/TG/2305/R2
कार्य का नाम : "सीपीपी, एचडब्ल्यूपीएम (एएमसी) में टीजी ग्रुप में मरम्मत और निर्माण कार्य"
Name of Work : "Repair & Fabrication Works in TG Group at CPP, HWPM (AMC)"
आनुमानित लागत Estimated Cost : Rs. 21,59,000/- बयाना राशि Earnest Money : Rs. 43,180/-
पूर्ण होने की अवधि : कार्य आदेश की तिथि से 1 वर्ष Period of Completion : 1 year from the date of WO
बोली जमा करने की अंतिम समय और तारीख (ऑनलाइन) :
Last Time and Date of Submission of Bid (Online) : Up to 09-00 hrs. on 16-01-2024
बोली प्रपत्र और अन्य विवरण वेबसाइट https://eprocure.gov.in/eprocure/app से प्राप्त किए जा सकते हैं। एनआईटी www.hwb.gov.in पर भी उपलब्ध है।
The bid forms and other details can be obtained from the website : https://eprocure.gov.in/eprocure/app. The NIT is also available on www.hwb.gov.in
Sd/-
सं.No. [illegible] HWP(M)/ [illegible] Adm(G)/एनआईटी NIT/18/2024/09 Dt. 04-01-2024. For & On behalf of the President of India

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003
PUBLIC NOTICE
This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SHRI P YADAIAH	SHRI RAYANKI BALA KRISHNA S/o RAYANKI NAGABHUSHNAM	12 AND 11/P/FF/SF, SREE NAGAR COLONY, TRIMULGHERRY	SALE DEED NO 1891/2023, DT 19/10/2023 (LINK DOCUMENTS)
2	SMT UMA RAJAMANI	SHRI NARENDER BELLAMKONDA S/o B VENKATNARAYAN	PNO E/FF,MARREDPALLY VILLAGE,MARREDPALLY	SALE DEED NO 448/2017,DT 07/04/2017 (LINK DOCUMENTS)
3	SHRI B SHANTHI NARAYAN	1.SMT SANTOSH DEVI W/o PUROHIT DILIP 2.ANAND PUROHIT S/o PUROHIT DILIP 3.JHAWAR PUROHIT S/o PUROHIT DILIP	PNO1/GF,FF/SF, S B H CO-OP HS, WEST MARREDPALLY	SALE DEED NO 2190/2023, DT 19/12/2023 (LINK DOCUMENTS)
4	SRI A VOWELS	SMT NISHA THAKUR W/o THAKUR SUDHEER SINGH	PNO 54/FF, CHANDULAL BOWLI, CHANDULAL BOWLI	SALE DEED NO 986/2023,DT 31/05/2023 (LINK DOCUMENTS DEATH CERTIFICATE OF A VOWELS
5	SHRI P RAVINDER	SHRI KOTRA RAJESHWAR S/o KOTRA PRAHLAD	PNO 204/FF(PNO 98,16) TIRUMALA HOMES, AMARAVATHI CHS	SALE DEED NO 1069/2023, DT 09-06-2023 (LINK DOCUMENTS)
6	SHRI D NARSING RAO	SHRI SEVELLA SAI NATH S/o SEVELLA RAVINDRA NATH	PNO 24/P/GF/FF/SF, CHANDRA NAGAR COLONY, RASOOLPURA	WILL DEED NO 221/3/II/2021, DT. 28/11/2021 DEATH CERTIFICATE OF D NARSING RAO DT.26/02/2022(LINK DOCUMENT)
7	SMT UMA	SHRI STANLEY NAYAK S/o GEORGE NAYAK	14/1/GF/FF,MAHALAXMI NARSIMHA SWAMY CHS	SALE DEED NO 2268/2023 DT 27/12/2023 (LINK DOCUMENTS)
8	SMT GUDIMETLA MADHAVI LATHA	SHRI VIDDIRALA MARKANDEYULU S/o V V KRISHNA RAO	PNO 51/FNO 201/SF, PICKET CO-OP HOUSING SOCIETY,PICKET	SALE DEED NO 2264/2022, DT 15/12/2022 (LINK DOCUMENTS)
9	SHRI MAHAMMED ABDUL GAFFAR	SMT POOJA JAIN W/o VIKAS POKARNA	PNO 6/GF/FF,RAGHAVA CHS (VENT I),KARKHANA	SALE DEED NO 1866/2023, DT 18/10/2023 (LINK DOCUMENTS)
10	SMT SURINDER KAUR	SMT TALLAPALLI SARIKA W/O T SRIDHAR RAO	HNO 1-10-243 PEDDA THOKATTA BOWENPALLY	SALE DEED NO 1449/2023 DT 05/08/2023 (LINK DOCUMENTS)
11	S N MAHANT	1.SHRI SARATH MOHAN TAKASI S/o VENKATESWARLU 2 SMT SUBHADRA DEVI TAKASI W/o SARATH MOHAN TAKASI	PNO 24/GF,FF, RLY EMPLOYEES CHS, THOKATTA, SIKH ROAD	SALE DEED NO 325/2023, DT 22/02/2023 (LINK DOCUMENTS)
12	SMT T ANJALI	SHRI BOLLAVARAM VENKATA RAJA SHEKAR REDDY S/o B VENKATA CHALAMA REDDY	PNO 12/GF, VIJAY NAGAR COLONY, PICKET	SALE DEED NO 1962/2023, DT 02/11/2023 DEATH CERTIFICATE OF ANJALI, FAMILY MEMBER CERTIFICATE (LINK DOCUMENTS)
13	SMT T ANJALI	SHRI BOLLAVARAM VENKATA RAJA SHEKAR REDDY S/o B VENKATA CHALAMA REDDY	PNO 12/FF,SF, VIJAY NAGAR COLONY, PICKET	SALE DEED NO 1962/2023, DT 02/11/2023 (LINK DOCUMENTS)
14	SHRI RANGA RAO	SMT PALLEMPATY LAKSHMI RAO W/o P RANGA RAO	PNO 23/GF/FF/FF/SF, LOB COLONY, TRIMULGHERRY	RELEASE DEED NO 1332/2023, DT 19/07/2023 DEATH CERTIFICATE OF P RANGA RAO (LINK DOCUMENTS)
15	SHRI D E VIJAY SEKHAR	SHRI G SATHYA NARAYANA S/o LATE G VENKAIAH	PNO 30/GF,VANITHA H V ENCLAVE (SR PURAN), BOWENPALLY	SALE DEED NO 280/2015, DT 09/03/2015 (LINK DOCUMENTS)
16	SMT SAVITHRI	SHRI A CHANDRA SHEKAR REDDY S/o A SESHI REDDY	508/4F,SARTAJKRISHNA ENCLAVE (JUPITER), SIKH ROAD,BALAMRAI	SALE DEED NO 230/2004, DT 11/02/2004 (LINK DOCUMENTS)

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.
No. SCB/TB/36, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003.
Date : 04-01-2024
Sd/-
Chief Executive Officer,
Secunderabad Cantonment Board.

నాలుగు రోజుల తర్వాత

తల్లి ఒడికి..



ఈ పిల్ల ఏనుగు తల్లి ఒడిలో వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ హాయిగా నిద్రిస్తోంది. ఇందులో ప్రత్యేకత ఏముంది అంటారా? మంద నుంచి తప్పిపోయిన ఈ బుజ్జి ఏనుగు నాలుగు రోజుల తర్వాత తల్లి వద్దకు చేరుకుంది. అటవీ శాఖ అధికారులు ఎంతో శ్రమించి పిల్ల ఏనుగును తల్లి ఏనుగు వద్దకు చేర్చారు. తమిళనాడులోని అన్నామలై టైగర్ రిజర్వ్‌లో ఏనుగులు గుంపులుగా సంచరిస్తుంటాయి. గత నెల 29వ తేదీన అడవిలో ఒంటరిగా ఉన్న పిల్ల ఏనుగును అధికారులు గుర్తించారు. అది మంద నుంచి వేరుపడినట్లు గుర్తించారు. తల్లి వద్దకు క్షేమంగా చేర్చడానికి చర్యలు ప్రారంభించారు. గజమాత కోసం డ్రోన్లతో గాలింపు చేపట్టారు. 3 కిలోమీటర్ల దూరంలో ఏనుగుల గుంపు ఒకటి సంచరిస్తున్నట్లు కనిపెట్టారు. తల్లి అందులోనే ఉండొచ్చని భావించారు. పిల్ల ఏనుగును ఈ నెల 2వ తేదీన ఆ గుంపు వద్దకు చేర్చారు. బిడ్డను గుర్తించిన తల్లి ఏనుగు వెంటనే ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది. అమ్మ ఒడిలోకి బిడ్డ ఒదిగిపోయింది. అది చూసి తమ శ్రమ ఫలించినందుకు అటవీ శాఖ సిబ్బంది ఆనందించారు. ఈ దృశ్యాన్ని ఫోన్లలో బంధించారు. ఈ చిత్రాన్ని తమిళనాడు అటవీ శాఖ అధికారి సుప్రియా సాహూ 'ఎక్స్'లో పోస్టు చేయగా, నెటిజన్లు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఉల్లాసంగా ఉత్సాహంగా..

కడలి ఒడిలో



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షద్వీప్ పర్యటన సందర్భంగా సముద్రంలో నీటి అడుగున సాహస క్రీడలో స్వయంగా పాల్గొన్నారు. అక్కడి జలచరాలను, వాటి జీవనాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అరేబియా సముద్రంలో ఉల్లాసకరమైన అనుభవం సొంతం చేసుకున్నానంటూ మోదీ తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. సముద్రం అడుగున తన సాహసానికి సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. అడ్వెంచర్‌ను ఇష్టపడేవారికి లక్షద్వీప్ సందర్శన అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. లక్షద్వీప్‌లో తన పర్యటన సందర్భంగా స్నాకలింగ్‌ను(నీటి అడుగున సాహసం) ప్రయత్నించానని తెలిపారు. అది మర్చిపోలేని అనుభవమని ఉద్ఘాటించారు. లక్షద్వీప్ సముద్ర తీరాల్లో ఉదయం పూట నడక, బీచ్ ఒడ్డున కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న ఫొటోలను సైతం మోదీ షేర్ చేశారు. ఆయన ఈ నెల 2, 3వ తేదీల్లో లక్షద్వీప్‌లో పర్యటించారు. పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు. వివిధ ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. లక్షద్వీప్ అందచందాలతోపాటు అక్కడి ప్రశాంతత మనల్ని మంత్రముగ్ధులను చేస్తాయని పేర్కొన్నారు. అలాగే అక్కడి ప్రజలు చూపిన ఆత్మీయత, గౌరవం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని వివరించారు. లక్షద్వీప్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ తెలిపారు.

యోగిని చంపేస్తానంటూ బెదిరింపులు

డియోరా: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను చంపేస్తానంటూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో బెదిరించడం కలకలం రేపింది. అజిత్ యాదవ్ అనే యువకుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పెట్టిన అనుచిత వ్యాఖ్యలతో కూడిన మెసేజీ బుధవారం రాత్రి నుంచి వైరల్ అవుతోంది. ఈ మేరకు రుద్రపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆ యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్పీ సంకల్ప్ యాదవ్ చెప్పారు. డియోరా జిల్లా ఫతేపూర్‌లో అక్టోబర్ 2వ తేదీన ఆరుగురిని బలి తీసుకున్న భూ వివాదం గురించి అతడు ఆ పోస్టులో ప్రస్తావించాడని ఎస్పీ చెప్పారు. జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు ప్రేమ్ యాదవ్‌ను అతడి ప్రత్యర్థి సత్యప్రకాశ్, అతడి కుటుంబసభ్యులు కలిసి చంపేశారు. ఈ విషయం తెలిసి యాదవ్ మద్దతుదారులు సత్యప్రకాశ్‌తోపాటు అతడి భార్య, ముగ్గురు పిల్లలను హత్య చేశారు. అయితే, ప్రేమ్ యాదవ్ ఇల్లు ప్రభుత్వ స్థలంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ ఇంటిని కూల్చేసిన పక్షంలో సీఎం యోగిని చంపేస్తానంటూ అజిత్ యాదవ్ బెదిరించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

వాంటెడ్ ఉగ్రవాది మట్టూ అరెస్ట్

న్యూఢిల్లీ: కశ్మీర్‌లో బలగాల కళ్లుగప్పి తిరుగుతున్న హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది జావెద్ అహ్మద్ మట్టూ(32)ను ఎట్టకేలకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు పట్టుకున్నారు. నిజాముద్దీన్ ఏరియాలో తస్కరించిన కారులో వెళ్తుండగా అతడిని పట్టుకున్నారు. అతడి నుంచి ఒక పిస్టల్, ఆరు కాట్రిడ్జిలు స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లోని సాపోర్‌కు చెందిన మట్టూకు కనీసం అయిదు గ్రెనేడ్ దాడులు అయిదుగురు పోలీసులను పొట్టనబెట్టుకున్న ఘటనలు సహా మొత్తం 11 ఉగ్ర ఘటనలతో ప్రమేయముంది. హిజ్బుల్ ముజాహిదీన్‌తోపాటు అల్ బదర్ ఉగ్ర సంస్థల్లో సభ్యుడని స్పెషల్ పోలీస్ కమిషనర్ ధలీవాల్ చెప్పారు. వాంటెడ్ ఉగ్రవాదిగా ఉన్న మట్టూ తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. భద్రతా బలగాల ఏ ప్లస్‌ప్లస్ కేటగిరీలో సజీవంగా ఉన్న కశ్మీర్ ఉగ్రవాదుల్లో ఇతడొకడు. 2010నుంచి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు సాగిస్తున్న జావెద్ మట్టూ గతంలో పలుమార్లు పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చాడు. కొన్నేళ్ల క్రితం భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో గాయపడిన ఇతడు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ సలహా మేరకు నేపాల్ వెళ్లి తలదాచుకున్నాడు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి కొనుగోలు చేసేందుకు అతడు నేపాల్ నుంచి ఢిల్లీకి వస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందడంతో వలపన్ని పట్టుకున్నారు.

లెబనాన్‌ను వీడండి

న్యూఢిల్లీ: హమాస్ అగ్రనేత సలేహ్ అల్ అరౌరీని ఇజ్రాయెల్ డ్రోన్ దాడితో లెబనాన్ గడ్డపై హతమార్చడంతో హమాస్–ఇజ్రాయెల్ యుద్ధమేఘాలు లెబనాన్‌పైనా కమ్ముకుంటాయని అమెరికా, దాని మిత్రదేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇందులోభాగంగా లెబనాన్‌లో ఉంటున్న తమ పౌరులను తక్షణం వెనక్కి రావాలని అడ్వైజరీలు, హెచ్చరికలు జారీచేశాయి. ఈ మేరకు జర్మనీ విదేశాంగ శాఖ సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్ట్ పెట్టారు. '' వీలైనంత త్వరగా జర్మనీ పౌరులంతా లెబనాన్‌ను వదిలేయండి. అత్యవసర 'ఎలిఫాండ్' సంక్షోభ సన్నద్ధత జాబితాలో మీ పేర్లను రిజిస్టర్ చేసుకోండి. అరౌరీ హత్య తర్వాత లెబనాన్‌లో సంక్షోభం తలెత్తే ప్రమాదముంది'' అని పోస్ట్‌చేసింది. ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై హమాస్ మిలిటెంట్లు దాడి చేసినపుడు గత అక్టోబర్‌లోనూ జర్మనీ ఇలాంటి అడ్వైజరీని విడుదలచేసింది. కెనడా, అమెరికా, స్వీడన్‌లూ ఇదే తరహాలో స్పందించాయి.

శ్రీరాముడిపై ఎన్సీపీ నేత వ్యాఖ్యలు

ముంబై: హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముడు మాంసాహారి అంటూ ఎన్సీపీ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి జితేంద్ర అవ్హాద్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. బుధవారం షిర్డీలో జరిగిన కార్యక్రమంలో అవ్హాద్ మాట్లాడుతూ..'శ్రీరాముడు మనవాడు. మన బహుజనుడు. రాముడు వేటాడి, మాంసాన్ని తినేవాడు. మీరు మమ్మల్ని శాకాహారిగా మారాలంటున్నారు. కానీ, శ్రీరాముడినే మేం ఆదర్శంగా భావిస్తాం. మాంసం తింటాం. శ్రీరాముడు శాకాహారిగా కాదు, మాంసాహారి'అని అన్నారు. అయోధ్య రామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న వేళ ఆయన వ్యాఖ్యలు తీవ్ర కలకలానికి కారణమయ్యాయి. శ్రీరాముడిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన అవ్హాద్‌పై బీజేపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అవ్హాద్ తన వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పారు.

కరోనా కేసుల ఉధృతి

న్యూఢిల్లీ: భారత్‌లో కరోనా పాజిటివ్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో ఏకంగా 760 కొత్త కేసులు నమోదయ్యాయి. క్రియాశీలక కేసుల సంఖ్య 4,423కి ఎగసింది. గత 24 గంటల్లో కేరళ, కర్ణాటకలో చెరో రోగి కోవిడ్‌తో కన్నుమూశారని కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం తెలిపింది. గత ఏడాది డిసెంబర్ ఐదోతేదీదాకా రోజూ రెండంకెల స్థాయిలో నమోదైన కొత్త కేసులు ఇప్పుడు ఒక్కసారిగా ఎక్కువయ్యాయి. 2020 తొలినాళ్లలో కోవిడ్ మహమ్మారి భయంకరంగా విజృంభించడంతో ఆరోజుల్లో కోట్లాది పాజిటివ్ కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

కొలరాడో కోర్టు తీర్పును రద్దు చేయండి

డెన్వర్: కొలరాడో రాష్ట్రంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రైమరీ ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధిస్తూ కొలరాడో కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కొలరాడో కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం త్వరలో విచారణ చేపట్టనుంది. 2020 నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి అనంతరం ఆయన మద్దతుదారులు 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్‌పై దాడికి దిగారు. వారిని హింసకు ప్రేరేపించినట్లు ట్రంప్‌పై అభియోగాల నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో కొలరాడోలో ప్రైమరీ ఎన్నికల్లో పోటీకి ఆయన అనర్హుడని కొలరాడో సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.

ఒకే కుటుంబంలోని 14 మంది మృతి

ఖాన్‌యూనిస్: ఇజ్రాయెల్ నిరంతరాయంగా కనికరం లేకుండా జరుపుతున్న దాడుల్లో పాలస్తీనియన్ల కుటుంబాలు సమిధలవుతున్నాయి. గురువారం ఖాన్‌యూనిస్‌కు సమీపంలోని ఓ ఇంటిపై జరిగిన దాడితో అందులోని సలాహ్ కుటుంబానికి చెందిన 14 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో అయిదేళ్ల చిన్నారి కూడా ఉన్నాడు. వీరంతా గాజాలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఇక్కడ తలదాచుకుంటున్నారు.

గెలుపే ధ్యేయంగా కలిసి పనిచేద్దాం

- కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశానిర్దేశం
- పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశం
- రాహుల్ గాంధీ యాత్ర రూట్‌మ్యాప్ స్వల్ప మార్పులతో ఖరారు

సాక్షి, న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఢిల్లీ నుంచి గల్లీ స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఒక జట్టుగా కలిసి పనిచేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిశానిర్దేశం చేశారు. రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ అలుపెరుగకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. అధికార బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని చెప్పారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీలతో ఖర్గే సమావేశమయ్యారు. పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ సైతం హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత, పార్టీ వ్యూహం, మేనిఫెస్టో, సీట్ల సర్దుబాటు, భారత్ జోడో న్యాయ్ యాత్ర తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణులకు ఖర్గే పలు సూచనలు చేశారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి బీజేపీ యత్నాలు

కేంద్రంలో అధికార బీజేపీ గత పదేళ్లలో చేసిందేమీ లేదని, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోందని మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేపట్టిన రాహుల్ గాంధీని ప్రశంసించారు. దేశంలో అమలుకు నోచుకోని సాంఘిక న్యాయం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల సమస్యలు, ప్రజల ఆర్థిక పరిస్థితి, కుల గణన తదితర కీలక అంశాలను భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా లేవనెత్తనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ యాత్ర సామాజిక న్యాయ సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకువస్తుందని ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు.



సమావేశంలో ఖర్గే, రాహుల్ మంతనాలు

బీజేపీకి తగిన సమాధానం చెప్పాలి

బీజేపీ అబద్ధాలు, మోసాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఖర్గే సూచించారు. విభేదాలను పక్కనపెట్టి పని చేయాలని, అంతర్గత సమస్యలపై రచ్చకెక్కకూడదని హితవు పలికారు. బీజేపీ 10 ఏళ్లలో ఘనంగా చెప్పుకునే ఒక్క పనీ చేయలేదని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వ పథకాల పేర్లను, రూపాలను మార్చడంపైనే బీజేపీ దృష్టి పెట్టిందని ఆక్షేపించారు. 'ఇండియా' కూటమి తరఫున దేశవ్యాప్తంగా 8 నుంచి 10 భారీ బహిరంగ సభలు ఉమ్మడిగా నిర్వహించాలని సూచించారు.

భారత్ జోడో న్యాయ్ యాత్ర

తూర్పు నుంచి పశ్చిమ భారతదేశం వరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తలపెట్టిన యాత్ర పేరు మారింది. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' అని గురువారం నామకరణం చేశారు. తొలుత భారత్ న్యాయ్ యాత్ర అని పేరుపెట్టారు. ఇప్పుడు అదనంగా జోడో అనే పదాన్ని జోడించారు. రాహుల్ దక్షిణాదిన కన్యాకుమారి నుంచి ఉత్తరాదిన కశ్మీర్ వరకు ఇప్పటికే భారత్ జోడో యాత్ర పూర్తిచేసిన సంగతి తెలిసిందే. ఇక 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం సన్నాహాలు మొదలయ్యాయి. మణిపూర్ నుంచి రాహుల్ యాత్రకు శ్రీకారం చుడతారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ముగిస్తారు. ఎక్కువగా బస్సు యాత్ర, వీలును బట్టి పాదయాత్ర ఉంటుంది. యాత్రలో పాల్గొనాల్సిందిగా విపక్ష 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలను కూడా ఆహ్వానిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' రూట్‌మ్యాప్‌ను స్వల్పమార్పులతో ఖరారు చేశారు. మణిపూర్‌లో ప్రారంభమయ్యే యాత్ర 66 రోజులపాటు కొనసాగుతుంది. 6,713 కిలోమీటర్ల మేర బస్సుయాత్ర, పాదయాత్ర నిర్వహిస్తారు. 15 రాష్ట్రాలు, 110 జిల్లాలు, 100 లోక్‌సభ నియోజకవర్గాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా యాత్ర జరుగుతుంది. ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 11 రోజులపాటు 1,074 కిలోమీటర్లు యాత్ర సాగనుంది. భారత్ జోడో యాత్ర ఒక బ్రాండ్‌గా స్థిరపడిందని, న్యాయ్ యాత్రలో సైతం జోడోను చేరిస్తే బాగుంటుందని పార్టీ నేతలంతా సూచించడంతో పేరు మార్చారు. ఇందులో న్యాయ్ అనే పదాన్ని రాజ్యాంగ ప్రవేశిక నుంచి స్వీకరించినట్లు జైరామ్ తెలిపారు.

ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే తీసుకోండి

- ఇతరత్రా చార్జీలు వేయకండి
- రక్తం విషయంలో ఆస్పత్రులు, బ్లడ్‌బ్యాంక్‌లకు డీసీజీఐ ఆదేశాలు

న్యూఢిల్లీ: రోగుల ఆపత్కాలాన్ని దుర్వినియోగం చేస్తూ ఆస్పత్రులు, బ్లడ్‌బ్యాంక్‌లు రక్త యూనిట్లకు భారీగా ఫీజులు వసూలుచేస్తున్నాయన్న ఆరోపణలపై ఔషధ నియంత్రణ సంస్థ స్పందించింది. ప్రాసెసింగ్ ఫీజు మినహా మరే ఇతరత్రా రుసుములు రక్త యూనిట్లపై వసూలుచేయొద్దని డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు రాసింది. బ్లడ్ యూనిట్లకు రోగులు భారీగా ఖర్చుచేస్తున్న ఉదంతాలు డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో చర్చకొచ్చాయి. ' రక్తం అమ్మకానికి కాదు. దానిని కేవలం సరఫరా చేయాలి. అమ్మకూడదు. సంబంధిత రక్త కేంద్రం(ఆస్పత్రి/బ్లడ్ బ్యాంక్) కేవలం ప్రాసెసింగ్ ఫీజును మాత్రమే వసూలుచేయాలి. అంతకుమించి ఇంకేం చార్జీలు వేయకూడదు' అని సమావేశ అజెండా ద్వారా తీర్మానించారు'' అని డీసీజీఐ తన లేఖలో పేర్కొంది. రక్తం, రక్త విభాగాలకు రూ. 250 నుంచి రూ.1,550 మాత్రమే వసూలుచేయాలని సూచించింది. సవరించిన ఈ మార్గదర్శకాలను మీ పరిధిలోని అన్ని బ్లడ్ సెంటర్లు పాటించేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్రాలు, యూటీల డ్రగ్ కంట్రోలర్లదేనని సీసీజీఐ స్పష్టంచేసింది. రోగికి రక్తం అవసరమైనపుడు రోగి బంధువులు/సంబంధిత వ్యక్తులు వేరే గ్రూప్ బ్లడ్‌ను దానం చేయని సందర్భాల్లో ఒక్కో యూనిట్ బ్లడ్‌కు ప్రైవేట్ ఆస్పత్రులు రూ.3,000 నుంచి రూ.8,000 వసూలుచేస్తున్నట్లు అధికారిక వర్గాలే చెబుతున్నాయి. రోగికి కావాల్సిన గ్రూప్ రక్తం అందుబాటులో లేకపోవడం, అరుదైన బ్లడ్ గ్రూప్‌లాంటి సందర్భాల్లో అయితే విపరీతంగా చార్జీలు వసూలుచేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడం తెల్సిందే.



మహిళా జడ్జిపై దాడి చేస్తున్న నిందితుడు. గాయపడిన జడ్జి

కోర్టు హాల్‌లో మహిళా జడ్జిపై దాడి

నెవడా: ఓ కేసు విచారణకు సందర్భంగా నిందితుడు అనూహ్యంగా మహిళా జడ్జిపైకి దాడికి పాల్పడ్డాడు. అనంతరం కోర్టు సిబ్బంది, ఇతరులు కలిసి పిడిగుద్దులతో అతడికి దేహశుద్ధి చేశారు. లాస్ వెగాస్‌లోని రీజినల్ జస్టిస్ సెంటర్‌లో బుధవారం ఉదయం ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఏడాది క్రితం బేస్‌బాల్ బ్యాట్‌తో ఓ వ్యక్తిపై దాడి చేశాడన్న ఆరోపణ ఎదుర్కొంటున్న డియోబ్రా డెలోన్ రెడెన్(30)అనే వ్యక్తిని పోలీసులు క్లార్క్ కౌంటీ డిస్ట్రిక్ట్ జడ్జి మేరీ కే హోల్టస్ ఎదుట ప్రవేశపెట్టారు. కేసు వాదనలు పూర్తి కాగా, జడ్జి తీర్పు ప్రకటించారు. తీర్పువిన్న రెడెన్ తీవ్ర ఆగ్రహంతో దుర్భాష లాడుతూ ఒక్కసారిగా దుమికి, జడ్జి టేబుల్‌పైకి చేరుకున్నాడు. జడ్జి హోల్టస్ వెనక్కి నెట్టేశాడు. దీంతో, ఆమె కుర్చీలో నుంచి వెనక్కి పడిపోయి, గోడకు గుద్దుకున్నారు. అడ్డుకోబోయిన కోర్టు మార్షల్‌కు గాయాలయ్యాయి. కోర్టు సిబ్బంది, ఇతరులు కలిసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టు హాలు కొద్దిసేపు రణరంగాన్ని తలపించింది. కోర్టు హాలుకు వచ్చిన సమయంలో అతడి చేతులకు బేడీలు లేవు. ఘటన జడ్జి ఆదేశాల మేరకు రెడెన్ చేతులకు బేడీలు వేసి, క్లార్క్ కౌంటీ డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు.


టెట్రిస్ గేమ్‌ను జయించిన బాలుడు

వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా వీడియో గేమ్ ప్రియులకు చిరపరిచితమైన టెట్రిస్ గేమ్‌ను 13 ఏళ్ల అమెరికన్ టీనేజర్ ఎట్టకేలకు మొత్తం పూర్తిచేశాడు. ఈ గేమ్ విడుదలైన దాదాపు 40 ఏళ్ల తర్వాత తొలిసారిగా.. చివరి 157వ లెవల్ దాకా ఆడి చరిత్ర సృష్టించాడు. ఓక్లహోమాకు చెందిన ఈ బుల్లోడి పేరు విల్లీస్ గిబ్సన్. తాను సాధించిన రికార్డు చూసి తెగ సంబరపడిపోతున్నాడు. 'మొదటిసారి ఆట మొదలెట్టినపుడు దీన్ని పూర్తి/క్రాష్ చేయగలనని అస్సలు అనుకోలేదు. గెలుపుతో నా చేతి వేళ్ల స్పర్శనూ నేను నమ్మలేకపోతున్నా' అంటూ గేమ్ చిట్టచివరి 38 నిమిషాల వీడియోను మంగళవారం యూట్యూబ్‌లో గిబ్సన్ పోస్ట్‌చేశాడు. టెట్రిస్ గేమ్ ఇప్పటిదాకా కనీసం 70 విధానాల్లో 200కుపైగా అధికారిక వేరియంట్లలో విడుదలైంది. కిందకు పడిపోతున్న భిన్న ఆకృతుల 'బ్లాక్'లను వరసగా కిందివైపు పేర్చడమే ఈ ఆట.



అరెస్టుకు కుట్ర!

- ఈడీ ఇచ్చిన సమన్లు చట్టవిరుద్ధం..
- తప్పుడు కేసులతో నా గౌరవ ప్రతిష్టలను దెబ్బతీయలేరు
- బీజేపీపై కేజ్రీవాల్ ధ్వజం



న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తనను అరెస్టు చేయడానికి కుట్రలు పన్నిందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తాను ప్రచారం చేయకుండా అడ్డంకులు సృష్టించాలన్నదే బీజేపీ ఎత్తుగడ అని మండిపడ్డారు. కేజ్రీవాల్ గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తన ప్రతిష్టను దెబ్బతీయడానికి బీజేపీ సాగిస్తున్న కుతంత్రాలు ఫలించబోవని తేల్చిచెప్పారు. తన అతిపెద్ద ఆస్తి నిజాయతీ అని చెప్పారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట విచారణకు గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఆయన ఈడీ ఎదుట హాజరు కాకపోవడం ఇది మూడోసారి. విచారణ పేరుతో పిలిచి, ఈడీతో అరెస్టు చేయించడానికే లోక్‌సభ ఎన్నికల ముందు సమన్లు ఇచ్చారని ధ్వజమెత్తారు. ఈ కేసులో ఈడీ ఇచ్చిన సమన్లు చట్టవిరుద్ధమని తన లాయర్లు చెప్పారని కేజ్రీవాల్ అన్నారు. తనను ఎలాగైనా అరెస్టు చేయాలన్నదే బీజేపీ అసలు పన్నాగమని దుయ్యబట్టారు. సమన్లు చట్టవిరుద్ధమని పేర్కొంటూ ఈడీకి లేఖ రాశానని, అక్కడి నుంచి ప్రతిస్పందన రాలేదని వెల్లడించారు. సమన్లు చట్టవిరుద్ధమని తెలుసు కాబట్టే ఈడీ అధికారులు తన లేఖపై స్పందించలేదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా ఇచ్చిన సమన్లను తానెందుకు పాటించాలని ప్రశ్నించారు. ఒకవేళ చట్టబద్ధంగా ఇస్తే పాటిస్తానని వ్యాఖ్యానించారు. తప్పుడు కేసులతో తన గౌరవ ప్రతిష్టను ఎవరూ దెబ్బతీయలేరని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. నిజానికి ఢిల్లీలో మద్యం కుంభకోణమే జరగలేదన్నారు. ఈ కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవన్నారు. బీజేపీలో చేరనందుకే మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు.

అసలు రంగు బయటపడింది: బీజేపీ

కేజ్రీవాల్ అసలు రంగు బయటపడిందని బీజేపీ ప్రతినిధి సుధాంశు త్రివేది చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని మొహల్లా క్లినిక్‌ల సిఫార్సుతో ప్రైవేట్ ల్యాబ్‌ల్లో నకిలీ డయాగ్నోస్టిక్ టెస్టులు జరిగాయని, నకిలీ రోగులకు చికిత్స అందించారని చెప్పారు. ఈఉదంతంపై లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా సీబీఐ విచారణకు ఆదేశించారని తెలిపారు.

ఢిల్లీ ఎయిమ్స్‌లో అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. రెండో అంతస్తులోని రిప్రొడక్టివ్ బయాలజీ డిపార్టుమెంట్‌లో 6 గంటల సమయంలో మంటలు మొదలయ్యాయి. వెంటనే అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు అన్నారు. ఫ్రిడ్జిలో షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగింది.

10 వేల మందికి క్షమాభిక్ష

మయన్మార్ సైనిక జుంటా ప్రకటన

బ్యాంకాక్: మయన్మార్‌లోని సైనిక ప్రభుత్వం దేశ 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 వేల మందికి క్షమాభిక్ష ప్రకటించింది. జైళ్ల నుంచి విడుదలయ్యే వారిలో సైనిక ప్రభుత్వాన్ని వ్యతిరేకించే రాజకీయ ఖైదీలున్నదీ లేనిదీ వెల్లడి కాలేదు. 9,652 మంది ఖైదీలను క్షమాభిక్ష ద్వారా విడుదల చేస్తామంటూ దేశ మిలటరీ కౌన్సిల్ సీనియర్ జనరల్ మిన్ ఔంగ్ హ్లెయింగ్ తెలిపినట్లు ప్రభుత్వ టీవీ వెల్లడించింది. అయితే, పదవీచ్యుత నేత అంగ్ సాన్ సూకీ(78) పేరు ఈ జాబితాలో ఉన్న సూచనల్లేవని పరిశీలకులు అంటున్నారు. ఆమ్నెస్టీ పొందిన వారిలో 114 మంది విదేశీయులు సైతం ఉన్నారు. ఖైదీల విడుదల గురువారం మొదలై కొన్ని రోజులపాటు సాగుతుందని చెబుతున్నారు. రెండేళ్ల క్రితం అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఆర్మీ 25 వేల మందికి పైగా నిర్బంధించినట్లు చెబుతున్నారు.

బ్రాండెడ్ షూస్.. సగం ధరకే అమ్మేయాలని..

- బెంగళూరులో రూ.1.1 కోట్ల షూలను ఎత్తుకెళ్లి..
- పట్టుబడిన ట్రక్కు డ్రైవర్లు

బెంగళూరు: ఖరీదైన షూస్‌ను కొట్టేశారు. వాటిని అయిన కాడికి అమ్మేసి ధనవంతులై పోవాలని ప్లాన్ వేశారు. అయితే కథ అడ్డం తిరిగి జైలు ఊచలు లెక్కబెడుతున్నారు. నగరానికి చెందిన దిగంత్ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు తమకు కావాల్సిన ట్రక్కులు, డ్రైవర్లను పీన్యాలోని ఈసీ షిప్పర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ నుంచి అద్దెకు తీసుకుంటూ ఉంటారు. ఆదేవిధంగా, డిసెంబర్ 21న ఒక ట్రక్కుతోపాటు డ్రైవర్‌ను కూడా పనికి పెట్టుకున్నారు. చెప్పినవిధంగానే సలెహ్ అహ్మద్ లస్కర్ అనే డ్రైవర్ ట్రక్కుతో షెట్టిహళ్లిలోని 'నైక్'షోరూంకు వెళ్లి, రూ.1.1 కోట్ల 1,558 షూలను లోడు చేసుకుని అనుగొండనహళ్లిలోని మింత్రా గోదాము వైపు బయలుదేరాడు. కానీ, అక్కడికి వెళ్లలేదు. అనుమానం వచ్చిన ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు పోలీసులతో కలిసి జీపీఎస్ ఆధారంగా తరబనహళ్లి–చిక్కబనవర మధ్య ఉన్న ఖాళీ ట్రక్కును గుర్తించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా అదే రోజు అర్ధరాత్రి సమయానికి షూస్‌తోపాటు వాహనాన్ని గుర్తించారు. ఎత్తుకెళ్లిన షూస్ అందులో ఉన్నాయి. లస్కర్‌తోపాటు, సహకరించిన సుభాన్ పాషా, మన్సూర్ అలీ, సాహిదుల్ రహ్మాన్‌లను అరెస్ట్ చేశారు. వీరంతా నగరంలో పనిచేయడానికి వచ్చిన అస్సాంకు చెందిన ట్రక్కు డ్రైవర్లని పోలీసులు తెలిపారు. షూలను కొట్టేశాక వాటిని రోడ్డు పక్కన సగం ధరకే అమ్మేసి, తొందరగా డబ్బు సంపాదించాలనుకున్నామని వెల్లడించారు.



బ్యాంకుల బలోపేతానికి..
ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, మహిళలకు విరివిగా రుణాలు అందించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. -8లో



విద్యార్థులు పరీక్షలు తప్పితే..
పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఫెయిలైతే సంబంధిత ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పష్టం చేశారు. -8లో

మృగాళ్లు!



కన్న కూతురిపై తండ్రి అఘాయిత్యానికి పాల్పడగా.. బాధితురాలిని నమ్మించిన ఇద్దరు యువకులు సైతం లైంగిక దాడికి పాల్పడిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. -8లో

న్యూస్‌రీల్

జయసింహ సాహసం.. యువతకు స్ఫూర్తిదాయకం

- మేయర్, ఎమ్మెల్యే అభినందనలు



ఉప్పల్: ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి భారతదేశ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తెలంగాణ జిమ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయసింహ గౌడ్ తెలంగాణ సత్తా చాటారని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. గత డిసెంబర్ 29 నుంచి అయిదు రోజుల పాటు అతిపెద్ద హిమపాతంలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడం గొప్ప సాహసోతమని ఆమె ఘనంగా సన్మానించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ.. యువతకు జయసింహ స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తూ.. సాహసాలు చేస్తున్న జయసింహ గౌడ్‌ను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం కల్పించేలా కృషి చేస్తానన్నారు.

శభాష్ ఇర్ఫాన్!

- జొమాటో డెలివరీ బాయ్‌కి రూ.10 వేల ఆర్థిక సాయం



చార్మినార్: నగరంలో పెట్రోల్ కొరత కారణంగా పాతబస్తీ చంచల్‌గూడకు చెందిన జొమాటో డెలివరీ బాయ్ ఓ కస్టమర్‌కు మంగళవారం గుర్రంపై వెళ్లి ఫుడ్ అందజేశాడు. సదరు యువకుడు మహ్మద్ ఇర్ఫాన్‌ను గురువారం ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ అభినందించారు. రూ.10 వేలు నగదు సహాయం అందజేశారు. విధి నిర్వహణలో ఇర్ఫాన్ చిత్తశుద్ధి పలువురికి ఆదర్శంగా నిలిచిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పాలనలో రెవెన్యూ వ్యవస్థ విచ్ఛిన్నం

- ప్రొ.కోదండరామ్

పంజగుట్ట: బీఆర్ఎస్ పాలనలో రెవెన్యూ వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికత అనే సూత్రాన్ని పాటించకుండా వీఆర్ఏ, వీఆర్ఓలను రాష్ట్రంలో ఎక్కడపడితే అక్కడ పడేశారని.. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగులను జిల్లాస్థాయి పరిధిలోకి తీసుకువచ్చి స్థానికత ఆధారంగా ఉద్యోగాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో వీఆర్ఓల క్రమబద్ధీకరణ పేరుతో హడావుడిగా వాట్సాప్ ద్వారా ఆర్డర్‌లు ఇవ్వడంతో ఒక్కొక్కరు 10 నుంచి 15 సంవత్సరాల సర్వీస్ కోల్పోయారని, వారికి కేటాయించిన కొత్త శాఖలో కొత్త ఉద్యోగులుగా చేరారన్నారు. దీంతో చాలా డిపార్ట్‌మెంట్లలో వారికి గత ఐదు నెలలుగా వేతనాలు కూడా రాని దీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలను కూడా స్థానికత అనే సూత్రాలు ఎక్కడా పాటించకుండా 15,600 మందిని ఇష్టారీతిగా బదిలీలు చేసి క్రమబద్ధీకరించారని ఆరోపించారు. సమావేశంలో రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్, పూల్ సింగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



- పత్తాలేని పామాయిల్, ఇతరాలు
- కిరోసిన్, గోధుమలు నో స్టాక్
- సమయ పాలన లేని చౌకధరల దుకాణాలు
- లబ్ధిదారులకు తప్పని బయోమెట్రిక్ తిప్పలు

బియ్యమేనా!

రేషన్ కార్డుపై మిగతా సరుకులేవీ?

సాక్షి, సిటీబ్యూరో: ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా ఆహార భద్రత (రేషన్) కార్డుదారులకు నెలవారీ సరుకుల కోటా కేవలం దొడ్డు బియ్యానికే పరిమితమైంది. గత పదేళ్ల నుంచి పీడీఎస్ బియ్యం మినహా నిత్యావసర సరుకుల పంపిణీ లేకుండా పోయింది. గతంలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు పంపిణీ జరిగిన తొమ్మిది సరుకులు రెండింటికే పరిమితమయ్యాయి. ఆ రెండు సరుకుల కోటా సైతం విడుదలై చౌకధరల దుకాణాలకు సరఫరా అవుతున్నా... కార్డుదారులకు పంపిణీ మాత్రం అంతంత మాత్రంగా తయారైంది.

- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు అమ్మహస్తం పథకం కింద రూ.1కే కిలో చొప్పున బియ్యంతో పాటు రూ.185కి తొమ్మిది రకాల నాణ్యమైన నిత్యావసర సరుకుల పంపిణీ జరిగేది. నెలవారీ కోటా కింద కందిపప్పు, చింతపండు, గోధుమలు, గోధుమ పిండి, కారం, పసుపు, చక్కెర, ఉప్పు, పామాయిల్ తదితర సరుకులు అందేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెల్లరేషన్ కార్డు ఆహార భద్రత కార్డుగా మారిపోయింది. మరోవైపు నిత్యావసర సరుకుల కోటా ఒక్కొక్కటిగా నిలిపిపోయాయి. కేంద్ర ప్రభుత్వం పామాయిల్ సరఫరా పూర్తిగా నిలిపివేయగా.. మిగతా సరుకుల కోటా విడుదల సైతం క్రమంగా ఆగిపోయింది.
- ప్రస్తుతం కిరోసిన్, గోధుమల కోటా విడుదలవుతున్నా.. పంపిణీ మాత్రం మొక్కుబడిగా తయారైంది. దీంతో ప్రభుత్వ చౌకధరల దుకాణాలు కేవలం బియ్యం కోటా పంపిణీకి మాత్రమే పరిమితమైనట్లు కనిపిస్తోంది.

పంపిణీలో సైతం నిర్లక్ష్యమే

ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీలో సైతం డీలర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. దుకాణం తెరవడంలో, బియ్యం పంపిణీలో సమయపాలన లేకుండా పోయింది. పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే.. నెలవారీ కోటా సరఫరాలో ఆలస్యం, ఇతరత్రా కారణాలతో ప్రతి నెలా 5 నుంచి 18 వరకు, మధ్యలో వారాంతపు సెలవు కాకుండా మిగతా సెలవులు వస్తే మాత్రం గడువు మరో రెండురోజులు పొడిగిస్తూ వస్తోంది పౌరసరఫరాల శాఖ. డీలర్లు తమ దుకాణాల ముందు పంపిణీ గడువు తేదీ ప్రదర్శించని కారణంగా లబ్ధిదారులకు కోటా డ్రా చేయడం సమస్యగా పరిణమించింది. దుకాణానికి స్టాక్ వచ్చిన రెండు మూడు రోజుల్లో నిల్వలు ఖాళీ అవుతున్న కారణంగా లబ్ధిదారులు ఒకటో తేది నుంచి రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు దుకాణాలకు సమయపాలన కూడా లేకుండా పోయింది. డీలర్లు అధిక శాతం ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు మాత్రమే దుకాణాలు తెరిచి ఉంచడం సర్వసాధారణమైంది.

బయోమెట్రిక్ తిప్పలు..

ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ ఈ–పాస్ విధానంలో బయోమెట్రిక్, ఐరిష్ గుర్తింపు ద్వారా అమలవుతున్న కారణంగా సాంకేతిక సమస్య లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఒకవైపు ఆన్‌లైన్ సర్వర్ మొరాయింపు మరోవైపు బయోమెట్రిక్, ఐరిష్ గుర్తింపు నత్తకు నడక నేర్పిస్తోంది. వయోవృద్ధులు, మహిళల వేలిముద్ర, ఐరిష్‌లు అప్‌డేట్ కాని కారణంగా ఈ–పాస్ గుర్తించని పరిస్థితి నెలకొంది. దీంతో అలాంటి లబ్ధిదారులు ఒకటికి రెండు మూడు పర్యాయాలు రేషన్ షాపు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

గ్రేటర్‌లో 17.21 లక్షలపైగానే..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం రేషన్ కార్డులు 17,21,994 ఉన్నాయి. శివారు జిల్లాలో రేషన్ కార్డులు కలిగిన సుమారు 4 నుంచి 5 లక్షల కుటుంబాలు సైతం తాత్కాలికంగా నగరంలోనే నివాసం ఉంటూ రేషన్ నెలసరి కోటా ఇక్కడే డ్రా చేస్తుంటారు. తాజా గా ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో మరో మూడు నుంచి నాలుగు లక్షల కార్డులు పెరగవచ్చని పౌరసరఫరాల అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆ చిరునవ్వులు.. ఇక కనిపించవు



తండ్రి మిథున్‌తో జావనల్ (ఫైల్)

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

- ప్రాణం తీసిన డ్రైవర్ నిర్లక్ష్యం
- విద్యార్థి సంఘం నేతల ఆందోళన
- బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్



స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు



లాలాపేట: పాఠశాలకు వెళ్తున్న అన్నను బస్సు ఎక్కించడానికి తండ్రితో కలిసి వచ్చిన ఓ చిన్నారి దుర్మరణం చెందిన ఘటన గురువారం ఓయూ పోలీసు స్టేషన్ పరిధిలో విషాదాన్ని నింపింది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళకు చెందిన మిథున్, ఆయన భార్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరు తమ ఇద్దరు పిల్లలతో కలిసి హబ్సిగూడ స్ట్రీట్ నంబర్– 8లోని రవీంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. కుమారుడు హబ్సిగూడలోని జాన్సన్ గ్రామర్ స్కూల్లో 1వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం 8.30 గంటలకు బాలుడిని తీసుకువెళ్లేందుకు స్కూల్ బస్సు వీరి ఇంటి వద్దకు వచ్చింది. కుమారుడిని బస్సెక్కించేందుకు మిథున్, కుమార్తె (ఏడాదిన్నర) జావనల్ అమ్మమ్మతో కలిసి వచ్చారు. విద్యార్థిని బస్సు ఎక్కించిన తర్వాత.. తమ కుమారుడు రేపటి నుంచి వారం రోజుల పాటు స్కూల్‌కు రావడం లేదనే విషయాన్ని బస్సు డ్రైవర్‌కు మిథున్ చెబుతున్నాడు. ఈ క్రమంలో అమ్మమ్మ ఎత్తుకున్న చిన్నారి జావనల్ కిందకు జారి తండ్రి వద్దకు వెళ్తుండగా.. కదులుతున్న బస్సు చక్రాల కింద పడిపోయింది. డ్రైవర్ చూసుకోకుండా బస్సును కదిలించడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. కళ్లముందే క్షణాల వ్యవధిలోనే కన్న కూతురు విగతజీవి కావడంతో తండ్రి మిథున్ కన్నీరుమున్నీరయ్యాడు. దీంతో రవీంద్రనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. స్కూల్ యాజమాన్యం బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రకటించింది. చిన్నారి మృతికి సంతాపంగా శుక్రవారం జాన్సన్ గ్రామర్ స్కూల్‌కు సెలవు ప్రకటించింది.

విద్యార్థి సంఘం ఆందోళన

స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు దగ్గర చిన్నారిని ఆయా గుర్తించకపోవడంతో ప్రమాదం జరిగిందని విద్యార్థి సంఘం నేతలు ఆరోపించారు. ఘటనకు స్కూల్ యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని, వెంటనే ప్రభుత్వం జాన్సన్ గ్రామర్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరారు. స్కూల్ ఎదుట విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆందోళనలను పోలీసులు అదుపు చేశారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్ ఇంతియాజ్, స్కూల్ ఆయాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. స్కూల్ నిర్వహణపై డీఈఓకు లేఖ రాస్తామని పోలీసు అధికారులు పేర్కొన్నారు.



మూడోసారి..!

మూసీ అభివృద్ధి కోసం అధ్యయనం

- సబర్మతికి వెళ్లిన అధికారుల బృందం
- గతంలోనూ ఇలాగే రెండుసార్లు..
- నివేదికలు ఇవ్వకుండానే మరోసారి..
- నిధులు కేటాయించినా ఫలితం శూన్యం

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి కోసం అధికారుల బృందం సబర్మతి నది అధ్యయనం కోసం మరోసారి బయలుదేరివెళ్లింది. గతంలో ఇదే నదిపై మూసీరివర్ ఫ్రంట్ డెవపల్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అధ్యయనం చేసి వచ్చారు. సబర్మతితో పాటు కోల్‌కతాలోని హుగ్లీ నదిని సైతం అధ్యయం చేసి వచ్చారు. కానీ.. ఈ రెండు నదులపై జరిపిన అధ్యయనంపై ఎలాంటి నివేదికలను రూపొందించలేదు.

గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదేళ్లుగా ఎలాంటి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసిన దాఖలాల్లేవు. మూసీ అభివృద్ధి కోసం నిధులు కూడా విడుదల చేయలేదు. ఈ క్రమంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మూసీ అభివృద్ధి ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. రాబోయే 36 నెలల్లో మూసీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అవసరమైతే ఇతర నదులను అధ్యయనం చేయాలని సూచించిన వెంటనే మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆమ్రపాలి నేతృత్వంలోని అధికారుల బృందం సబర్మతి పర్యటనకు వెళ్లడం గమనార్హం. ఈ నదిపై గతంలోనే సమగ్రమైన అధ్యయనం చేసిన అధికారులు మరోసారి కొత్తగా తెలుసుకొనే అంశాలు ఏముంటాయనేది చర్చనీయాంశంగా మారింది. సబర్మతితో పాటు హుగ్లీ నదిని సైతం సందర్శించి వచ్చారు. ప్రభుత్వం మారినప్పటికీ అప్పటి అధికారుల అధ్యయనాలేమయ్యాయనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా మూసీ ప్రక్షాళన, అభివృద్ధి కార్యక్రమాలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయని, కార్యాచరణ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందనే విమర్శలున్నాయి.

తొమ్మిదేళ్లలో రూ.9 కోట్లు..

- మూసీ ప్రక్షాళన, అభివృద్ధి, సుందరీకరణ వంటి మాటలు శుష్క వాగ్దానాలుగానే మిగిలిపోతున్నాయి. తొమ్మిదేళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) ఏర్పాటు చేసినా మూసీ నదిలోంచి తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదు. ఈ కార్పొరేషన్ అలంకారప్రాయంగానే మారింది. దీనికి రెండు దఫాలుగా చైర్మన్‌ను కూడా నియమించారు. ఈ తొమ్మిదేళ్లలో మూసీ అభివృద్ధి కోసం రూ.వందల కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించినప్పటికీ విడుదల చేసింది మాత్రం కేవలం రూ.9.12 కోట్లేనని అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది వారి జీతభత్యాలకే సరిపోయింది. తాజాగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మూసీ నది అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించింది. రెండు రోజుల క్రితం మూసీపై సమీక్షించిన సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. 55 కిలోమీటర్ల నదీ పరీవాహక ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలకు అనువైన ఐకానిక్ డిజైన్‌ను ఎంపిక చేయాలని చెప్పారు.
- ఎమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్స్ బిజినెస్ ఏరియా, షాపింగ్ మాల్స్ వంటివి అందుబాటులో ఉండాలన్నారు. ఇందుకోసం విదేశాలతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్ట డిజైన్లను పరిశీలించాలని ఆయన సూచించారు. మూడు నెలల్లోగా పనులు ప్రారంభించాలని చెప్పారు. ఆకస్మికంగా వరదలు వచ్చినప్పటికీ తట్టుకునే విధంగా వర్షపు నీటిని మూసీలోకి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నెలకొన్న చారిత్రక కట్టడాలైన చార్మినార్, తారామతి బారాదరి ఇతర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక టూరిజం సర్క్యూట్ డిజైన్ రూపొందించాలన్నారు. ఈ క్రమంలో సీఎం నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే అధికారుల బృందం గతంలో సందర్శించిన సబర్మతికే మరోసారి వెళ్లడం గమనార్హం.



పీపీపీ ఆచరణ సాధ్యమేనా?

ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు ఖర్చు చేయకుండా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో మూసీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కానీ.. ఇప్పటికే పెద్ద ఎత్తున నెలకొని ఉన్న ఆక్రమణలను తొలగించాల్సి ఉంటుంది. మూసీలోకి మురుగు నీరు చేరకుండా ఇప్పటి వరకు ఉన్న నీటిని శుద్ధి చేసేలా ఎస్టీపీలను నిర్మించాలి, పూర్తిస్థాయిలో మురుగునీరు శుద్ధి అయితే తప్ప వ్యాపార, వినోద కార్యకలాపాలను నిర్వహించడం సాధ్యం కాదు. మరోవైపు మూసీపై 40 కిలోమీటర్ల మార్గంలో మెట్రో రైల్ నిర్మించనున్నట్లు కూడా ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ పనులన్నింటి కోసం కనీసం రూ.5000 కోట్ల వరకు నిధులు అవసరం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. 'పీపీపీ పద్ధతిలో మూసీ పరీవాహక ప్రాంతంలో ఎమ్యూజ్‌మెంట్ పార్క్, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్స్, బిజినెస్ ఏరియా, షాపింగ్ మాల్స్ వంటివి ఏర్పాటు చేసేందుకు వ్యాపార వర్గాలు ముందుకు రావచ్చు. దీనికంటే ముందు ఆక్రమణలను తొలగించి, పూర్తిగా ప్రక్షాళన చేయడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన అంశం' అని ఓ అధికారి అభిప్రాయపడ్డారు.



'ముసుగు' తొలగేనా!

ఆవిష్కరణకు నోచుకోని విగ్రహాలు

- దశాబ్ద కాలమైనా మోక్షం లేదు..
- కొత్త ప్రభుత్వమైనా స్పందించేనా?



సాక్షి, సిటీబ్యూరో: పక్క ఫొటోలో కనిపిస్తున్న విగ్రహాలు.. ఎడమ నుంచి కుడికి వరుసగా మహాత్మాగాంధీ, వైఎస్ రాజశేఖరరెడ్డి, బీఆర్ అంబేడ్కర్‌లవి. వీరి సేవలకు గుర్తింపుగా విగ్రహాలు తయారు చేయించారు. కానీ.. దశాబ్ద కాలమవుతున్నా ఇవి ఆవిష్కరణకు మాత్రం నోచుకోవడంలేదు. రాష్ట్ర సచివాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నెలకొన్న పరిస్థితి ఇది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఈ పరిస్థితి మారనుందా? అని ప్రజలనుకుంటున్నారు.

ఎత్తులు.. పైఎత్తులతో..

గ్రేటర్ అభివృద్ధికి పాటుపడిన వైఎస్ రాజశేఖర రెడ్డి మరణానంతరం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన విగ్రహం ఆవిష్కరించాలని తీర్మానించారు. 2010లో వైఎస్ జయంతి సందర్భంగా విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. సెప్టెంబర్ 2న ఆయన వర్ధంతికి ఆవిష్కరించాలని భావించారు. ఆ సమయానికి పనులు పూర్తికాలేదు. ఆ తర్వాత విగ్రహం పూర్తయ్యాక ఆవిష్కరణ ఏర్పాట్లు జరుగుతుండగా ప్రతిపక్ష టీడీపీ కార్పొరేటర్లు వైఎస్ విగ్రహాన్ని అడ్డుకోవాలనే తలంపుతో అంతకంటే తక్కువ ఎత్తులో ఉన్న మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తెచ్చి ఉంచారు. వైఎస్ విగ్రహం కింద వారివి ఉండటంతో వారిని తక్కువ చేయడం అవుతుందని భావించి ఆవిష్కరణలు ఆపివేశారు. అప్పటి నుంచీ ముసుగులోనే ఉన్నాయి.

ఫలించని ప్రయత్నాలు..

అనంతరం అప్పటి కాంగ్రెస్ పార్టీకి చెందిన మేయర్ కార్తీకరెడ్డి ఆవిష్కరణలకు ప్రయత్నం చేశారు. ఒకే చోట ఉంటే ఎక్కువ, తక్కువ తేడాలొస్తాయి కనుక జీహెచ్‌ఎంసీ ఆవరణలోనే వేర్వేరు ప్రాంతాల్లో వాటిని ఆవిష్కరించాలని భావించారు. ఆ మేరకు స్టాండింగ్ కమిటీలో ఆమోదం కూడా పొందారు కానీ ఆచరణకు మాత్రం నోచుకోలేదు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం, బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తెలిసిందే. జీహెచ్‌ఎంసీలోని అధికార బీఆర్ఎస్ కార్పొరేటర్లు కానీ, ప్రతిపక్షాల్లోని వారు కానీ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. దీంతో ఇప్పటిదాకా అలాగే ఉన్నాయి.

అంతా రాజకీయమే..

జీహెచ్‌ఎంసీలో 2009–14 మధ్య కాలంలో కాంగ్రెస్, ఎంఐఎం పొత్తులో భాగంగా అధికారాన్ని పంచుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ కార్పొరేటర్ల రాజకీయంతో ఈ విగ్రహాలు అలా ముసుగుల్లోనే ఉన్నాయి. ఎలాగైనా వైఎస్ విగ్రహం అక్కడ ఏర్పాటు కాకుండా చూసేందుకే టీడీపీ కార్పొరేటర్లు మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తెప్పించారు. అంతటితో ఆగకుండా బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, ఎన్టీఆర్, సలావుద్దీన్ ఒవైసీలవి కూడా ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. ఒవైసీ పేరుతో ఎంఐఎం మద్దతిస్తుందని భావించారు. కానీ 'రాజకీయం' అర్థం చేసుకున్న ఎంఐఎం నేతలు ఆ ఆలోచనను తిరస్కరించారు.

BEFORE THE HONE'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
IA No. 3061/2023
in
Original Application No. 271/20
HDFC Bank Limited ...Applicant
AND
M/s Sumathi Trading Corp & Others ...Defendants
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
3. Mr. Manoj Kumar, S/o. Keval Chand Mahaveer, Age: 48 Years, Occ: Business, 3-4-256, 1st Floor, Prashant Market, Gunj Bazar, Secunderabad - 500003, Telangana. Also at: Mr. Manoj Kumar, S/o. Kewal Chand Mahaveer, Age: 49 Years, Occ: Business, 3-42-17, 2nd Floor, Smart Colony, West Marredpally, Secunderabad - 500003, Telangana.
4. Mr. Sanjay Kumar, S/o. Kewal Chand Mahaveer, Age: 46 Years, Occ: Business, 3-4-256, 1st Floor, Prashant Market, Gunj Bazar, Secunderabad - 500003, Telangana. Also at: Mr. Sanjay Kumar, S/o. Kewal Chand Mahaveer, Age: 49 Years, Occ: Business, 3-42-17, 2nd Floor, Smart Colony, West Marredpally, Secunderabad - 500003, Telangana.
Please take the summons in the above IA No. 3061/2023 in OA No. 271/2020 filed by the Applicant for Recovery of money of Rs.2,15,95,688 Ps against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Sakshi" Telugu Daily news paper and posted the matter to 20-02-2024.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 20.02.2024 at 10.30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001 in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this Day of 28th December 2023.
(By order of the Court)
Asst Registrar
Debts Recovery Tribunal - II
Hyderabad.

బ్యాంకుల బలోపేతానికి మోదీ సర్కారు చర్యలు

- ఇళ్ల నిర్మాణంలో గత ప్రభుత్వం విఫలం
- మహిళలకు విరివిగా రుణాలు
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి


చెక్కులు అందజేస్తున్న కేంద్ర మంత్రి

శంషాబాద్ రూరల్: ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, మహిళలకు విరివిగా రుణాలు అందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర పార్లమెంట్ వ్యవహారాలు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. శంషాబాద్ మండలం, పెద్దతూప్రలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బ్యాంకులపై రాజకీయ నాయకుల ఒత్తిడి ఉండేదని.. దీంతో బడాబాబులు పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుని చెల్లించకుండా పారిపోయేవారన్నారు. బీజేపీ ప్రభుత్వం బ్యాంకులకు పూర్తి స్వేచ్ఛ నివ్వడంతో పాటు పేదలు, మహిళలకు సులువుగా రుణాల అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. దీంతో బ్యాంకులకు ఆదాయం పెరిగిందన్నారు. రియలన్స్ ఇండ్రస్టీస్ కంటే ఎస్‌బీఐ ఎక్కువ లాభాలు ఆర్జించినట్లు తెలిపారు. ప్రధాని మోదీ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. దేశానికి అతి పెద్ద వనరు యువతేనని పేర్కొన్నారు. రామమందిర ప్రారంభోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ వాసుల దురదృష్టం

కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే తెలంగాణలో గత సర్కారు వైఫల్యంతో పేదల ఇంటి కల నెరవేరలేదన్నారు. కేంద్ర నుంచి రావాల్సిన నిధులు మంజూరు చేస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. తొమ్మిదేళ్లలో మోదీ పాలనలో దేశ వ్యాప్తంగా నాలుగు కోట్ల ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశంలో మూడు కోట్ల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయగా.. బీజేపీ ప్రభుత్వం 15 కోట్ల కనెక్షన్లు ఇచ్చిందన్నారు. పథకాల అమలులో పారదర్శకత పాటించడంతో పాటు నేరుగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకు నుంచి రుణాలు, పథకాలు పొందడంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను మంత్రి సభలో వివరించారు. 35 ఏళ్ల క్రితం రూ.10వేల రుణం కోసం బ్యాంకుకు వెళ్తే.. మేనేజర్ తన చాంబర్‌లోకి రానివ్వకుండా బయటకు పంపించారన్నారు. నేడు పేదలు, మహిళలు, చిరు వ్యాపారులకు విరివిగా రుణాలు మంజూరవుతున్నాయన్నారు. అనంతరం పంటలపై మందుల పిచికారి కోసం వాడేందుకు ఏర్పాటు చేసిన డ్రోన్ పనితీరును పరిశీలించారు. డ్వాక్రా సంఘాలకు బ్యాంకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జనరల్ మేనేజర్ రితేష్‌కుమార్, సర్పంచు చిటికెల వెంకటయ్య, ఎంపీపీ జయమ్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో సినీ తారల సందడి

రూ.50లక్షల లక్కీ డ్రా



లక్డీకాపూల్ : బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో పలువురు సినీ నటీనటులు సందడి చేశారు. కేపీహెచ్‌బీలోని నెక్స్ హైదరాబాద్ మాల్‌లోని బజాజ్ షోరూమ్‌లో గురువారం రూ. 50 లక్షల నగదు బహుమతితో పాటు 30 ఆల్టో కే.10 కార్ల విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా సినీ నటులు తేజస్విని మదివాడ, మానస వారణాసి, ప్రగణ్య అయ్యగారి, నటుడు హర్షవర్ధన్ రాణే డ్రా తీసి విజేతల వివరాలను ప్రకటించారు. గ్రాండ్ ఫినాలే బంపర్ బిగ్గెస్ట్ డ్రా ఆఫ్ ఇండియాగా కూపన్ నంబర్ 2023101072595కు రూ.50 లక్షల బహుమతి వరించింది. అనంతరం ఆల్టో కే.10 కార్ల విజేతల వివరాలను ప్రకటించారు. కార్యక్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ సీఎఫ్‌లో ప్రేమ్‌చంద్ దేవర్‌కొండ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలు తప్పితే..టీచర్లదే బాధ్యత

- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి
- ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలి
- సమష్టిగా కృషి చేయాలి
- పదవ తరగతి పరీక్షలపై సమీక్ష
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఫెయిలైతే సంబంధిత ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 10వ తరగతి పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం కంటే అత్యు త్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. విద్యార్థి 10వ తరగతి లో పాస్ అయితేనే జీవితంలో మెరుగైన స్థితిలో ముందుకు సాగుతాడన్నారు. గతంలో కంటే పాఠశాలల్లో వనరులు మెరుగుపడ్డాయని, విద్యార్థులు ఎంత వెనకబడి ఉన్నా మెరుగైన శిక్షణ ఇస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలగుతారన్నారు. వందకు వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించినా విద్యార్థులు ఫెయిలైతే అది మనలోపమేనన్నారు. గత విద్యా సంవత్సరం ఫలితాల్లో జిల్లా పూర్తిగా వెనుకబడిందని. ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రయత్నించాలన్నారు. గురువులకు తన శిష్యుడు ఉన్నత స్థానానికి వెళితే ఎంత గౌరవమని, అదే ఫెయిలైతే అవమానంగా భావించాలన్నారు. ఉత్తీర్ణత పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. డిప్యూటీ ఈవోలు, డీఐలు వంద శాతం శ్రద్ధతో పని చేస్తే ఫలితాలు వస్తాయని,వచ్చే 70 రోజుల్లో శ్రద్ధగా కృషి చేస్తే ఫలితం సాధించవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రధాన సబ్జెక్టుల్లోనే వెనుకబాటు

విద్యార్థులు అత్యధిక శాతం మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లోనే వెనుకబడి ఉన్నారని, ఆలాంటి వారిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఫలితం ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఉత్తమ ఫలితాల కోసం ఎక్కువగా స్లిప్ టెస్టులు, మాక్ టెస్టులు నిర్వహించి వాటిపై రివిజన్ చేస్తే విద్యార్థులకు ఫైనల్ పరీక్షల భయం పోతుందన్నారు. రివిజన్ చేస్తే విద్యార్థి మరిచిపోడని ప్రాక్టీస్ ఎక్కువగా చేయించేలా ప్రోత్సహించాలన్నారు. డిప్యూటీఈవో లు, డీఐఓ లు పర్యవేక్షణలతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల వెనుకబాటుపై చర్చించి వారికి సూచనలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సమావేశంలో డీఈఓ రోహిణి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మృగాళ్లు!

- కన్నతండ్రే కామాంధుడయ్యాడు
- నమ్మిన యువకులు కాటేశారు
- అత్యాచారానికి గురైన యువతి
- పోలీసుల చెంతకు బాధితురాలు
- తండ్రి సహా ఒకరిపై కేసు నమోదు
- మరో నిందితుడిని విడిచిపెట్టడంపై అనుమానాలు

జీడిమెట్ల: కంటిరెప్పే కాటేసింది. కన్నపేగు అనే విచక్షణ మరిచి రాక్షసత్వం మాటేసింది. కన్న తండ్రే కామాంధుడయ్యాడు. కూతురిపై పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడగా.. తాను రక్షణ వలయంలోకి వెళతానని భ్రమించి.. అలా నమ్మించిన ఇద్దరు యువకులు సైతం ఆ అమాయకురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. అత్యంత అమానుషమైన ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్ చెప్పిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన చంద్రమ సింగ్, ధర్మశీలాదేవి దంపతులు నగరానికి వలస వచ్చారు. ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడితో కలిసి కుత్బుల్లాపూర్ విలేజ్‌లో ఉంటున్నారు. వీరి పెద్ద కుమార్తె (19) 9వ తరగతి వరకు చదివింది. కరోనా సమయంలో చదువు మానేసి ఇంట్లోనే ఉంటోంది. తల్లిదండ్రులు పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో చంద్రమసింగ్ ఒకరోజు మధ్యాహ్నం పూట మద్యం తాగి ఇంటికి వచ్చాడు. పెద్ద కుమార్తె ఇంట్లో ఒక్కర్తే ఉండటంతో ఆమెపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఇలాగే బెదిరిస్తూ కూతురిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. తండ్రి అఘాయిత్యాన్ని సహించలేని కూతురు ఈ విషయాన్ని తల్లి ధర్మశీలాదేవికి దృష్టికి తెచ్చినా ఆమె ఎవరికీ చెప్పవద్దంటూ సర్దిచెప్పింది.

రైల్వే స్టేషన్‌లో పరిచయమైన యువకుడు..

ఈ నేపథ్యంలో చంద్రమసింగ్ కుటుంబం గత నవంబర్‌లో దీపావళి పండగకు బిహార్ వెళ్లింది. ఆ సమయంలో సదరు యువతికి బడంగ్‌పేట్ గాంధీనగర్‌కు చెందిన సంతోష్ అనే యువకుడు పరిచయం కావడంతో అతనితో ఇన్‌స్టాలో చాట్ చేసేది. గత నెల 26న బాధిత యువతి సంతోష్‌ను కలిసేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లింది. ఇద్దరు అక్కడ కలుసుకుని నగరంలోని పలుచోట్ల తిరిగారు. సంతోష్ సదరు యువతిని తిరిగి రాత్రి 7గంటలకు కుత్బుల్లాపూర్‌లో వదిలేశాడు. ఇంట్లోకి వెళ్తే తల్లిదండ్రులు తిడతారేమోననే భయంతో మళ్లీ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది.

- అక్కడ రవి అనే మరో యువకుడి ఫోన్ ద్వారా సంతోష్‌కు కాల్ చేయగా సంతోష్ బడంగ్‌పేట్‌లోని తన ఇంటికి రావాలని సూచించాడు. సంతోష్ ఇంటి వద్ద దింపాలని రవిని బతిమిలాడగా అతడు బడంగ్‌పేట్‌లో దింపాడు. ఆ రోజు యువతి సంతోష్ ఇంట్లోనే ఉంది. మరునాడు 27న సంతోష్ తన ఇంటి నుంచి వెళ్లిపోవాలని యువతిని తిరస్కరించాడు. దీంతో ఎటు పోవాలో తెలియక తిరిగి సికింద్రాబాద్ చేరుకుంది. వేరే వ్యక్తి ఫోన్ ద్వారా రవికి కాల్ చేసి సికింద్రాబాద్ రావాలని అడిగింది. తనకు ఏదైనా జాబ్ కావాలని అతడిని బతిమిలాడింది. దీంతో రవి సదరు యువతిని పటాన్‌చెరు అమీన్‌పూర్ తాను ఉంటున్న గదికి తీసుకెళ్లాడు. 29న సాయంత్రం యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ రోజు అక్కడే ఉన్న యువతి మరునాడు 30న తన చెల్లెలికి ఫోన్ చేసి సికింద్రాబాద్‌కు రావాలని చెప్పింది. తల్లిదండ్రులతో కలిసి బాధితురాలి చెల్లి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చి ఇంటికి వెళ్లాక గట్టిగా నిలదీయగా జరిగిన విషయమంతా వివరంగా చెప్పడంతో జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. చంద్రమసింగ్, రవిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరో నిందితుడు సంతోష్‌ను కేసు నుంచి మినహాయించడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కిలాడీ లేడీ అరెస్ట్

రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలను చూపిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ


జ్యువెలరీ దుకాణంలో చోరీ చేస్తున్న గౌతమి (సీసీ కెమెరా ఫుటేజీ)

నాగోలు: జువెలరీ దుకాణాల్లో నగలు కొంటున్నట్లు నటించి సేల్స్‌మెన్ కళ్లు గప్పి నకిలీ బంగారు నగలు అక్కడ పెట్టి అసలు బంగారు నగలు కొట్టేస్తున్న మహిళను సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అమె నుంచి రూ. 12 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లకు చెందిన గోనెల గౌతమి, నరేందర్ దంపతులు నగరానికి వలస వచ్చి మీర్‌పేట జనార్దన్‌కాలనీ, భూపేష్‌గుప్త నగర్‌లో నివాసం ఉంటున్నారు. నరేందర్ సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేసేవాడు. తన భర్త సంపాదన కుటుంబ అవసరాలకు సరిపోక పోవడంతో గౌతమి చోరీలకు తెర లేపింది. ఈ నేపథ్యంలో గత డిసెంబర్ 31న కమలానగర్ లోని లలిత జ్యువెలర్స్‌కు వెళ్లి బంగారం కొంటున్నట్లు నటించి సేల్స్‌మెన్ కళ్లు గప్పి అసలు బంగారు గొలుసు స్థానంలో నకిలీ గొలుసు ఉంచి అక్కడి నుంచి పరారైంది. యాజమాన్యంతో ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన సరూర్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 190గ్రాముల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు. నిందితురాలు గౌతమిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎల్‌బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, సరూర్‌నగర్ సీఐ శ్రీనివాస్, డీఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నన్ను చూసి ఉమ్ముతావా అంటూ..

చిన్నాన్నపై యువకుడి దాడి

శంషాబాద్ రూరల్: నన్ను చూసి ఉమ్ముతావా అంటూ.. ఓ యువకుడు తన చిన్నాన్నపై కత్తితో దాడి చేసిన ఘటన హమీదుల్లానగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డం శ్రీకాంత్ ఈ నెల 3న సాయంత్రం ఇంటి పక్కన ఉన్న తన చిన్నాన్న రవి.. తనను చూసి ఉమ్మివేశాడనే నెపంతో అతడిపై కత్తితో దాడికి పాల్పడటంతో రవి దవడకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూపీఐ ద్వారా రూ.99,999 గల్లంతు

సనత్‌నగర్: ఎస్‌బీఐ ఖాతా నుంచి యూపీఐ ద్వారా రూ.99,999 నగదు గల్లంతైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ ఎం.మల్లేశం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీకి చెందిన ప్రైవేటు ఉద్యోగి షేక్ అప్సర్ ఫోన్‌కు ఈ నెల 2న మధ్యాహ్నం యూపీఐ ఐడీ(400209234147) ద్వారా రూ.99,999ల నగదు విత్ డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో అవాక్కయిన అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంతకుముందు తనకు ఎలాంటి సందేశం రాలేదని, అగంతకుల నుంచి కూడా ఫోన్ రాలేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇక రాచకొండ వంతు

- నలుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ
- మల్టీజోన్–2కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు

సాక్షి, సిటీబ్యూరో: బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే పోలీస్ స్టేషన్ల ప్రక్షాళన చేపట్టిన హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్ల సరసన రాచకొండ బాస్ కూడా చేరిపోయారు. ఇప్పటికే సిటీ, సైబరాబాద్‌లలో పదుల సంఖ్యలో ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయిన సంగతి తెలిసిందే. తాజాగా రాచకొండలో నలుగురు ఎస్‌హెచ్‌ఓలకు స్థాన చలనం కలిగింది. రాచకొండ సీపీగా సుధీర్ బాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారిగా ఒకేసారి నలుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ కావడం ఇదే తొలిసారి. ఉప్పల్, నేరెడ్‌మెట్, వనస్థలిపురం, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్లు (సివిల్) బీ శ్రవణ్ కుమార్, ఏ శివ కుమార్, డీ జలేందర్ రెడ్డి, బీ ప్రవీణ్ కుమార్‌లను వాళ్ల పేరెంట్ యూనిట్ అయిన మల్టీజోన్–2కు సరెండర్ చేయాలని మల్టీజోన్–2 ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆయా అధికారులను రిలీవ్ చేయాలని ఆదేశిస్తూ ఈ మేరకు గురువారం రాచకొండ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

పద్ధతి మార్చుకోవాలి


రౌడీషీటర్లకు సూచనలు చేస్తున్న కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్: రౌడీషీటర్లతో పాటు హత్యలు, క్రిమినల్ కేసుల్లో ప్రమేయం ఉన్న వారు ఇకనైనా తమ పద్ధతి మార్చుకోవాలని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు క్రిమినల్ కేసుల్లో ప్రమేయం ఉన్న వారితో పాటు పలువురికి హెచ్చరికలు జారీ చేశారు. అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ (ఎగ్జిక్యూటివ్) హైదరాబాద్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ ఏడాది పాటు శాంతిగా, మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. ఈ మేరకు వారికి ష్యూరిటీలతో కూడిన సెక్యూరిటీ బాండ్లను అందజేశారు.

ప్రభుత్వానికి మంచి పేరుతేవాలి



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ ఉద్యోగులు కష్టపడి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు గురువారం విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పి.అంజయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆయనను కలిసింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ...వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. నిత్యం వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాసర్ షరీఫ్, పరమేష్, స్వామి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్


నిందితులు ఆనంద్‌కుమార్ రాయ్, సంజీత్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని సాయి రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్‌లో భవన నిర్మాణ కార్మికుడిని కర్రలతో కొట్టి హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన పంకజ్ రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్‌లో డైలీ లేబర్‌గా పనిచేస్తూ అందులోనే ఓ షెడ్డులో ఉంటున్నాడు. ఈ నెల 1న నూతన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తుండగా అక్కడే పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్ ఆనంద్‌కుమార్ రాయ్, సంజీత్‌లు పంకజ్‌ను మెయిన్ గేటు వద్దకు లాక్కెళ్లి కర్రలతో తీవ్రంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన అతను పంకజ్ మృతి చెందాడు. మృతుడి స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆనంద్‌కుమార్ రాయ్, సంజీత్‌లపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.30వేలు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓ ఇంటర్ విద్యార్థిని (16) తల్లిదండ్రులతో కలిసి సరూర్‌నగర్ ఠాణా పరిధిలోని గడ్డిఅన్నారం ప్రాంతంలో నివాసం ఉంటోంది. రెండేళ్లుగా అదే ఇంట్లో వినయ్ అనే వ్యక్తి పేయింగ్ గెస్ట్‌గా ఆశ్రయం పొందుతున్నాడు. ఈ క్రమంలో సదరు బాలికను ప్రేమిస్తున్నట్లు నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ విషయం తల్లికి చెప్పడంతో ఆమె సరూర్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం గురువారం నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 30వేలు జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ. 5లక్షల పరిహారం ప్రకటిస్తూ తీర్పు చెప్పింది.

పాదచారులే టార్గెట్..

- బోరబండలో దొంగల ముఠా అరెస్టు
- గంజాయి మత్తులో దోపిడీలు

రహమత్‌నగర్: పాదచారులే లక్ష్యంగా దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సెల్ ఫోన్, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటేశ్వరావు గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 28న మహ్మద్ షరీఫ్ అనే వ్యక్తి తన అతని కుమారుడు, కుమార్తెతో కలిసి బోరబండ బస్‌స్టాప్ నుంచి తన ఇంటికి నడిచి వెళుతుండగా సాయిబాబా ఆలయం సమీపంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అతడి కుమారుని చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. షరీఫ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బోరబండ బస్టాప్‌లోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా సురారం కాలనీకి చెందిన ఎస్.కె.రిజ్వాన్, అల్లాపూర్‌కు చెందిన మహ్మద్ జమీరుద్దీన్, బోరబండ స్వరాజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ముజ్జు, నిజామాబాద్‌కు చెందిన సయ్యద్ మోసిన్, కుత్బుల్లాపూర్‌కు చెందిన ఎ.ఎస్.సమీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు హత్య, దొంగతనాల కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు ఏసీపీ తెలిపారు. గంజాయి, మద్యానికి బానిసలైన వీరు మత్తులోనే దారి దోపిడీలకు పాల్పడుతుంటారని ఆయన పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నాగోలు: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగోలు డివిజన్, ఫతుల్లాగూడకు చెందిన బాలరాజు కుమారుడు పెద్దింటి భాను చందర్(22) ఐటీఐ పూర్తి చేశాడు. గత కొంత కాలంగా అతను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. బుధవారం స్నేహితులతో సరదాగా గడిపిన భానుచందర్ సాయంత్రం ఇంటికి వెళ్లాడు. సాయంత్రం హయత్‌నగర్‌లో నర్సింగ్ చదువుతున్న సోదరి ఇంటికి వచ్చే చూసే సరికి అతను ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సాయంతో కిందకు దింపి నాగోల్‌లోని ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. భానుచందర్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FARM PLOT FOR SALE
ఆసక్తిపరులు అందే భూమి ఉన్నవారు ఫార్మ్ ల్యాండ్ DTCP, HMDA, 1లక్ష నుండి 6లక్షల వరకు 121 చ॥గ॥ నుండి 150 గజాల వరకు ఓపెన్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. GNR ఇన్‌ఫ్రా 9059405607 [H-788263]

FLAT FOR SALE
Affordable 3BHK Flats Near Infosys, Pocharam, Possession Within 6 Months Gated Community, Modern Amenities Visit Model Flats. Call: 9346769728. [H-788050]
KOHINOOR - Hi-Tech City 3BHK / West Flat for Sale 1456sft 2 Car Parkings's 28th Floor Crystal Tower, Price- 2.10cr including all-Ready to occupy - WhatsApp / Call (UK) 447881627897 [H-13260]

LAND FOR SALE
కమర్షియల్ 100 ఫీట్ల మెయిన్ రోడ్ ఫేసింగ్ ఆనుకొని 440 గజాల ప్లాటు అమ్మబడును @ మహేశ్వరం. HMDA & R-1 జోన్ Rs. 11 వేలు గజం. ఫోన్: 9966521191. [H-801562]

PLOT FOR SALE
బెంగుళూరు హైవే కొత్తూరు (నందిగామ) దగ్గర హైవేకి అతి సమీపంలో HMDA అప్రూవల్ గల రన్నింగ్ వెంచర్‌లో ప్లాట్స్ కలవు. సంప్ర॥ 7799893899 [G-3112]
రూ.495 కే గజం నిమ్స్ & ఇండస్ట్రీయల్ కారిడార్‌కు చేరువలో నేషనల్ హైవేకు 2 కి.మీ స్పాట్ రిజిస్ట్రేషన్ మరియు కోట్లలో ఆదాయం సంప్ర: 9059862969. [HA-10996]
కేవలం 2,699/– కే చ.గజం యాదాద్రి టెంపుల్ Nr. నెమల, 3,499/–కే చ. గజం విజయవాడ హైవే Nr. టోల్‌ప్లాజా లిమిటెడ్ ప్లాట్స్ కలవు. ఫోన్: 7842408719. [HA-9974]
జనగాం దగ్గరలో Farm Land చ॥గ॥ 2100/– DTCP చ॥గ॥ 3600/– లాంచింగ్ ఆఫర్‌తో గలవు. భూమి విలువ తెలిసిన వారు త్వరపడి తక్కువ ధరకే Plot కొని ఆనందించగలరు. Ph: 7416591078 [H-801455]

VILLA FOR SALE
Ready to Occupy, Affordable Duplex Villas 210 Villas on 15 Acres At Cherlapally Club House & Swimming Pool Fully Operational Must See Appreciate. 9000149079. [H-787901]

BUSINESS SERVICE
మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-801561]

PERSONAL CARE

CHANGE OF NAME
I, GUNNAM LAKSHMI MOUNIKA W/o. GUNNAM PRAVEEN KUMAR R/o : Vaibhavis Gayatri Vistas, Flat 101, Plot no 669 and 670, Near Vijetha super market, Matrusrinagar, Miyapur, Medchal - Malkajgiri, Telangana - 500049 have changed my name to ANAPARTHY LAKSHMI MOUNIKA vide affidavit date 04/01/2024 at Hyderabad. [H-788266]
I, (Maya Archana Kumari) D/O (Maya Bal Kishan) born on (08/07/1986) residing at (H.no- 2-2-1105/c/1, Indira Nagar, Tilak Nagar, Hyderabad, Telangana, 500044), have changed my name to (JAKKA ARCHANA) vide affidavit dated (26/12/23) at (Tilak nagar). [WB-43299]
I, Ex-Army No. 14364942M, Rank Naik (TS), K. Narsimulu S/o Late K. Sayanna, R/o H. No. 7- 86/2, Shabad Village & Mandal, Ranga Reddy District. TS - 509217, That My son's name was wrongly mentioned in my service Records as Vamshikrishna (Incorrect Name) instead of K. Vamshi Krishna (Correct) My son's correct name K. VAMSHI KRISHNA This is for all records. [H-793648]
I, YAGNAMURTHY VENKATRAMNA KISHORE S/o YAGNAMURTHY VIJAY SANKAR R/o H.No: 6-1-343/2 St No: 1 Padmarao Nagar, Secunderabad, Telangana State has changed my name from YAGNAMURTHY VENKAT KISHORE to YAGNAMURTHY VENKATRAMANA KISHORE for all records [HA-96085]
I, Vanshraj Kovoor S/o. Bhushan Kumar Kovoor R/o. Flat No: 412, Ragavendra Panchajanya Apts. Miyapur, Hyderabad, Telangana state that my name was wrongly entered in my passport as Vansh Raj Bhushan Kumar Kovoor but my correct Name is VANSHRAJ KOVOOR [HA-981]

LOST
I, Chanda Jagadeesh Babu S/o C.Subbarayudu R/o Villa no-28 Mitra homes, Jeedimetla, Hyd-500067. I lost my Original Passport No. T4791617 while travelling Suchitra to Kompally if found Call: 9849718143. [HA-13259]

OLD AGE HOME
వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-788123]

Wanted

ముంబై హైవేలోని మా సంస్థ నందు 1001 ఎకరాల గేటెడ్ కమ్యూనిటి DTCP & రేరా మరియు బ్యాంకు లోన్‌తో రిసార్ట్స్ ఉన్న కంపెనీకి అనుభవం ఉన్న ''మార్కెటింగ్ డైరెక్టర్స్'' కావలెను. కలలో కూడా ఊహించని ఇన్సెంటివ్స్ + గిఫ్ట్స్ + అవార్డ్స్ + ఫారిన్ ట్రిప్స్. 9133699328. [HA-111]
Nest Infra Developers కొరకు మార్కెటింగ్ చేయుటకు ఏజెంట్స్ కావలెను Age: 18–35, జీతం: 15,000 & కమీషన్, హబ్సిగూడ, Hyd. 7672099306. [H-788183]
పూజిత హోంకేర్: పేషెంట్లు, బేబికేర్, ఇంటి / వంట పని చేయుటకు స్త్రీలు, పురుషులు, కేర్ టేకర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ, జీతం: 15-20 వేలు. ఫోన్: 8801821210. [H-793577]
వాచ్‌మెన్ ఫ్యామిలీతో ఉండి సైన్ బోర్డు కంపెనీలో హెల్పర్‌గా పనిచేయుటకు కావలెను. అలీకేఫ్ చౌరస్తా, అంబర్‌పేట్, ఫోన్: 9963999123, 040–29887188. [H-801505]
త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k. సంప్ర: 9160900024 / 9640400073. [H-793669]
రామకృష్ణ గ్రూప్ (AP&TS No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని బేబికేర్‌కై M/F వర్కర్లు కావలెను భో+వ+జీతం 15-21 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9989371122, 9281452763. [H-787762]
ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో Part/Full టైమ్ Sr. Marketing Associates కావలెను. రిటైర్డ్ ఎంప్లాయిస్ & Women for Tele Marketing. కమీషన్ Based only. Off: L.B.Nagar. Ph: 9010666696. [H-801456]
Wanted Graphic Designer for packaging products 2-5 year Exp. skills Coreldraw, Photoshop. Near Uppal. Ph: 6304933646. [H-788058]
Required Supervisors 2 Nos, Housekeeping Boys 3 Nos & Receptionist 2 Nos For Ruputed Hotel, At Sec-bad, Resume Send by WhatsApp PH: 9000077499. [HA-1060]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు: Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

వాహనదారులకు ఇబ్బంది కల్గిస్తే చర్యలు తథ్యం


వాహనదారులకు జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా రోడ్డును బ్లాక్ చేస్తూ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసే వాహనదారులతో పాటు సబంధిత దుకాణదారులపై కూడా చర్యలు తీసుకుంటామని బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అడావత్ హరి హెచ్చరించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని గౌరీశంకర్ వైన్స్ నుంచి బీమా హోటల్ చౌరస్తా వరకు వివిధ వాణిజ్య సముదాయాల ముందు అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనదారులకు జరిమానాలు విధించడంతో పాటు సంబంధిత వ్యాపారులను కూడా ఆయన హెచ్చరించారు. రోడ్డును బ్లాక్ చేస్తూ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల వాహనాలు సాఫీగా ముందుకు వెళ్లలేకపోతున్నాయని వ్యాపారులు తమ వినియోగదారులు సరైన పద్ధతిలో పార్కింగ్ చేసుకునేలా చూసుకోవాలని సూచించారు.

దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న శర్మ

లిబర్టీ: భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎస్.శర్మ గురువారం దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. చలి తీవ్రత బాగా పెరగడంతో ఫుట్‌పాత్‌పై, రైల్వే స్టేషన్లలో ఉంటున్న వారికి దుప్పట్లు పంపిణీ చేసి ఆసరాగా నిలిచారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య

వెంగళరావునగర్: అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడలో నివసించే బొబ్బా రవికుమార్ ఈ నెల 3న తన ఇంట్లో నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య తన కుమార్తె డెలివరీ నిమిత్తం మూడు నెలల కిందట అమెరికా వెళ్లి అక్కడే ఉంటోంది. ఇదిలా ఉండగా రవికుమార్ ఏడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం ఇంట్లో ఆయన ఒక్కడే ఉంటున్నాడు. బుధవారం రవికుమార్ మృతిచెందగా ఆ విషయాన్ని అమెరికాలోని కుమార్తె బబితకు పని మనుషులు తెలియజేశారు. ఆమె కూకట్‌పల్లి ప్రగతినగర్‌లో ఉంటున్న తన కజిన్ సోదరుడు ఆదిత్యకు తెలియజేయగా హుటాహుటిన అతను ఎల్లారెడ్డిగూడ వచ్చాడు. రవికుమార్ ఇంట్లో ఉరేసుకుని ఉండటం, అతని వద్ద సూసైడ్ నోట్ కూడా ఉండటాన్ని చూసి మధురానగర్ పోలీసులుకు సమాచారం అందించాడు. రవికుమార్ మృతిపట్ల తమకు ఎవరిమీద అనుమానం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

నల్లకుంట: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు సి.కృష్ణయాదవ్ కోరారు. గురువారం నల్లకుంట డివిజన్‌లోని ఆయా బస్తీలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సెంటర్లను స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారితో మాట్లాడి దరఖాస్తులు సమర్పించడంలో ఏమైనా సమస్యలు తలెత్తుతున్నాయా, దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.జె.బాబు, సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎం.బి.కిశోర్ కుమార్, హైదరాబాద్ సెంట్రల్ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్‌కుమార్, నాయకుడు భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు కనీస మూల వేతనం చెల్లించాలి


బుర్ర వెంకటేశంను సన్మానిస్తున్న కిషోర్‌కుమార్ తదితరులు

ముషీరాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు కనీస మూల వేతనం చెల్లించాలని, డిగ్రీ స్పాట్ వాల్యూయేషన్‌కు అనుమతించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సి.హెచ్.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం అతిథి అధ్యాపకుల ప్రతినిధి బృందం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ఎనిమిది మంది లెక్చరర్స్‌ను అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించినందుకు ముందుగా ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశంను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1940 మంది అతిథి అధ్యాపకులుగా గత 10–15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరు ఎగ్జామినేషన్, నాక్ విధులు, కళాశాలల్లో అన్ని కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ కమిషనర్ కార్యాలయం అనుమతించిన బయోమెట్రిక్ హాజరు విధానం ద్వారా కళాశాలలో పూర్తి సమయం పని చేస్తున్నారని తెలిపారు. అటువంటి అతిథి అధ్యాపకులకు నిబంధనల ప్రకారం కనీస వేతనం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టి విధంగా చెల్లించాలని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 1940 మంది కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే పది సంవత్సరాలుగా పేపర్ వ్యాల్యుయేషన్ చేసేందుకు అవకాశం ఇచ్చారని రెండు సంవత్సరాల నుంచి పేపర్ వాల్యుయేషన్‌కు అవకాశం ఇవ్వడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పేపర్ వాల్యుయేషన్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు.

మద్యం మత్తులో ప్రహరీ ఢీకొట్టి..


ప్రమాదం చేసిన వ్యక్తులు

సనత్‌నగర్: మద్యం మత్తులో కారు నడిపి ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్ హఫీజ్‌పేటకు చెందిన శివప్రసాద్, భరత్, శ్రీనివాస్, కృష్ణానగర్‌కు చెందిన అభిషేక్ స్నేహితులు. వీరంతా ఈ నెల 3న కారులో యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో జరిగిన పార్టీకి హాజరయ్యారు. శివప్రసాద్, భరత్, అభిషేక్ మద్యం తాగి భోజనం చేసేందుకు మాదాపూర్ వెళ్లారు. అక్కడి నుంచి అభిషేక్‌ను కృష్ణానగర్‌లో దించేందుకు బయలుదేరారు. శివప్రసాద్ కారు అతివేగంగా నడుపుతూ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10లోని ప్లాట్ నెంబర్ 122కు చెందిన ప్రహరీని ఢీకొట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే 'లక్ష్య'ంగా..

- టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం
- లక్ష్య పేరిట అకడమిక్ బబుల్ కార్యక్రమం
- వెనుకబడిన విద్యార్థులను ఏ-గ్రేడ్‌లో చేర్చడమే లక్ష్యం
- ఖైరతాబాద్‌లో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు


బంజారాహిల్స్‌లోని గతి ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

బంజారాహిల్స్: పదో తరగతితో పాటు ఉన్నత తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ అధికారులు ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను అమలుచేస్తున్నారు. మరో రెండు నెలల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సిలబస్ పూర్తి చేయడం, ప్రతి విద్యార్థీ కనీస సామర్థ్యం సాధించడంతో పాటు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు కనీస ఉత్తీర్ణత సాధించేందుకు అకడమిక్ బబుల్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ప్రారంభించారు.

- 8, 9 తరగతులకు ఉన్నతి పేరిట, పదో తరగతి విద్యార్థులకు లక్ష్య పేరిట ప్రత్యేక బోధన అందిస్తున్నారు. గాలిబుడగలు లాగానే తరగతి గది కూడా అందంగా, ఆకర్షణీయంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి అకడమిక్ బబుల్ అనే పేరు పెట్టారు.
- ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహిస్తున్నా మంచి ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మ్యాథ్స్ టీచర్ జనార్దన్ తెలిపారు. దీని కోసం మండల నోడల్ అధికారి సహా పలు పాఠశాలల్లో అనుభవజ్ఞులైన టీచర్లతో బృందాలను అధికారులు ఏర్పాటు చేశారు. గత నెల 12 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం జనవరి 11వ తేదీ వరకు కొనసాగనుంది. సందర్శక బృందాలు తమకు కేటాయించిన పాఠశాలల్లో తరచూ సందర్శిస్తూ పదో తరగతి విద్యార్థుల హాజరు, వారి వర్క్‌బుక్ తదితర అంశాలను పరిశీలిస్తున్నారు.
- విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజీగూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 1250 మంది పదో తరగతి విద్యార్థులకు ఉత్తీర్ణత వంద శాతం సాధించేలా ప్రత్యేక తరగతులతో బోధన సాగిస్తున్నారు.
- విద్యార్థులను మూడు దశలుగా విభజించారు. ఏ-గ్రేడ్‌లో మెరుగైన విద్యార్థులు, బీ-గ్రేడ్‌లో ఓ మోస్తరు విద్యార్థులు, సీ-గ్రేడ్‌లో చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉంచి మూడు బృందాలుగా ఏర్పాటు చేశారు. వెనుకబడిన విద్యార్థులను బీ-గ్రేడ్‌లోకి, అక్కడి నుంచి ఏ-గ్రేడ్‌లోకి మార్చడమే లక్ష్యంగా ఈ బోధన కొనసాగుతోంది. విద్యార్థుల సామర్థ్యాన్ని బేరీజు వేసుకుని ఉన్నతికి ఏమి చేయాలో ఉపాధ్యాయులకు సూచించి ఆ నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు.
- విద్యార్థులంతా ఉత్తమ గ్రేడ్‌లో ఫలితాలు సాధించేందుకు పనిచేస్తున్నట్లు రాజ్‌భవన్ హైస్కూల్ టీచర్ సురేందర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తుందని, విద్యార్థుల్లో పురోగతి కనిపిస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంతో విద్యార్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తెల్ల రేషన్ కార్డులకే ప్రాధాన్యం


గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో దరఖాస్తుదారుల కోలాహలం


వెంకటేశ్వరబస్తీ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి...

బంజారాహిల్స్: ప్రజాపాలన కేంద్రాలకు గురువారం వివిధ బస్తీల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి అభయ హస్తం దరఖాస్తులను అందజేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో రెండు చొప్పున ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేయగా 15 వేల పైచిలుకు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సారి కూడా ఎక్కువగా తెల్ల రేషన్ కార్డుల కోసమే దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో పెండింగ్ పనులు పూర్తి


చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్

సనత్‌నగర్: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవతో పెండింగ్ పనులన్నీ పూర్తవుతున్నాయని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను గురువారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లనే దీర్ఘకాలిక సమస్యలు సైతం పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈఈ యతీంద్రమోహన్, జలమండలి డీజీఎం వంశీ, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఫాజిల్, సురేశ్‌గౌడ్, సర్ఫ్, సంతోశ్, ఖలీల్‌బేగ్, రాజు, పుష్పలత, పద్మ, సరితగౌడ్, రాజేశ్ ముదిరాజ్, జమీర్‌బేగ్, పురుషోత్తం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల అభ్యున్నతికి కృషి చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంధుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఎన్‌పీఆర్‌డీ ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ సమాచారాన్ని బ్రెయిలీ లిపిలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం చిక్కడపల్లిలోని ఎన్‌పీఆర్‌డీ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ... ప్రపంచంలోని అంధుల విద్య అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసి ప్రత్యేక లిపిని కనిపెట్టి అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అన్నారు. బాల్యంలో అంధత్వం రాకుండా నివారించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల కోసం ప్రత్యేకంగా విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని, సామూహిక ప్రాంతాల్లో బ్రెయిలీ లిపిని అందుబాటులో ఉంచాలని అన్ని రకాల అంధత్వం కలిగిన వారికి వైకల్య ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని ప్రభుత్వ సమాచారం, జీవోలు, చట్టాలు బ్రెయిలీలో ముద్రించి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. అంధులకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ కోశాధికారి ఆర్.వెంకటేష్, నాయకులు మహ్మద్ యూసుఫ్, వరప్రసాద్, రాజు, నర్సింగ్, ఉషా, విజయ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'నగర సంకీర్తనం'

నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ సమర్పణలో శనివారం 'నగర సంకీర్తనం' కార్యక్రమం ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉషా జ్యోతిర్మణి తెలిపారు. ఉదయం 6 గంటలకు కళాశాల ప్రాంగణంలో కార్యక్రమం ప్రారంభమై 8 గంటలకు డీడీ కాలనీలోని అహోబిల మఠంకు చేరుకుంటుందని, దీంతో సంగీత యజ్ఞం ముగుస్తుందన్నారు. పవిత్ర మార్గశిర మాసంలో మార్గం ద్వారా నామ సంకీర్తనం నగర సంకీర్తనంగా మలచాలనే ఆలోచనతో మా కళాశాల ముందుకు వచ్చిందని చెప్పారు. సంగీతాభిమానులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని నగర సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉషాజ్యోతిర్మణి కోరారు.

బస్సు కింద పడి మయూరం మృతి


కన్నుమూసిన మాయూరంతో సంధ్యాలక్ష్మి

బంజారాహిల్స్: జనారణ్యంలోకి వచ్చిన మయూరం ఓ ప్రైవేటు బస్సు కింద పడి కొన ఊపిరితో విలవిల్లాడుతుండగా చూసిన బీజేపీ మహిళా నాయకురాలు చలించిపోయింది. నెమలిని బతికిద్దామనుకున్న ఆమె ప్రయత్నం విఫలమైంది. వివరాలివీ... అమీర్‌పేట నేచర్ క్యూర్ ఆస్పత్రి సమీపంలో రోడ్డు మీదకు వచ్చిన నెమలి అటుగా వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు కింద పడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ నెమలి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా అటుగా వెళ్లేవారు చూసినప్పటికీ ఎవరూ పట్టించుకోకుండా వెళ్లిపోతున్నారు. ఇదే క్రమంలో ఆ మార్గంలో వచ్చిన బీజేపీ బేగంపేట డివిజన్ మహిళా మోర్చా నాయకురాలు సంధ్యాలక్ష్మీ ఈ దృశ్యాన్ని చూసి చలించిపోయింది. వెంటనే తన స్కూటీపై నెమలిని తీసుకుని ఆస్పత్రికి బయలుదేరింది. అయితే మార్గ మధ్యంలోనే ఆ మయూరం తుదిశ్వాస విడిచింది. దీంతో ఈ విషయాన్ని బేగంపేట పోలీసులకు తెలియజేయగా అటవీ అధికారులకు అప్పగించాల్సిందిగా వారు ఆమెకు సూచించారు. మృతి చెందిన నెమలిని తీసుకుని నేరుగా ఆమె బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్దకు వచ్చి అక్కడి అధికారులకు అప్పగించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


బర్కత్‌పురాలోని బ్రహ్మకుమారీస్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం బర్కత్‌పురాలోని బ్రహ్మకుమారీస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాలేరు పద్మ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భక్తిభావంతో పుణ్యఫలం లభిస్తుందని, ఎన్ని పనులున్నా భగవంతుని సన్నిధిలో కాసేపు గడపడానికి సమయాన్ని కేటాయించాలని సూచించారు. మనిషి ఆనందంగా ఉండటానికి జ్ఞానం అవసరమని, అది ఉంటేనే ఎల్లవేళలా సంతోషంగా ఉంటారన్నారు. జ్ఞానాన్ని సముపార్జించుకోవడంతో పాటు బాంధవ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సృష్టిలో మానవ జన్మ చాలా గొప్పదని, అందుకు ప్రతిక్షణం సత్యాన్వేషణ కోసం తపించాలన్నారు. జనహిత కార్యాలు చేయడంతో పాటు భగవంతుని నామస్మరణ చేయాలని హితబోధ చేశారు. బ్రహ్మకుమారీ కేంద్రం ప్రజలకు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయని ప్రశంసించారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమం

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజా సంక్షేమం, ప్రగతి, అభివృద్ధి, కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఫరీద్ అన్నారు. గురువారం కృష్ణానగర్ బస్తీలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రంలో ప్రజలకు ఆరు గ్యారంటీల దరఖాస్తు అభయ హస్తం దరఖాస్తులను ఆయన పంపిణీ చేశారు. ప్రజా పాలన ద్వారా వంద రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించి కాంగ్రెస్ పాలన చూపిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకోవాలని సూచించారు. నేతలు ఉపేందర్, ఎ.నర్సింగ్ రావు, ఎ.కిషోర్, ఎ.బాలకృష్ణ, ఎం.సత్యనారాయణ, ఉమేష్ బాబు, జి.వికాస్, ఎ.కిషోర్, వీరస్వామి, ఆరీఫ్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని ఇప్పించండి


ఎమ్మెల్యే దానంకు వినతిపత్రం అందించిన ఉద్యమకారులు

బంజారాహిల్స్: తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే 250 గజాల స్థలాన్ని ఇప్పించేందుకు కృషి చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని తెలంగాణ ఉద్యమకారులు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అయితే ప్రభుత్వం చెప్పినట్లు ఆనాటి ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసులు నమోదు అయితే వాటికి సంబంధించిన వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి తీసుకురావాలని చెప్పారని, కానీ అప్పటి ఉద్యమంలో పాల్గొన్న కొంతమందిపై ఎటువంటి కేసులు నమోదు కాలేదని, ఆ ఉద్యమంలో పాల్గొన్నట్లు పలు ఆధారాలు ఉన్నాయని, వాటిని ఆధారంగా చేసుకుని ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా వెంకటేష్ అనే ఉద్యమకారుడు అనారోగ్యంతో పెరాలసిస్ వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని, ఆయనకు సాయం చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యమకారుడి ఆరోగ్య అవసరాల కోసం తగు ఆర్థిక సాయం అందించడంతో పాటు ఉద్యమకారులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శంకర్, నక్క రఘు, జెట్టి విజయ్‌కుమార్, నాగరాజు, లక్ష్మణ్, శ్రీధర్, ప్రమీల, ప్రసాద్, నర్సింహా, నర్సింగ్‌రావు, ప్రేమ్, నిషాంత్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రాల వద్ద తగ్గని రద్దీ


హెచ్‌ఎఫ్‌నగర్ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

రహమత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి ఆరు గ్యారంటీల్లో భాగంగా అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తమ దరఖాస్తులను సంబంధిత అధికారులు, సిబ్బందికి అందజేస్తున్నారు. ప్రధానంగా మహిళలు కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. కేంద్రాల వద్ద జీహెచ్‌ఎంసీ అధికారులు వివిధ సేవలను అందజేస్తున్నారు. శనివారంతో గడువు ముగియనున్న నేపథ్యంలో గురువారం పెద్ద సంఖ్యలో మహిళలు కేంద్రాల వద్దకు చేరుకుని దరఖాస్తులను అందజేశారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తూ వరుస క్రమంలో ప్రజలను కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు. ఇదిలా ఉండగా దరఖాస్తుల స్వీకరణకు మరి కొన్ని రోజులు గడువు పొడిగించాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రహమత్‌నగర్‌లో రాములోరి అక్షితల వితరణ


మాట్లాడుతున్న ట్రస్టు ప్రతినిధి భాస్కర్

రహమత్‌నగర్: అయోధ్య రామ మందిరంలో ఈ నెల 22న జరిగే నిర్వహించనున్న రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో సీతారామచంద్ర స్వామి అక్షితలను తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రతినిధులు గురువారం ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ... అయోధ్య రామమందిర నిర్మాణానికి దేశ వ్యాప్తంగా భక్తుల నుంచి విరాళాలు సేకరించిన నేపథ్యంలో 22న జరిగే బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొనలేని వారు ఆ రోజు స్థానికంగా ఉన్న రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షింతలు తలపై చల్లుకోవాలన్నారు. రహమత్‌నగర్ బంగారు మైసమ్మ ఆలయంతో పాటు పలు వీధుల్లో అక్షితలను భక్తులకు అందజేశారు. స్థానిక నాయకులు కిట్టు, అనిల్, సంతోష్, శివకుమార్, మధు, కిరణ్, నరేంద్రాచారి, శ్రీను, గడ్డం శ్రీధర్, కంకట సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ హాస్టల్ మెస్ బిల్లులు విడుదల చేయాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న హాస్టల్ మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లకు రావలసిన బిల్లులను విడుదల చేయాలని అన్నారు. గత ఐదు నెలలుగా రూ. 5,485 కోట్లు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను విడుదల చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. చలికాలం కావున విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని, చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్, నాగేందర్, సహన, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ముంపు ముప్పు నుంచి 'రక్షణ'

కృష్ణానది వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణం



విజయవాడలో కృష్ణానది తీరాన పూర్తయిన రిటైనింగ్‌వాల్.. చురుగ్గా సాగుతున్న సుందరీకరణ పనులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ నగర ప్రజలకు వరద ముప్పు నుంచి పూర్తి ఉపశమనం కలగనుంది. ఆర్టీసీ బస్టాండు నుంచి యనమలకుదురు వరకు వేలాది మంది ప్రజలకు వరద కష్టాలు తొలగనున్నాయి. ప్రకాశం బ్యారేజినుంచి 5లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు వదిలితే దిగువ లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యేవి. ఇప్పుడు 12 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినా ఏ ఇబ్బంది లేకుండా రక్షణ గోడ నిర్మించారు. ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నగరంలోని లోతట్టు ప్రాంతవాసుల ముంపు కష్టాలనుంచి గట్టెక్కిస్తూ కనకదుర్గమ్మ వారధినుంచి కోటినగర్ వరకు రూ. 122కోట్లతో రక్షణగోడ నిర్మించారు. తాజాగా పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మవారధి వరకు రూ. 120.82 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి.

కృష్ణలంకకు రక్షణ కవచం

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని కృష్ణలంక ప్రాంతం కృష్ణానదికి వరదలు వచ్చినపుడల్లా ముంపుబారిన పడేది. ఇక్కడి కాలనీ వాసులందరినీ ఇతర ప్రాంతాలకు తరలించేవారు. వారం, పదిరోజుల పాటు వారంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లోనే తలదాచుకునేవారు. ఈ సమస్యను ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రక్షణ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కనకదుర్గమ్మ వారధి నుంచి కోటి నగర్ వరకు 1.2 కిలోమీటర్ల పొడవునా రూ.122.90 కోట్లతో పనులు పూర్తయ్యాయి. ప్రకాశం బ్యారేజీ దిగువన దాదాపు 50,000 మంది ప్రజలు నివసిస్తున్నారు. బ్యారేజీ నుంచి మిగులు జలాలు విడుదల చేసిన ప్రతిసారీ చలసాని నగర్, కృష్ణలంక, గీతానగర్, రాణిగారితోట, బాలాజీ నగర్, ద్వారకా నగర్, భ్రమరాంబపురం వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యేవి. రక్షణ గోడ నిర్మాణంతో ఈ ప్రాంత వాసుల కష్టాలు పూర్తిగా తీరాయి.

బీసీల బతుకులు మారాయి

వైఎస్సార్‌సీపీ వల్లే బడుగులకు సమున్నత స్థానం

- చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదు
- ప్రతిపక్షాలవన్నీ మోసపు మాటలే... వాటిని ఎవరూ నమ్మొద్దు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య స్పష్టీకరణ
- విజయవంతమైన 139 బీసీ కులాల ఆత్మీయ సమావేశం



బీసీ కులాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

సాక్షి, అమరావతి: సమాజంలో అన్ని విధాలుగా వెనుకబడిన తరగతుల వారికి ఈ ప్రభుత్వంలోనే సరైన న్యాయం జరిగిందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. డబ్బు, నోరు, శక్తి, గుర్తింపు లేనివాళ్లకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రపీఠం వేసిన ఏకైక వ్యక్తి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగన్ పాలనలో బడుగుల బతుకులు మారాయని, ఆయన గెలుపుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ హోటల్‌లో 139 బీసీ కులాల ప్రతినిధులతో గురువారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తన 45 ఏళ్ల బీసీ ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది నాయకులను చూశాననీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల మేలు కోరే జగన్ వంటి నాయకుడిని చూడలేదనీ పేర్కొన్నారు. ఆయన ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా సంఘ సంస్కర్తగా అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, సామాజిక న్యాయం అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. నాలుగున్నరేళ్ల ఆయన పాలనలోనే వాస్తవ రాజ్యాధికార బదిలీ జరిగిందని స్పష్టం చేశారు. ఏ రాష్ట్రంలోనూ జరగనంత సామాజిక న్యాయం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందని చెప్పారు. సామాజిక న్యాయం కోసం, సమ సమాజం నెలకొల్పే దిశగా జగన్ పాలన కొనసాగుతున్నందున బీసీలంతా ఆయనకు మద్దతుగా నిలవాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

బీసీలు బాగుంటే చంద్రబాబుకు కడుపుమంట

సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని పేదవర్గాల కడుపునిండుతుంటే చంద్రబాబు వంటి పెత్తందార్ల కడుపు మండుతోందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా 'ఖబడ్దార్ ప్రతిపక్షాలు.. మీ మోసాలు మాకు తెలిశాయి' అంటూ కృష్ణయ్య హెచ్చరించారు. అమ్మఒడి, విద్యాదీవెన వంటి అనేక పథకాలు పెట్టి బీసీల బిడ్డలను సీఎం జగన్ చదివిస్తున్నారనీ, విదేశీ విద్య వంటి ప్రోత్సాహంతో బీసీల పిల్లలు అమెరికాలో చదువుకుంటున్నారనీ, వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి బీసీలు ఇప్పుడు కార్లు, విమానాల్లో తిరుగుతున్నారని చెప్పారు. పొరుగున ఉన్న ఒడిశా, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు వెళ్లి బీసీ బతుకులు ఎలా ఉన్నాయో చూస్తే ఏపీలో బీసీల అభివృద్ధి ఎంత గొప్పగా ఉందో తెలుస్తుందని చెప్పారు. ఇటీవల కర్ణాటకలోని బళ్లారి, తమిళనాడులోని తెలుగు వారుండే ప్రాంతంలో ఓ సమావేశానికి తాను వెళ్లినపుడు అమ్మ ఒడి, పింఛన్, విద్యా కానుక, ఆరోగ్యశ్రీ వంటి పథకాల కోసం తమను కూడా ఏపీలో కలిపితే బాగున్ను అని అక్కడివారు తనతో అన్నట్టు ఉదహరించారు. రాష్ట్రాన్ని 14 ఏళ్ళు పాలించిన చంద్రబాబు బీసీలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ప్రతిపక్షాల మోసపు మాటలు ఎవరూ నమ్మొద్దని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీలు చెరొకటి

▶ మొదటి పేజీ తరువాయి

వారి పదవీకాలం 2027 నవంబర్ 30 వరకు ఉంది. అయితే వారి రాజీనామా అనివార్యం కావడంతో మండలిలో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి.

కాంగ్రెస్ టికెట్ మైనారిటీ వర్గానికేనా?

ఈ రెండు స్థానాల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి చాలామంది నేతలు పోటీ పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఆయా పార్టీల అగ్ర నాయకులు పలువురికి ఎమ్మెల్సీ హామీలిచ్చారు. ఇప్పుడు అదే వారికి తలనొప్పిగా మారనుంది. కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఒక్క మైనారిటీ కూడా ఎమ్మెల్యేగా ఎన్నిక కాకపోవడంతో ఆ వర్గానికి టికెట్ ఇచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సామాజిక సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని అధిష్టానం కూడా మైనారిటీల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని అంటున్నారు. అయితే రాష్ట్రంలో పార్టీ ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో తమ అసెంబ్లీ స్థానాలను త్యాగం చేసిన పలువురు నేతలు కూడా ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై అధిష్టానంతో చర్చించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ స్థానం ఆశిస్తున్న వారిలో ఇటీవల ఎన్నికల్లో ఓటమి చెందిన షబ్బీర్ అలీ, ఫిరోజ్‌ఖాన్, అజారుద్దీన్, అలీ మస్కతి, అద్దంకి దయాకర్, అందెశ్రీ, సంపత్, మధుయాష్కీ గౌడ్‌లు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎన్నికల పొత్తులో భాగంగా సీపీఐకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు ఒకే స్థానం లభించే అవకాశమున్నందున సీపీఐకి కేటాయించే అవకాశాలు తక్కువేనని అంటున్నారు.

ఎవరి త్యాగానికి ఫలితం దక్కుతుందో?

బీఆర్‌ఎస్ విషయానికొస్తే..అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోటీ నుంచి తప్పించిన పలువురు నేతలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తామని అధినేత కేసీఆర్ స్వయంగా హామీ ఇచ్చారు. స్టేషన్‌ఘనపూర్ స్థానాన్ని కడియం శ్రీహరి కోసం త్యాగం చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, జనగాం స్థానాన్ని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోసం వదులుకున్న ముత్తిరెడ్డి యాదగిరి, నర్సాపూర్ స్థానాన్ని సునీతా లక్ష్మారెడ్డి కోసం త్యాగం చేసిన మదన్‌రెడ్డి, కామారెడ్డిలో పార్టీ అధినేత కేసీఆర్ కోసం త్యాగం చేసిన గంపా గోవర్ధన్ ఎమ్మెల్సీ స్థానం ఆశిస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అయితే అధినేత ఎవరివైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. 119 మంది సభ్యులున్న రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్ 65 (సీపీఐ 1 కలిపి), బీఆర్‌ఎస్ 39, బీజేపీ 8, ఎంఐఎం ఏడుగురు ఎమ్మెల్యేల బలం కలిగి ఉన్నాయి.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 29న పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డిల రాజీనామాతో శాసనమండలిలో ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 11వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. 18న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా, 19న నామినేషన్లను పరిశీలిస్తారు. 22న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 29వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. ఫిబ్రవరి 1వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

సిరిసిల్ల నేతన్నలకు రూ.130 కోట్ల ఆర్వీఎం ఆర్డర్లు



సిరిసిల్లలోని పవర్‌లూమ్స్‌లో వస్త్రోత్పత్తి

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం 'సాక్షి'కి తెలిపారు. 1.30 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందిస్తున్నామని వివరించారు. టెక్స్‌టైల్ పార్క్‌లోని ఆధునిక మగ్గాలపై షర్టింగ్ వస్త్రం, సిరిసిల్లలోని పవర్ లూమ్స్‌పై సూటింగ్, ఓనీ వస్త్రాన్ని ఉత్పత్తి చేసే ఆర్డర్లు ఇవ్వనున్నామని చెప్పారు. ఆర్వీఎం ఆర్డర్ల విలువ రూ.130 కోట్లు ఉంటుందని అంచనా.

50 శాతం కాటన్‌తో వస్త్రాల ఉత్పత్తి

గతానికి భిన్నంగా 50 శాతం కాటన్ నూలుతో కలిపి ఆర్వీఎం వస్త్రాలను ఉత్పత్తి చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ కోసం ఈ వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందిస్తున్నారు. వస్త్రోత్పత్తికి ముందే నూలును వార్పిన్ చేసి, సైజింగ్ చేసిన తరువాత మగ్గాలపై వస్త్రాన్ని ఉత్పత్తి చేయనున్నారు. సిరిసిల్లలో తొలిసారి ఈ ప్రయోగం చేస్తున్నారు. గతంలో ప్లెయిన్ వస్త్రాన్ని ఉత్పత్తి చేసి ప్రింటింగ్ చేయించేవారు. కానీ ఈసారి వీవింగ్‌లోనే డిజైన్లు వచ్చేలా ఉత్పత్తి చేస్తున్నారు.

'మేడిగడ్డ' కుంగుబాటుపై అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు దారితీసిన కారణాలను కనిపెట్టడానికి నీటిపారుదల శాఖ గురువారం ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టెస్ట్ (ఈఆర్‌టీ) చేపట్టింది. వారంలోగా బ్యారేజీ కుంగుబాటు కారణాలు తెలుస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఎక్స్‌రేలో ఎలా ఫలితం కనిపిస్తుందో ఈఆర్‌టీలోనూ అలాంటి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ పియర్లు కుంగుబాటుకు గురవగా దీన్ని గత నెల 29న మంత్రుల బృందం పరిశీలించింది. ప్రస్తుతం చేస్తున్న పరీక్షలు కొనసాగుతాయని, బ్యారేజీకి సంబంధించి మరెక్కడైనా ఇలాంటివి ఏర్పడ్డాయా అనే అంశాన్ని పరిశీలించనున్నారు. అధికారుల నివేదిక ప్రకారం 16 నుంచి 21 వరకు ఉన్న పియర్లు ప్రభావితం అయినట్లు చెబుతున్నారు. ఈ బ్యారేజీని నిర్మించిన ఎల్‌అండ్‌టీనే ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇక సుందిళ్ల బ్యారేజీలో సీపేజీ బయటపడటంతో ఆ రెండు చోట్ల కూడా గ్రౌటింగ్ చేశారు. అన్నారంలో నాలుగు చోట్ల సీపేజీ బుంగలు ఏర్పడగా నాలుగు చోట్ల గ్రౌటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గ్రౌటింగ్ తరువాత ఈ రెండు బ్యారేజీల వద్ద కూడా ఈఆర్‌టీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్ నియామకాలకు లైన్‌క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

అప్పీలు చేసింది. సింగిల్ జడ్జి అన్ని అంశాలను పరిశీలించలేదని, ఆ తీర్పును కొట్టివేయాలని కోరింది.

ఆ పని నిపుణుల కమిటీలే చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశర్వర్‌రావుల ధర్మాసనం విచారణ జరిపి తాజాగా తీర్పు వెలువరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును పక్కనపెడుతున్నట్టు పేర్కొంది. రిక్రూట్‌మెంట్ బోర్డులు నిర్వహించే నియామక పరీక్షల్లో తలెత్తే సమస్యల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రశ్నలు తొలగించడం సరికాదని స్పష్టం చేసింది. ఇలాంటి పనులను నిపుణుల కమిటీలే చేయాలంటూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించింది. ప్రశ్నల తప్పిదాలపై ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్వతంత్ర కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించింది. అభ్యర్థులలో విశ్వాసం పెంపొందించేలా పారదర్శకంగా రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని.. ఆ కమిటీలు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టాలని నియామక బోర్డును ఆదేశించింది. ఒక కమిటీలో ఉన్న సభ్యులు మరో కమిటీలో ఉండకూడదని స్పష్టం చేసింది. నాలుగు వారాల్లోగా నియామక ప్రక్రియను పూర్తిచేయాలని పేర్కొంది.

ఎంపికైన అభ్యర్థులకు ఊరట

రిక్రూట్‌మెంట్ బోర్డు కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించి గత ఏడాది అక్టోబర్ 4వ తేదీనే ఫలితాలు ప్రకటించింది. మొత్తం 16,604 పోస్టులకు గాను 15,750 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తూ.. జాబితాను విడుదల చేసింది. ఎంపికైనవారిలో 12,866 మంది పురుషులు, 2,884 మంది మహిళలు ఉన్నారు. వారందరికీ హైకోర్టు ధర్మాసనం తీర్పుతో ఊరట లభించింది.

నగర వార్తలు

సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ఎరుకలకు న్యాయం



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న ఎరుకుల సంఘం నాయకులు

గోల్కొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ఎరుకలకు న్యాయం జరుగుతుందని మంత్రి సీతక్క అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం ప్రతినిధులు ఆమెను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు తెలంగాణ ప్రదేశ్ (1956–57) ఎరుకుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలో గత పది సంవత్సరాలలో ఎరుకలకు సరైన గుర్తింపు లభించలేదన్నారు. ఎరుకలు నష్టపోయారని ఇకనైనా ఎరుకల కష్టాలను గుర్తించి వారికి సరైన ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనం నాడి తెలిసిన నాయకుడని తప్పకుండా ఎరుక కులస్తులకు న్యాయం జరిగేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెంబసారం కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతు శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు తరగతులు బహిష్కరించి విశ్వవిద్యాలయంలో ధర్నా నిర్వహించారు. సెకండియర్ నుంచి థర్డ్ ఇయర్‌కు వెళ్లాలంటే మొదటి సంవత్సరంలో ఉన్న సబ్జెక్టులన్నీ పాస్ అయిన తర్వాత థర్డ్ ఇయర్‌కు ప్రమోట్ చేయాలని విశ్వవిద్యాలయం అధికారులు కొత్తగా నిబంధన విధించారని, కొంతమంది విద్యార్థులు తెలుగు మీడియం నుంచి వచ్చిన వారు కొందరు ఇంగ్లీష్ అర్థం కాక ఫెయిల్ అయ్యారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని, దీంతో పాటు ఎంఎస్సీ, పీహెచ్‌డీని రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం నుంచి తొలగించి సిద్దిపేట జిల్లాలో ములుగులో ఏర్పాటు చేశారని, తప్పని సరిగా రాజేంద్రనగర్‌లో పెట్టాలని విద్యార్థులు కోరుతు దర్నా చేశారు.

నగరంలో నకిలీ 'బాస్మతి'!

- బాస్మతిలో సోనామసూరి బియ్యం కలుపుతున్న వైనం
- 15 శాతం మేర కల్తీ జరుపుతున్నట్లు పరీక్షల్లో వెల్లడి
- గ్రేటర్‌లో రోజూ 20 వేల క్వింటాళ్లకు పెరిగిన వినియోగం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



సాక్షి,సిటీబ్యూరో: బిర్యానీ తయారీకి ఉపయోగించే బాస్మతి రైస్ కూడా కల్తీ అవుతున్నాయి. లాభాల కోసం కొందరు వ్యాపారులు నాణ్యమైన బాస్మతి రైస్‌లో లోకల్‌గా దొరికే పొడవైన సోనా మసూరీ బియ్యాన్ని కలిపి అమ్ముతున్నారని హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) సైంటిస్టులు ఇటీవల పరిశోధనలో గుర్తించారు. బాస్మతి రైస్ నాణ్యతా ప్రమాణాలపై సీడీఎఫ్‌డీ సైంటిస్టుల టీమ్ స్టడీ బాస్మతి బియ్యం నిర్దేశిత నాణ్యతా ప్రమాణాల్లో ఉంటున్నాయా లేదా అనేది గుర్తించడానికి దేశ, విదేశాలకు చెందిన 495 నమూనాలను సేకరించి టెస్టులు చేశారు. 50 శాతానికిపైగా నాణ్యమైన రకానికి చెందినవి కాదని సైంటిస్టులు నిర్ధారించారు. ఈ కల్తీ 15 శాతం వరకు ఉంటుందని, బాస్మతి రైస్ కల్తీ వల్ల వాటి సహజసిద్ధమైన సువాసన, ఔషధ గుణాలు తగ్గిపోన్నాయని తేల్చారు

పట్టించుకోని అధికారులు

విత్తన చట్టం 1966 ప్రకారం.. నాణ్యమైన బాస్మతి బియ్యపు గింజ వండటానికి ముందు 6.6 మిల్లీమీటర్ల పొడవు, 2 మిల్లీమీటర్ల మందం కలిగి ఉండాలి, అలాగే వండిన తర్వాత దాని పొడవు 12 మిల్లీమీటర్లు ఉండాలి. అయితే ప్రస్తుతం వాడుతున్న బాస్మతి రైస్ అలా లేదని సైంటిస్టులు తేల్చారు. వ్యాపారులు లాభాల కోసం నాణ్యమైన బాస్మతి రైస్‌లో లోకల్‌గా దొరికే పొడుగు బియ్యాన్ని కలిపి కల్తీ చేస్తున్నారని గుర్తించారు. సాధారణ బియ్యాన్ని కూడా బాస్మతిలా నమ్మించడానికి గడ్డి నుంచి సువాసన సారం తీసి బాస్మతి కాని బియ్యంపై పిచికారీ చేసి అమ్ముతున్నారని చెబుతున్నారు. ఇలా కల్తీ చేసిన రైస్ సువాసన కలిగి ఉండటంతో కల్తీ జరిగినట్లు గుర్తించలేరని అంటున్నారు. బాస్మతి బియ్యం నాణ్యతకు సంబంధించి సీడీఎఫ్‌డీ వంటి సంస్థలు, ఇతర ఏజెన్సీలు ధ్రువీకరణ పత్రం జారీ చేస్తాయి. ఇలా చేసిన బియ్యాన్నే దేశీయ మార్కెట్‌లో సరఫరా చేస్తారు. అయితే నాణ్యత సర్టిఫికెట్ ఉన్న బాస్మతి రైస్‌లో లోకల్ మార్కెట్‌లో దొరికే బాస్మతిని పోలిన బియ్యాన్ని కలిపి కల్తీ చేస్తున్నారు.

రోజూ 20 వేల క్వింటాళ్ల వినియోగం

ఈ మధ్య బాస్మతి బియ్యం వినియోగం నగరంలో విపరీతంగా పెరిగింది. గతంలో రోజు 10–12 వేల క్వింటాల్ల బాస్మతి వినిమోగం ఉంటే ఈ మధ్య ఏకంగా 18–20 వేల క్వింటాళ్ల వినియోగం పెరగినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఈసారి బాస్మతి ఉత్పత్తి నగరానికి సరఫరా తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టు సరఫరాల లేకపోవడంతో కూడా కల్తీ చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ధరలు కూడా పెరిగాయి. ఏడాది క్రితం వరకు రూ. 110–120 ఉండగా ప్రస్తుతం రూ. 140 వరకు ధర పలుకుతోంది.

బీబీజీ బంగారు తల్లికి రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్



బంజారాహిల్స్: బీబీజీ (బిల్డింగ్ బ్లాక్ గ్రూపు ఫౌండేషన్) సామాజిక సేవలో భాగంగా బాలికా సాధికారత కార్యక్రమం కింద చేపట్టిన 'బంగారు తల్లి'కి రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్ వింటర్ ఎడిషన్ అవార్డు లభించింది. బీబీజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాలికా సాధికారత పట్ల బీబీజీ తిరుగులేని నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమన్నారు. ప్రతిష్టాత్మక రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్ వింటర్ ఎడిషన్‌లోఈ గుర్తింపు లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

రేపటి నుంచి ప్రసూతి, గైనకాలజీ సదస్సు

లక్డీకాపూల్: ప్రసూతి, గైనకాలజీ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు 66వ ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆఫ్ ప్రసూతి, గైనకాలజీ 2024ను మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించనున్నట్లు సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ ఎస్ శాంత కుమారి తెలిపారు. గురువారం ఎర్రమంజిల్‌లోని మెర్క్యురీ హోటల్లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. మంత్రులు దామోదర్ రాజ నరసింహ, సీతక్క పాల్గొంటారన్నారు. సమావేశానికి దాదాపు 11 వేల మంది సభ్యులు హాజరుకానున్నట్టు చెప్పారు.

ధరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టకండి

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



గోల్కొండ అభయ హస్తం కేంద్రంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసి

గోల్కొండ: అభయ హస్తం పథకం దరఖాస్తులను తెచ్చిన వారిని అధికారులు వేధించకుండా సరైన సలహాలు ఇచ్చి దరఖాస్తులను స్వీకరించాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసి కోరారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ, నానల్‌నగర్, టోలిచౌకి తదితర ప్రాంతాలలోని ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రం అధికారులతో మాట్లాడారు. ఎన్నో ఇబ్బందులు పడుతూ దరఖాస్తు దారులు కేంద్రానికి వస్తున్నారని వచ్చే వారంతా పేద బడుగు వర్గాల వారేనని ఆయన అన్నారు. అటువంటి వారికి సరైన సలహాలు, సూచనలు ఇచ్చి అధికారులు వారి దరఖాస్తులను స్వీకరించి వెంటనే రసీదు ఇవ్వాలని సూచించారు. అధికారులు సమర్థవంతంగా పని చేస్తేనే ప్రజల్లో గుర్తింపు పొందుతారని ఆయన అన్నారు. దరఖాస్తు సమర్పించుకునేందుకు గడువును పొడిగించేది లేదన్న విషయం ప్రభుత్వం స్పష్టం చేసిందని ఆయన అన్నారు. దరఖాస్తుల పరిశీలనలో అవసరమైతే ఎక్కువ సిబ్బందిని నియమించి పరిశీలించాలని కోరారు. మజ్లీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలు బాగా పని చేస్తున్నాయని ఆయన అన్నారు. సంబంధిత కార్పొరేటర్లు తమతమ ఏరియాలలో కేంద్రాలను సందర్శించి ప్రజలకు అండగా ఉండాలని ఆయన అన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, షకీల్ అలీఖాన్, సయ్యద్ అలీ తదితరులున్నారు.

కార్మికుల హక్కులను కాపాడాలి



సదస్సులో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు

ప్రొఫెసర్ కోదండరామ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల హక్కులను కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాశారని ఆర్టీసీలో యూనియన్‌లను కూడా రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాగ్ లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్‌హాల్‌లో టీఎస్‌ఆర్టీసీ యూనియన్ ఐఎన్‌టియూసీ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణం వల్ల ప్రజా రవాణా వ్యవస్థ బలపడిందని అన్నారు. తక్షణమే ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రుల ఫోటోలతో శుభాకాంక్షలు తెలిపిన బ్యానర్లను తొలగించిన మిర్యాలగూడ, నల్గొండ ఆర్టీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బస్ భవన్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమూద్, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశం, అదనపు ప్రధాన కార్యదర్శులు అబ్రహం పాల్గొన్నారు.

కేసీఆర్ ఇంటి ముందు మహిళ హల్‌చల్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని నందినగర్‌లో నివసించే మాజీ సీఎం కేసీఆర్ ఇంటి ముందు గురువారం ఉదయం ఓ మహిళ హల్‌చల్ చేసింది. ఎల్బీనగర్ నుంచి వచ్చిన జె.వెంకటమ్మ అనే మహిళ కేసీఆర్‌ను కలవాలంటూ కొద్దిసేపు హడావిడి చేసింది. తన భర్త నర్సింహ్మా మంచాన పడ్డారని, వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నానని, సహాయం అడుగుదామని వచ్చానంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగింది. తాను బీఆర్‌ఎస్‌కు ఓటు వేశానని, గతంలో ప్రగతిభవన్‌కు కూడా వెళ్లానని, ఎప్పుడు వెళ్లినా కేసీఆర్‌ను కలవనీయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎట్టిపరిస్థితిలోనూ కేసీఆర్ వద్దకు పంపాలంటూ గొడవకు దిగగా పోలీసులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా సరే ఆమె అరగంటపాటు పట్టువిడవకుండా అక్కడే హల్‌చల్ చేసింది. ఏమి చెప్పుకోవడానికి వెళ్లినా కలవడం లేదని ఆరోపించింది.

'ఇకబెన సులభం' పుస్తకావిష్కరణ



ఇకబెన సులభం పుస్తకావిష్కరణ చేస్తున్న ఇకబెన ఆర్ట్ చాప్టర్ ప్రతినిధులు

శ్రీనగర్‌కాలనీ: ఇకబెన జపనీస్‌కు చెందిన ప్రాచీనమైన ఆర్ట్ అని, అందమైన విశాలమైన ప్రకృతిని చిన్న కుండీలాంటి వాటిలో బంధించి చేసే కళ చాలా ప్రత్యేకమైనదని ఇకబెన చాప్టర్ ప్రతినిధులు రేఖారెడ్డి, ఉమ చిరుపాటి, విజయలక్ష్మి, నీరజ గోడవర్తి అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని ప్రిష ఆర్ట్ స్పేస్‌లో రచయిత్రి, ఆర్టిస్ట్ షర్మిలా అగర్వాల్ రచించిన ఇకబెన సులభం–పూలతో సరదాగా (జపానీ పుష్పకళ తెలుగు అనువాదం) పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జపనీ పుష్పకళ విశిష్టతను ఇకబెన చాప్టర్ ప్రతినిధులు తెలియజేశారు.

ఫ్యాషన్





శారీ డ్రేప్ గురించి మనకు తెలిసిందే మరి బ్లౌజ్ డ్రేప్ గురించి.. దుపట్టాను జత చేసినట్టుగా ఒక డిజైన్ కొంగును చుట్టినట్టుగా మరో డిజైన్ చీరను కట్టేసినట్టుగా ఇంకో డిజైన్ అతివలను స్టైలిష్ లుక్‌తో మెరిపించే బ్లౌజ్ డ్రేప్ సంప్రదాయమైనా.. ఇండోవెస్ట్రన్ అయినా వేడుకల్లో ప్రత్యేకతను చూపుతుంది.

శారీ డ్రేప్‌కు దీటుగా!





లెహంగా మీదకు దుపట్టాను విడిగా వేసుకోవడం కాకుండా బ్లౌజ్‌కే ఓణీలా డ్రేప్ చేయడం ఓ ప్రత్యేకత



దుపట్టాను బ్లౌజ్‌తో కలిపి చుట్టినట్టుగా డిజైన్ చేయడం స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటుంది. అయితే, వేడుకను బట్టి పట్టు లేదా ఇతర మెటీరియల్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.

చీరతో పాటు బ్లౌజ్ డిజైనింగ్‌లోనే కొంగును అమర్చేలా చేసే డిజైన్ ఎక్కువగా శారీ గౌన్స్‌లో చూస్తుంటాం. ఇది వెస్ట్రన్ స్టైల్ పార్టీలకు బాగా నప్పుతుంది.





బ్లౌజ్ డిజైన్‌లో క్రాస్ కట్ ఎంచుకొని, పవిటతో కలిపి వేసే కట్టు వేదికలపైనా వెలిగిపోతుంటుంది.



ఒకే కలర్‌తో డిజైన్ చేసే డ్రేప్ బ్లౌజ్, లెహంగా సెట్స్ అన్ని రకాల వేడుకలకూ బాగా నప్పుతుంది.

నేడు జాతీయ పక్షుల దినోత్సవం



శీతాకాలం సైనికులు

అంతా కలిపి ఒకటిన్నర చదరపు కిలోమీటర్లు. తేమ మైదానాలు. భువనేశ్వర్ నుంచి గంటన్నర దూరంలో ఉన్న 'బంకి' అనే ఊళ్లో ఉంటాయి. వాటిని 'అరాచండి మైదానాలు' అని పిలుస్తారు. అక్కడకు ప్రతి సంవత్సరం చలికాలంలో చలి దేశాల నుంచి వలస పక్షులు వస్తాయి. బూడిద కొంగలు, వల్లంకి పిట్టలు, పెయింటెడ్ స్టార్క్స్, చక్రవాకాలు (రడీ షెల్‌డక్)... ఇంకా డజను రకాల పక్షులు వస్తాయి. సెప్టెంబర్–అక్టోబర్ నెలల్లో ఇవి వలస వచ్చి ఫిబ్రవరి–మార్చి నాటికి తిరిగి సొంత ప్రాంతాలకు మూట ముల్లె సర్దుకుని వెళ్లిపోతాయి. దేశం కాని దేశం ఎందుకు వస్తాయవి? మనుషుల్ని నమ్మి. ఆ నమ్మకం అందరూ నిలబెట్టుకోరు. కొందరు నిలబెట్టేందుకు నడుం కడతారు.

ఆ పన్నెండు మంది

ఈ మైదానాల పక్కనే ఉండే నిస్తిపూర్ అనే గ్రామంలో నివసించే సూర్యకాంతి మొహంతి అనే గృహిణి ఒకరోజు ఈ తేమ మైదానాల వైపు వచ్చింది. అక్కడ కొంతమంది వేటగాళ్లు ఈ అందమైన పక్షులు, వలస వచ్చిన అతిథులను వేటాడుతూ కనిపించారు. ఆమె మనసు వికలమైపోయింది. తమ ఊరిని ఈ పక్షులు క్షమిస్తాయా అనిపించింది. వెంటనే ఊళ్లో ఉన్న ఇతర గృహిణులకు ఈ విషయం చెప్పడం మొదలుపెట్టింది.

'అందరం కలిసి పక్షులను కాపాడదాం' అంది. చాలా మంది పట్టించుకోలేదు. 'లగాన్' సినిమాలో ఒక్కొక్కరూ దొరికినట్టు కేవలం 12 మంది గృహిణులు అంగీకరించారు. వీరంతా తమ భర్తలకు విషయాన్ని చెప్పి ఒప్పించారు. భర్తలు అంగీకరించాక 12 మంది కలిసి 'అరాచండి పక్షి సురక్షా సమితి'గా ఏర్పడ్డారు. ఆ తర్వాత ఆ పక్షులకు వారే తల్లిదండ్రులు, కాపలాదారులు, సైనికులుగా మారారు.



పక్షుల కోసమని

'ఈ పక్షులు ఎంతో సున్నితమైనవి. కాలుష్యం బారిన పడితే చచ్చిపోతాయి. అందుకే పక్షులను చూడటానికి వచ్చే వారిని ఇక్కడ చెత్త వేయకుండా అడ్డుపడ్డారు. అలాగే పిక్నిక్‌ల పేరుతో వచ్చి హారన్‌లు కొట్టడం, పాటలు పెట్టి సౌండ్లు చేయడం కూడా నిరోధించాం. ఈ పక్షులు చుట్టుపక్కల పొలాల నుంచే ఆహారాన్ని పొందుతాయి. అందుకే రైతుల దగ్గరకు వెళ్లి క్రిమిసంహారక మందులు ఉపయోగించని సేంద్రియ పంటలే పండించమన్నాం. రైతులు మా వేడుకోలును మన్నించారు. పక్షులు ఉన్నంత కాలం ప్రతి రోజూ మేము ఈ ప్రాంతానికి వచ్చి కాపలా కాస్తాం. ప్లకార్డులు ప్రదర్శిస్తాం. చెత్త లేకుండా చూస్తాం' అంటారు ఈ పన్నెండు మంది గృహిణులు.

మొసళ్లు తోడయ్యాయి

అయితే ఈ స్త్రీలకు మొసళ్లు కూడా తోడయ్యాయి. ఇక్కడి నీటి మడుగుల్లో మొసళ్లు ఉంటాయి. వేటగాళ్లు నీటి లోపలికి చొచ్చుకొచ్చి పక్షులను వేటాడకుండా ఈ మొసళ్ల భయం అడ్డుకుంటోంది. 'మొసళ్లు పక్షులకు కాపలా ఉన్నప్పుడు మనుషులు ఉండటానికేమి?' అంటారు ఈ స్త్రీలు. వీరి కృషి మెల్లగా పత్రికల ద్వారా ప్రభుత్వానికి తెలిసింది. అయినా సరే ప్రభుత్వం చేసే పని కన్నా ప్రజలు చేసే పనే ఎక్కువ ఫలితాన్ని ఇస్తోంది. 'ఈ పక్షులను గమనిస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి. చక్రవాకాలు గొప్ప ప్రేమతో ఉంటాయి. ఒంటరి చక్రవాకాలను చూద్దామన్నా కనిపించవు. జంటగా ఉండాల్సిందే' అంటారు ఈ స్త్రీలు.

వీరి సేవకు ప్రభుత్వ మెచ్చుకోలుకన్నా ప్రకృతి ఆశీస్సులు తప్పక దొరుకుతాయి.



కాలం మారింది...
అరిశె కోసం జనవరి వరకు ఎదురు చూడక్కర్లేదు.
స్వగృహ ఫుడ్స్ ఏడాదంతా అందిస్తున్నాయి.
అయినా సరే...
సంక్రాంతి వస్తోందంటే ఇంట్లో బెల్లం కాగాల్సిందే.
పాకం వాసనకు పక్కింటి వాళ్ల నోరూరించాల్సిందే.
కాలం ఎంత మారినా సరే...
అసలైన అరిశె రుచి అంటే... మన వంటింటి అరిశె రుచే.

వంటిల్లు

సంక్రాంతి మాధుర్యం మన వంటింట్లోనే...

బెల్లపు అరిశెలు

కావలసినవి: బియ్యం – ఒకటింపావు కిలో; బెల్లం – కిలో; నువ్వులు, గసగసాలు– కొద్దిగా; నెయ్యి లేదా నూనె– కాల్చడానికి సరిపడినంత

తయారి: బియ్యాన్ని ముందు రోజు రాత్రి శుభ్రంగా కడిగి, మునిగేటట్లు నీరు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వంపేసి తడిగా ఉన్నప్పుడే దంచాలి. దంచిన పిండిని సన్నని రంధ్రాలున్న జల్లెడతో జల్లించాలి. జల్లించేటప్పుడు పిండి ఆరిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. గాలికి ఆరకుండా ఎప్పటికప్పుడు ఒకపాత్రలో వేసి అదిమి మూత పెట్టాలి. పిండి సిద్ధమయ్యాక బెల్లాన్ని పాకం పట్టాలి. ● పెద్దపాత్రలో ఒక గ్లాసు నీటిని, బెల్లం ముక్కలను వేసి పాకం వచ్చేదాకా మరగనిచ్చి బియ్యప్పిండి కలుపుకుంటే పాకం పిండి సిద్ధం. ● ఇప్పుడు బాణలిలో నూనె లేదా నెయ్యి పోసి కాగనివ్వాలి. పాకంపిండిని పూరీకి, చపాతీకి తీసుకున్నట్లుగా తీసుకుని గోళీ చేసి గసాలు లేదా నువ్వులలో లేదా రెండింటిలోనూ అద్దాలి. ఇలా అద్దినట్లయితే అవి పిండికి చుట్టూ అంటుకుంటాయి. ఆ పిండిని పాలిథిన్ పేపర్ మీద పెట్టి వేళ్లతో వలయాకారంగా అద్ది, కాగిన నూనెలో వేసి రెండువైపులా దోరగా కాలిన తర్వాత తీసి అరిశెల పీట మీద వేసి అదనంగా ఉన్న నూనె కారిపోయేటట్లు వత్తాలి. అరిశెల పీటకు బదులుగా రంధ్రాలున్న చెక్కలుంటాయి. వీటితో బాణలిలో నుంచి తీసేటప్పుడే నూనె వదిలేటట్లు వత్తేయవచ్చు.

గమనిక: అరిశె నొక్కులు పోకుండా వలయాకారంగా అంతా ఒకే మందంలో రావాలంటే చేతితో అద్దడానికి బదులుగా పూరీ ప్రెస్సర్ వాడవచ్చు. ● అరిశె మెత్తగా రావాలంటే పాకం లేతగా ఉన్నప్పుడే బియ్యప్పిండి కలుపుకోవాలి. గట్టిగా ఎక్కువ తీపిగా, ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే ముదురు పాకం పట్టాలి. ● ఒక ప్లేటులో నీళ్లు పోసి ఉడుకుతున్న బెల్లం మిశ్రమాన్ని స్పూనుతో కొద్దిగా తీసుకుని నీటిలో వేయాలి. దీనిని చేత్తో నొక్కి రౌండ్ చేయాలి. జారిపోకుండా రౌండ్ వచ్చిందంటే పాకం వస్తున్నట్లు. ఆ రౌండ్‌ను పైకెత్తి ప్లేటు మీద వేసినప్పుడు మెత్తగా జారిపోకుండా అలాగే ఉంటే పాకం వచ్చినట్లు. ముదురు పాకం కావాలనుకుంటే ఆ పాకం బాల్ ప్లేటుకు తగిలినప్పుడు ఠంగున శబ్దం వచ్చే దాకా మరగనివ్వాలి. ● ఇవి పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి. తినేటప్పుడు పెనం మీద సన్న సెగకు వేడి చేస్తే అప్పటికప్పుడు చేసిన అరిశెలాగా వేడిగా, మెత్తగా వస్తాయి. ఒవెన్ ఉంటే తినే ముందు ఒక మోస్తరుగా వేడి చేసుకుంటే అప్పుడే చేసిన అరిశెల్లాగా తాజాగా ఉంటాయి. ● చక్కెర అరిశెలు చేయాలంటే బెల్లం బదులు చక్కెరతో పాకం పట్టాలి.

పూతరేకులు



కావలసినవి: బెల్లం పొడి – కేజీ; సగ్గుబియ్యం– ముప్పావు కేజీ; జీడిపప్పు, పిస్తా – పావుకేజీ (చిన్న పలుకులు చేయాలి); ఏలకుల పొడి– 5గ్రా.; నెయ్యి– 100 గ్రా.

తయారి: సగ్గుబియ్యాన్ని ఉడికించి చిక్కటి గంజి చేసుకోవాలి. పూత రేకు చేయడానికి మందపాటి నూలు వస్త్రాన్ని నలుచదరంగా కత్తిరించి సిద్ధం చేసుకోవాలి. కుండను మంట మీద బోర్లించి వేడెక్కిన తరువాత వస్త్రాన్ని సగ్గుబియ్యం గంజిలో ముంచి కుండ మీద అతికించినట్లు పరిచి వస్త్రాన్ని తీసేయాలి. గంజి కుండకు అంటుకుని వేడికి పలుచని పొరలాగా వస్తుంది. ఆ పొర చిరిగి పోకుండా అట్లకాడతో జాగ్రత్తగా తీయాలి. ఇలా ఎన్ని రేకులు కావాలంటే అన్నింటికీ ఇదే పద్ధతి. రేకు ఏ సైజులో కావాలంటే క్లాత్‌ను ఆ సైజులో కట్ చేసుకోవాలి. ● ఒకపాత్రలో బెల్లం పొడి, జీడిపప్పు, పిస్తా పలుకులు, ఏలకుల పొడి వేసి కలుపుకోవాలి. ఇప్పుడు రేకులను రెండు పొరలు తీసుకుని వాటికి నెయ్యి రాయాలి. ఆ తర్వాత బెల్లం పొడి, జీడిపప్పు పలుకులు, ఏలకుల పొడి మిశ్రమాన్ని పలుచగా వేసి పైన మరొక పొర రేకును వేసి మడత వేయాలి. ఇవి పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి.

కొబ్బరి బూరెలు



కావలసినవి: బియ్యప్పిండి– అరకేజీ; బెల్లం – 300గ్రా.; పచ్చి కొబ్బరి– ఒక చిప్ప; ఏలకులపొడి – ఒక టీ స్పూను; నెయ్యి– టేబుల్ స్పూన్; నూనె – కాలడానికి సరిపడినంత.

తయారి: బియ్యాన్ని శుభ్రంగా కడిగి అరిసెలకు చేసుకున్నట్లే తడిబియ్యాన్ని దంచుకోవాలి. జల్లించి పిండి ఆరిపోకుండా మూతపెట్టి పక్కన ఉంచాలి. పచ్చికొబ్బరిని తురిమి సిద్ధంగా ఉంచాలి. బెల్లాన్ని పాకం పట్టాలి. బూరెలకు పాకం ముదర కూడదు. లేతపాకం సరిపోతుంది. పాకం వచ్చిన వెంటనే కొబ్బరి తురుము వేసి కలపాలి. కొబ్బరి కలిసిన తరువాత మూడు – నాలుగు గుప్పెళ్ల బియ్యప్పిండి వేసి మంట మీద నుంచి దించేయాలి. ఇప్పుడు ఏలకుల పొడి, మిగిలిన బియ్యప్పిండిని వేసి ఉండలు కట్టకుండా సమంగా కలిసే వరకు కలిపి పైన నెయ్యి వేసి అద్ది మూత పెట్టాలి. కొబ్బరి బూరెల పిండి సిద్ధం అన్నమాట.

● బాణలిలో నూనె పోసి కాగనివ్వాలి. ఈ లోపుగా బూరెల పిండి చిన్న గోళీ అంత తీసుకుని అరచేతిలో కాని పాలిథిన్ పేపరు మీద కాని అరిసెలాగా వేళ్లతో ఒత్తి కాగిన నూనెలో వేయాలి. రెండు వైపులా దోరగా వేగిన తరువాత తీయాలి. తీసిన పదినిమిషాలకు వేడి తగ్గి బూరె రుచి ఇనుమడిస్తుంది.

ఎల్లు చిక్కీ

కావలసినవి: నువ్వులు – పావు కేజీ; బెల్లం – పావు కేజీ; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారి: నువ్వులను మందపాటి పెనంలో వేసి సన్నమంట మీద వేయించాలి. చిటపట పేలడం మొదలు పెట్టిన తర్వాత స్టవ్ ఆపేసి పెనం పక్కన పెట్టి చల్లారనివ్వాలి. ● మరొక పాత్రలో బెల్లం పొడితోపాటు టీ స్పూన్ నీటిని వేసి కరిగేవరకు మీడియం మంట మీద ఉంచాలి. కరిగిన తర్వాత మంట తగ్గించి పాకం వచ్చే వరకు ఉడికించాలి. పాకం వచ్చిన తర్వాత అందులో నువ్వులు, నెయ్యి వేసి కలపాలి. ఒక వెడల్పాటి ప్లేట్‌కు నెయ్యి రాసి బెల్లం, నువ్వుల మిశ్రమాన్ని వేసి పూరీల కర్రతో అంతటా ఒకేమందం వచ్చేటట్లు వత్తాలి. వేడి తగ్గిన తర్వాత చాకుతో ఇష్టమైన ఆకారంలో గాట్లు పెట్టాలి. చల్లారిన తర్వాత ప్లేట్ నుంచి వేరు చేసి గాలి దూరని డబ్బాలో నిల్వ చేసుకుంటే నాలుగు వారాల పాటు నిల్వ ఉంటాయి. కన్నడ భాషలో ఎల్లు అంటే నువ్వులు. నువ్వుల పట్టీని వాళ్లు ఎల్లు చిక్కీ అంటారు. పిల్లలు, మహిళల ఆరోగ్యం కోసం ఎల్లు చిక్కీని నెలకోసారి చేసుకుని రోజూ కనీసం ఒక్క పట్టీ అయినా తినాలి.



● ముగ్గు-ముచ్చట



బొడ్డేడ
సూర్యప్రభ
సింహాచలం



21 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు



21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చేవరకు



రావిరాల విజయలక్ష్మి
దేవరకొండ,
నల్గొండ జిల్లా

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.

యువర్స్

• సక్సెస్ స్టోరీ


• అభిషేక్ • అపూర్వ్ కుశాల్ • సంభవ్ జైన్



ముగ్గురు మిత్రుల ముచ్చటైన విజయం

'కాలంతో పాటు నడవాలి' అంటారు పెద్దలు.
'కాలంతో పాటు నడుస్తూనే భవిష్యత్‌పై ఒక కన్ను వేయాలి' అంటారు విజ్ఞులు.
అభిషేక్ అనిత, అపూర్వ్ కుషాల్, సంభవ్ జైన్... అనే ముగ్గురు మిత్రులు రెండో కోవకు చెందిన దార్శనికులు.
లెర్న్ అండ్ ఎర్న్ ప్లాట్‌ఫామ్ 'ఇంట్రాక్ట్'తో వెబ్3 వరల్డ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు...

ఐఐటీ–దిల్లీలో చదువుకున్న అభిషేక్ అనిత, అపూర్వ్ కుషాల్, సంభవ్ జైన్ సంభాషణాల్లో సరదా విషయాల కంటే సాంకేతిక విషయాలే ఎక్కువగా చోటు చేసుకునేవి. బ్లాక్ చెయిన్ టెక్నాలజీని మొదటిసారిగా ఎప్పుడు ఉపయోగించారు? వివిధ దేశాల్లో ఈ టెక్నాలజీని ఎలా ఉపయోగిస్తున్నారు? ఏ రంగాలలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు? మన దేశంలో క్రిప్టో కరెన్సీపై పెట్టుబడులు, ఇంటర్నెట్ అభివృద్ధిలో మూడు ప్రధాన దశలు, వెబ్3 టెక్నాలజీతో అపారమైన ఉద్యోగావకాశాలు...ఇలా ఒకటా రెండా బ్లాక్‌చైన్, క్రిప్టో టెక్నాలజీ, వెబ్3 టెక్నాలజీ గురించి గంటల తరబడి మాట్లాడుకునేవారు.

వారు మాట్లాడుకున్న విషయాలేవి వృథా పోలేదు.

'ఇంట్రాక్ట్' ప్లాట్‌ఫామ్‌కు పునాదిగా ఉపయోగపడ్డాయి.

ప్రజలకు బ్లాక్ చెయిన్, క్రిప్టో టెక్నాలజీని చేరువ చేయాలనే లక్ష్యంతో 2022లో 'ఇంట్రాక్ట్' అనే స్టార్టప్ స్టార్ట్ చేశారు ముగ్గురు మిత్రులు. 'వెబ్3 టెక్నాలజీకి సంబంధించి కేవలం సమాచార వేదికగానే కాకుండా ప్రతిఫలదాయక వేదికగా ఇంట్రాక్ట్‌ని నిర్మించాం. లెర్నింగ్ అండ్ ఎర్నింగ్ అనేది ఇంట్రాక్ట్ లక్ష్యం. క్వెస్ట్, ఇంటరాక్టివ్ టాస్కుల ద్వారా బ్లాక్ చెయిన్, క్రిప్టో, వెబ్3 టెక్నాలజీతో యూజర్‌లను ఎడ్యుకేట్ చేసే ప్రయత్నం చేస్తున్నాం' అంటున్నాడు కో–ఫౌండర్ అభిషేక్.

సంక్లిష్టమైన రీతిలో కాకుండా ఫన్ అండ్ ఇంటరాక్టివ్ పద్ధతిలో కొత్త ప్రాడక్టులు, సర్వీసులను యూజర్‌లకు పరిచయం చేయడంలో 'ఇంట్రాక్ట్' విజయం సాధించింది. టాస్క్‌లను విజయవంతంగా పూర్తి చేసిన యూజర్‌లకు క్రిప్టో, ఎన్ఎఫ్‌టీ, లాయల్టీ పాయింట్స్ రూపంలో 'ప్రోత్సాహకాలు' అందిస్తోంది.

ఎన్నో కలలతో ముగ్గురు మిత్రులు 'ఇంట్రాక్ట్'ను ప్రారంభించారు. ఆ కలలకు కష్టాన్ని జోడించారు. ఆ కష్టం వృథా పోలేదు. లక్షలాది యూజర్‌లతో 'ఇంట్రాక్ట్' వెబ్3 వరల్డ్‌లో కీలక పాత్ర పోషిస్తూ ప్రాఫిటబుల్ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగింది. 'ఇంట్రాక్ట్' ఇన్వెస్టర్‌లలో ఆల్ఫా వేవ్ గ్లోబల్, గుమీ క్రిప్టోస్, ఆల్కెమీ, మూన్ పే, వెబ్ 3 స్టూడియోస్, కాయిన్ బేస్...మొదలైన కంపెనీలు ఉన్నాయి. సమీకరించిన నిధులలో కొంత మొత్తాన్ని తమ టీమ్ సభ్యుల సంఖ్యను రెట్టింపు చేయడానికి, సాంకేతిక అవసరాలకు ఉపయోగించారు. సాధించిన విజయంతో సంతృప్తి పడడం లేదు ముగ్గురు మిత్రులు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకున్నారు.

వెబ్3 టెక్నాలజీపై మార్కెటింగ్ నిపుణులు, కంపెనీల ఫౌండర్‌లు దృష్టి పెట్టారు. మరో వైపు ఉద్యోగావశాలు లేదా ఆవిష్కరణల కోణంలో యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో పోటీగా ఎన్నో కంపెనీలు మార్కెట్‌లోకి రావచ్చు. వాటిని తట్టుకొని ముందుకు వెళ్లాలంటే ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాల గురించి ఆలోచించాలనేది ముగ్గురు మిత్రులకు తెలియని విషయం కాదు.

'వెబ్3 క్రియేట్ చేసిన సరికొత్త ఆర్థిక అవకాశాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థల గురించి పరిచయం చేసి యూజర్‌లకు ఉపయోగపడాలనేది మా లక్ష్యం' అంటున్నాడు సంస్థ కో–ఫౌండర్, సీయీవో సంభవ్ జైన్.

• మ్యూజిక్ వరల్డ్


• షహన షోమ్

స్వర మాయాజాలం

షహన షోమ్ మ్యూజికల్ జర్నీ తన అధికార యూట్యూబ్ చానల్ 'హోల్డ్ బట్ గోల్డ్'తో మొదలైంది. దీని ద్వారా బాలీవుడ్ టైమ్‌లెస్ మెలోడీస్‌ను వినిపించి ఆబాలగోపాలాన్ని అలరిస్తోంది. 'మొహబ్బత్ కర్నే వాలే' లాంటి క్లాసిక్‌తో పాటు 'సేవ్ ది గర్ల్‌చైల్డ్' 'ఎడ్యుకేషన్ ఫర్ ది అండర్‌ప్రివిలేజ్‌డ్'లాంటి సామాజిక స్పృహతో కూడిన ఇతివృత్తాలతో పాటలు పాడుతుంది. చిన్నప్పుడు సినిమా పాటలే కాదు క్లాసిక్ గజల్స్, కీర్తనలు పాడేది. ప్రముఖ సంగీతకారుల వర్ధంతిని దృష్టిలో పెట్టుకొని వారికి నివాళిగా యూట్యూబ్‌లో చేసే పాటల కార్యక్రమాలు సూపర్‌హిట్ అయ్యాయి.'పాత పాటలు పాడుతుంటే కాలమే తెలియదు. టైమ్‌మెషిన్‌లో గతంలోకి వెళ్లినట్లుగా అనిపిస్తుంది' అంటున్న షహనకు దేశవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులు ఉన్నారు. తన పాటల ద్వారా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలకు నిధులను సేకరించడంలో కూడా ముందు ఉంటుంది. 'పాటల ద్వారా సామాజిక సందేశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం నా లక్ష్యాలలో ఒకటి' అని చెబుతుంది షహన.

• టెక్.. టాక్



మోటోరోలా మోటో జీ4 ప్లే

సైజ్	: 5.00 అంగుళాలు
బరువు	: 137 గ్రా.
ర్యామ్	: 2జీబి స్టోరేజ్ : 16జీబి
బ్యాటరీ	: 2800 ఎంఏహెచ్

వివో వి30 లైట్

సైజ్	: 6.67 అంగుళాలు
రిఫ్రెష్ రేట్	: 120 హెచ్‌జడ్
బ్యాటరీ	: 4,800 ఎంఏహెచ్
బరువు	: 190 గ్రా.
ర్యామ్	: 12జీబి
స్టోరేజ్	: 256జీబి
ఆండ్రాయిడ్	: ఫన్‌టచ్ వోఎస్ 13
కలర్స్	: బ్లాక్ ఫారెస్ట్ అండ్ రోజ్ గోల్డ్






యాంటీ–స్లిప్ ఫోన్ హోల్డర్

బ్రాండ్	: వోహ
డైమెన్షన్స్	: 20x10x10 సీఎం
కలర్	: మల్టీ కలర్ • ఆయిల్ రెసిస్టెన్స్
కంపాటబుల్	: స్మార్ట్‌ఫోన్స్ బరువు : 200 గ్రా.
మౌంటింగ్	: కార్ డాష్‌బోర్డ్

వాట్సాప్‌లో డిజిటల్ అవతార్ క్రియేట్ చేయడానికి...



1. వాట్సాప్ ఓపెన్ చేసి స్క్రీన్ అప్పర్ రైట్ కార్నర్‌లోని త్రీ డాట్స్ ట్యాప్ చేసి 'సెలెక్టింగ్స్'ను సెలెక్ట్ చేసుకోవాలి. 2. ప్రొఫైల్ ఫొటో–క్లిక్ . 3. అప్పర్ రైట్ కార్నర్‌లోని 'ఎడిట్' క్లిక్ చేయాలి. 4. మెనూ నుంచి 'యాడ్ అవతార్'ను సెలెక్ట్ చేసుకోవాలి. 5. అవతార్‌ను క్రియేట్ చేసిన తరువాత 'సేవ్' బటన్ నొక్కాలి. 6. స్క్రీన్ బాటమ్‌లోని 'యూజ్ యాజ్ ప్రొఫైల్ పిక్చర్' సెలెక్ట్ చేసుకోవడం ద్వారా అవతార్‌ను ప్రొఫైల్ ఇమేజ్‌గా ఉపయోగించుకోవచ్చు.

• అవును... ఇది నిజమే!



• స్టాండర్డ్ టైమ్ జోన్స్‌కు ముందు యూఎస్‌లో వివిధ ప్రాంతాలలో వివిధ టైమ్ జోన్స్ ఉండేవి. సూర్యుడి స్థానం ఆధారంగా వారు లోకల్ టైమ్‌ను సెట్ చేసుకునేవారు. 1918లో యూఎస్ అధికారికంగా స్టాండర్డ్ టైమ్‌జోన్ సిస్టమ్‌ను ఎడాప్ట్ చేసుకుంది.

• స్విట్జర్లాండ్‌లోని కొన్ని థియేటర్‌లలో టాయిలెట్ స్క్రీన్‌లు ఉంటాయి! టాయిలెట్ బ్రేక్ తీసుకున్నప్పుడు మూవీని మిస్ కాకుండా ఉండడానికి ఈ ఏర్పాటు చేశారు

• జపాన్ రాజధాని టోక్యోలో 'ది రెస్టారెంట్ ఆఫ్ మిస్టేకెన్ ఆర్డర్స్' అనే రెస్టారెంట్ ఉంది. దీనిలో ఒక వంటకం ఆర్డర్ ఇస్తే ఇంకో వంటకం మన టేబుల్ మీద ఉంటుంది. దీనికి కారణం ఈ రెస్టారెంట్‌లోని వెయిటర్‌లు డిమెన్షియా బాధితులు. డిమెన్షియాపై ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నంలో భాగంగానే డిమెన్షియా బాధితులకే ఈ రెస్టారెంట్‌లో ఉద్యోగాలు ఇస్తారు.

• గేమింగ్



ఢీ అంటే ఢీ 2.5డీ

యాక్షన్–అడ్వెంచర్ గేమ్ 'ప్రిన్స్ ఆఫ్ పర్షియా: ది లాస్ట్ క్రౌన్' ఈ నెల 18న విడుదల కానుంది. ఈ గేమ్ కథానాయకుడు సర్గాన్ ఎంత ఎత్తు నుంచి అయినా దూకగలడు. ఎయిర్ డ్యాష్ ఇవ్వగలడు. మెరుపు వేగంతో రకరకాల ప్లామ్ ఫామ్స్ మధ్య ప్రయాణించగలడు. శత్రువును ఎలా ఓడించాలో, ఏ సమయంలో ఎలాంటి ఆయుధం వాడలో సర్గాన్‌కు బాగా తెలుసు. కంబాట్, ప్లాట్‌ఫామింగ్ పర్పస్ కోసం టైమ్–బేస్డ్ పవర్స్‌తో ప్లేయర్ యాక్సెస్ కావచ్చు. ఎన్నో అడ్వెంచర్‌లకు కేంద్రమైన 'ది లాస్ట్ క్రౌన్' 2.5డీ సైడ్–స్క్రోలింగ్ యాక్షన్–అడ్వెంచర్ ప్లాట్‌ఫామ్ వీడియో గేమ్.

జానర్స్: యాక్షన్–అడ్వెంచర్, మెట్రోవోడ్వెనియా **మోడ్:** సింగిల్ ప్లేయర్

ప్లాట్‌ఫామ్స్: నిన్‌టెండో స్విచ్, ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

English Idioms

ఏ పాట్ ఆన్ ది బ్యాక్

మంచి పనిచేసినప్పుడు, ఏదైనా విషయంలో ప్రతిభ చాటుకున్నప్పుడు ఇతరులను ప్రశంసించే సందర్భంలో వాడే మాట...
ఏ పాట్ ఆన్ ది బ్యాక్.
ఉదా: యూ హ్యావ్ డన్ ఏ గ్రేట్ జాబ్, అండ్ యూ డిజర్వ్ ఏ పాట్ ఆన్ ది బ్యాక్.

★ ★ ★

లాక్, స్టాక్ అండ్ బారెల్

'ఆల్' 'ఎవ్రీథింగ్' 'టోటల్' అని చెప్పడానికి ఉపయోగించే మాట...
లాక్, స్టాక్ అండ్ బారెల్.
ఉదా: ఉయ్ లాస్ట్ ఎవ్రీ థింగ్–లాక్, స్టాక్ అండ్ బ్యారెల్

సినిమా


• అనుష్క

మరో లేడీ ఓరియంటెడ్ మూవీలో..?

'అరుంధతి', 'భాగమతి' వంటి ఉమెన్ సెంట్రిక్ హిట్స్‌తో ఈ జానర్ చిత్రాలకు ఓ స్పెషలిస్ట్‌గా మారిపోయారు అనుష్కా శెట్టి. తాజాగా ఆమె మరో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. దర్శకుడు క్రిష్ ఇటీవల ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ స్టోరీని డెవలప్ చేశారని, ఈ కథలో అనుష్క అయితే బాగుంటుందని ఆయన అనుకుంటున్నారనీ టాక్. గతంలో క్రిష్ దర్శకత్వంలో వచ్చిన 'వేదం' (2010) సినిమాలో అనుష్క ఓ లీడ్ రోల్ చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. మరి.. పద్నాలుగేళ్లకు క్రిష్–అనుష్క కాంబో కుదురుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

వన్ ప్లస్ వన్ ఈక్వెల్ టు త్రీ!


• అమలా పాల్, జగత్ దేశాయ్

వన్ ప్లస్ వన్ ఈక్వెల్ టు త్రీ అంటున్నారు అమలా పాల్. తాను తల్లి కాబోతున్న విషయాన్ని అమలా పాల్ ఈ విధంగా వెల్లడించి, ఓ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గత ఏడాది నవంబరులో వ్యాపారవేత్త జగత్ దేశాయ్‌తో అమలా పాల్ ఏడడుగులు వేశారు. గురువారం తాము దంపతులు కానున్నట్లుగా వెల్లడించారు జగత్–అమలాపాల్.

పవర్‌ఫుల్ సత్యభామ


• కాజల్ అగర్వాల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు శశికిరణ్ తిక్క ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరించడంతో పాటు స్క్రీన్ ప్లే అందించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించి ఓ భారీ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ–''సత్యభామ'లో కాజల్ అగర్వాల్ ఓ పవర్‌ఫుల్ పోలీ సాఫీసర్ పాత్ర చేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి 35 రోజుల పాటు ఓ భారీ షెడ్యూల్ పూర్తి చేశాం. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారు కాజల్. ఫైట్ మాస్టర్ సుబ్బు ఆధ్వర్యంలో ఈ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించాం. గతంలో ఎప్పుడూ కనిపించని యాక్షన్ మోడ్‌లో కాజల్ కనిపిస్తారు. ఈ సినిమాలోని పోరాట ఘట్టాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. తాజా షెడ్యూల్‌తో 90శాతం షూటింగ్ పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: జి. విష్ణు, సహనిర్మాత: బాలాజీ.

ఐదు చిత్రాలొస్తే సమస్యే

- 'దిల్' రాజు

''గత ఏడాది సంక్రాంతికి మూడు సినిమాలు విడుదలైతే ఎంత రచ్చ జరిగిందో తెలిసిందే. అలాంటిది ఈ సంక్రాంతికి ఐదు చిత్రాలొస్తే ఎన్ని సమస్యలొస్తాయో అనిపించింది. నిర్మాతలు విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్లగారు మాట్లాడారు. పరిస్థితిని రవితేజగారికి కూడా వివరించి 'ఈగల్' సినిమా సంక్రాంతి విడుదలని వాయిదా వేసుకున్నారు. తర్వాత వారి సినిమా రిలీజ్‌కి చాంబర్ ద్వారా సోలో డేట్ ఇప్పించాలని గురువారం చర్చించుకుని నిర్ణయించాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని నిర్మాతల


• దిల్ రాజు, దామోదర ప్రసాద్, సునీల్ నారంగ్, విశ్వప్రసాద్

మండలి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు 'దిల్' రాజు మాట్లాడుతూ– ''మా 'ఫ్యామిలీస్టార్' మూవీ సంక్రాంతి రిలీజ్ నుంచి తప్పుకున్నాక మిగిలిన నిర్మాతలతో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను వివరించాం. ఐదు సినిమాల్లో (గుంటూరు కారం, హను–మాన్, సైంధవ్, ఈగల్, నా సామి రంగ) ఒక్కటైనా రిలీజ్‌లో వెనక్కి తగ్గినా మిగిలిన సినిమాలపై ఎఫర్ట్స్ పెట్టవచ్చని. ఓ సినిమా వాయిదా పడటం వల్ల మిగతా నాలుగు సినిమాలకు ఎంతో కొంత రెవెన్యూ పెరగడానికి, స్క్రీన్స్ దొరకడానికి అవకాశం ఉంటుంది. చాంబర్ అడిగినందుకు సహకరించిన 'ఈగల్' నిర్మాతలకు థ్యాంక్స్. మిగిలిన సినిమాలకు స్క్రీన్స్ కేటాయిస్తాం. ప్రేక్షకులు ఎగ్జైట్‌మెంట్‌లో మార్నింగ్ షోకి పరిగెత్తేదే పెద్ద సినిమా. మహేశ్‌గారి సినిమాకి ఎక్కువ స్క్రీన్స్ వెళతాయి. ఆ తర్వాత వెంకటేశ్(సైంధవ్), నాగార్జున(నా సామిరంగ) గార్ల సినిమాలకు, ఆ తర్వాత 'హను–మాన్'కి వెళతాయి'' అన్నారు.

ఫిబ్రవరి 9న ఈగల్

ఇంకా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈగల్' సినిమాని ఫిబ్రవరి 9న రిలీజ్ చేస్తామని నిర్మాతలు అడిగారు. ఆ రోజు 'టిల్లు స్క్వేర్', 'యాత్ర 2' సినిమాల విడుదలని ఇప్పటికే ప్రకటించారు. నిర్మాత నాగవంశీతో మాట్లాడితే సంక్రాంతికి 'గుంటూరు కారం'తో వస్తున్నందున 'టిల్లు స్క్వేర్' రిలీజ్ వాయిదాకి ఒప్పుకున్నారు. యూవీ క్రియేషన్స్ వంశీతో మాట్లాడి.. అవకాశం ఉంటే 'యాత్ర 2'ని ఒక వారం తర్వాతో, ముందో రిలీజ్ చేయమని అడుగుతాం'' అన్నారు. తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ– ''ఈగల్' సినిమా రిలీజ్‌ని వాయిదా వేస్తూ, మంచి నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు'' అన్నారు. ''పరిస్థితిని రవితేజగారికి వివరించడంతో ఆయన కూడా 'ఈగల్' వాయిదాకి అంగీకరించారు'' అన్నారు టీజీ విశ్వప్రసాద్.

ఈ కార్యక్రమంలో నిర్మాతలు తుమ్మల ప్రసన్న కుమార్, వెంకట్ బోయనపల్లి, వివేక్ కూచిబొట్ల, కె. నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

హను–మాన్ చూసి సంతోషంగా బయటికొస్తారు

- నిర్మాత కె. నిరంజన్‌రెడ్డి



''సోషియో ఫ్యాంటసీ అంశాలతో కూడిన సూపర్ హీరో జానర్ మూవీ 'హను–మాన్'. ఆంజనేయ స్వామిని ఎలా చూడాలని ప్రేక్షకులు కోరుకుంటారో 'హను–మాన్'లో అలానే చూస్తారు. సినిమా చూసిన ప్రేక్షకులంతా థియేటర్స్ నుంచి సంతోషంగా బయటికొస్తారు'' అన్నారు నిర్మాత కె. నిరంజన్ రెడ్డి. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను–మాన్'. శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకరులతో కె. నిరంజన్ రెడ్డి చెప్పిన విశేషాలు.

• మాది నల్గొండ. నేను హైదరాబాద్‌లోనే పుట్టి, పెరిగాను. నాకు సినిమా నేపథ్యం లేదు. మా నాన్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి. సినిమా అంటే ప్యాషన్‌తో ఈ రంగంలోకి వచ్చాను. ఎంతో ప్యాషన్‌తో చేసిన 'హను–మాన్' ప్రేక్షకులకు నచ్చుతుంది. మా బ్యానర్ నుంచి వచ్చే చిత్రాలన్నీ కంటెంట్ బేస్డ్‌గానే ఉంటాయి. 25 ఏళ్ల పాటు ఈ రంగంలో ఉండాలనే లక్ష్యంతో వచ్చాను. 'హను–మాన్' నా తొలి చిత్రం. ఫస్ట్ మూవీనే గ్రాండ్‌గా నిర్మించడం, సంక్రాంతికి రావడం హ్యాపీగా ఉంది. • 'హను–మాన్' ముందు అనుకున్న బడ్జెట్ కంటే ఐదు రెట్లు పెరిగింది. ప్రశాంత్ వర్మ విజన్, కథపై నమ్మకంతోనే రాజీ పడలేదు. మా నమ్మకాన్ని నిజం చేస్తూ వ్యాపారం కూడా అద్భుతంగా జరిగింది. ఈ సంక్రాంతికి ఐదు సినిమాలు విడుదలవుతున్నాయి. అయితే మా 'హను–మాన్' కథపై పూర్తి నమ్మకం ఉంది. కథని నమ్మి తీసిన 'బేబీ, బలగం' సినిమాలు ఇదే విషయాన్ని నిరూపించాయి. మా సినిమా కూడా వాటిలా లాంగ్ రన్‌గా ఉంటుంది. • ప్రేక్షకులు ఫ్యామిలీతో కలసి మా సినిమా చూడాలని కోరుకుంటున్నారని తెలిసింది. దీనికి తగినట్లు హను–మాన్‌ని ఓ ప్రత్యేకమైన సినిమాలా భావించి, ఇండస్ట్రీవారు సహకారించాలని కోరుకుంటున్నాను. నాలుగు సినిమాలు వస్తున్నపుడు ఆయా మూవీ స్కేల్, బజ్‌కి తగ్గట్టు థియేటర్స్ కేటాయించాలనేదే మా విన్నపం.

రీల్స్

సినిమా రిలీజ్ చేయడం పెద్ద టాస్క్

- నిర్మాత విజయ్


• శివశక్తి, కిశోర్, విజయ్ మట్టపల్లి

కిశోర్ కేఎస్‌డి, దియా సితెపల్లి జంటగా శివశక్తి రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్రేమకథ'. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజ్ కానుంది. గురువారం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రోగ్రామ్‌లో.. ''రియాల్టీకి దగ్గరగా ఉండే లవ్‌స్టోరీ ఫిల్మ్ ఇది'' అన్నారు దర్శకుడు శివ. ''ఓ సినిమా తీయడం కన్నా, దాన్ని కరెక్ట్‌గా రిలీజ్ చేయడం పెద్ద టాస్క్‌గా మారింది. 'మధుర' శ్రీధర్, ధీరజ్, శింగనమల కల్యాణ్‌లు ఈ సినిమా విడుదలలో హెల్ప్ చేశారు'' అన్నారు విజయ్. ''ప్రేక్షకులు ఓ కొత్త లవ్‌స్టోరీ చూస్తారు'' అన్నారు సుశీల్.

వజ్రాన్వేషణలో...


• మౌర్యాణి

కిరణ్, మౌర్యాణి జంటగా సీరపు రవికుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పింకీ'. పి. పద్మావతి సమర్పణలో పసుపులేటి వెంకటరమణ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి మొదటి వారంలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పసుపులేటి వెంకటరమణ మాట్లాడుతూ– ''జరిగిన కథ, జనం' చిత్రాలను స్వీయ దర్శకత్వంలో నిర్మించా. 'జనం పార్ట్ 2' షూటింగ్‌లో ఉంది. రవికుమార్ చెప్పిన కథ నచ్చడంతో 'పింకీ' సినిమా నిర్మించా. ప్రస్తుతం సెన్సార్ పనులు జరుగుతున్నాయి'' అన్నారు. ''ఒక డైమండ్ కోసం జరిగే అన్వేషణే ఈ చిత్రం. ఫ్యామిలీ, సస్పెన్స్, థ్రిల్లర్ మూవీ'' అన్నారు సీరపు రవికుమార్.

భిన్నమైన ఆట


• గీతానంద్, నేహా

గీతానంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. ఈ చిత్రం ఫిబ్రవరి 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో తన జీవితాన్ని చాలించాలనుకునే ఓ వ్యక్తి రియల్ టైమ్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు? ఈ ఆట ఎవరు ఆడిస్తున్నారు? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి'' అన్నారు. ''విభిన్నమైన కథతో రూపొందిన చిత్రం ఇది. ఈ మూవీతో గీతానంద్ కెరీర్ నెక్స్ట్ లెవెల్‌కి వెళ్తుంది'' అన్నారు రవి కస్తూరి. ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ ఏఆర్.

కళాశాలలో చల్లగాలి


• ప్రణవ్, షజ్ఞ శ్రీ

ప్రణవ్, షజ్ఞ శ్రీ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల'. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చల్లగాలి..' అంటూ సాగే వీడియో సాంగ్‌ని రిలీజ్ చేశారు. ''2000 సంవత్సరంలో పుంగనూరులో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశాం'' అన్నారు శ్రీనాథ్ పులకురం. ''మంచి కథతో తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు భువన్ రెడ్డి. ''ప్రేక్షకుల ఆలోచనలు రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్లేలా రియలిస్టిక్‌గా ఈ సినిమా చేశాం'' అన్నారు ప్రణవ్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
5-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
491	141
71,848	21,659

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,581	▽	11
డోజోన్స్	37,582	▲	152
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,723	▲	41
డాక్స్	16,617	▲	79
హాంసెంగ్	2,954	▽	13
నికాయ్	33,288	▽	176

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారట్)	61,930
బంగారం (22 క్యారట్)	58,980
వెండి (కేజీ)	78,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	104.20	106.98
€	యూరో	ఒకటికి	89.98	92.35
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	57.56	58.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	55.28	57.22
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.19	22.29
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.54	23.36
¥	చైనా యువాన్	పదింటికి	10.48	12.39

ఫండ్స్‌లో 'జియో' మార్క్!

- బ్లాక్‌రాక్‌తో కలసి జాయింట్ వెంచర్
- లైసెన్స్ కోసం సెబీ వద్ద దరఖాస్తు
- త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం
- మ్యూచువల్ ఫండ్స్‌లో పెరగనున్న పోటీ



న్యూఢిల్లీ: టెలికంలో మాదిరే మ్యూచువల్ ఫండ్స్ లోనూ 'జియో' మార్క్ కనిపించనుందా..? ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్, ప్రపంచంలోనే అతిపెద్ద అస్సెట్ మేనేజర్ అయిన బ్లాక్‌రాక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడంతో అందరిలోనూ ఇదే ప్రశ్న తలెత్తుతోంది. కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, జియో తనదైన ప్రత్యేక ముద్ర వేసే అవకాశాలు లేకపోలేదన్నది అంచనా. తక్కువ చార్జీలతో వినూత్నమైన ఫండ్స్ ఉత్పత్తులు, ఆకర్షణీయమైన రేట్లకే రుణాలను ఆఫర్ చేయవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. రిలయన్స్ గ్రూప్‌నకు దేశంలోనే అతిపెద్ద రిటైల్ స్టోర్ నెట్‌వర్క్ ఉంది. 40 కోట్లకు పైగా టెలికం కస్టమర్లు ఉన్నారు. ఇవన్నీ జియో ఫండ్స్‌కు కలిసొచ్చే అంశాలు.

రుణ సేవలు ఆరంభం

జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన జియో ఫైనాన్స్ తన రుణ వితరణ వ్యాపారాన్ని ఇప్పటికే ప్రారంభించింది.

త్వరలో ఫండ్స్ సేవలు

ఫండ్ వ్యాపారాన్ని ప్రారంభించేందుకు వీలుగా జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్లాక్‌రాక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ జాయింట్ వెంచర్ (జేవీ) పెట్టుకున్న అభ్యర్థనకు త్వరలో సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్ రానుంది. జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ చెరో 150 మిలియన్ డాలర్లను జేవీ కింద ఇన్వెస్ట్ చేయడం కోసం నిర్ణయించుకున్నాయి.

మరిన్ని సంస్థల కన్ను..

కోల్‌కతా కేంద్రంగా స్టాక్ బ్రోకింగ్ సేవలు అందిస్తున్న అబీరా సెక్యూరిటీస్ కూడా మ్యూచువల్ ఫండ్ లైసెన్స్ కోసం తిరిగి దరఖాస్తు చేసుకుంది. ఏంజెల్ వన్ సంస్థకు మ్యూచువల్ ఫండ్స్ సేవలు ప్రారంభించేందుకు గతేడాది ఫిబ్రవరి 8న సెబీ సూత్రప్రాయ ఆమోదం తెలియజేయగా, తుది రిజిస్ట్రేషన్ ప్రస్తుతం సెబీ పరిశీలనలో ఉంది. గతేడాది జూన్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ ఫండ్స్ సేవలను ప్రారంభించింది. అక్టోబర్‌లో సమీర్ అరోరాకు చెందిన హీలియోస్ మ్యూచువల్ ఫండ్స్ సేవలు మొదలు పెట్టగా, అదే సమయంలో జెరోదా ఫండ్ సేవలు కూడా ప్రారంభమయ్యాయి. కెన్నెత్ యాండ్రడేకి చెందిన ఓల్డ్ బ్రిడ్జ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌కు సెబీ నుంచి ఇటీవలే తుది ఆమోదం లభించింది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సంస్థ యూనిఫి క్యాపిటల్‌కు సెబీ నుంచి గత నవంబర్‌లో సూత్రప్రాయ ఆమోదం లభించింది. ప్రస్తుతం దేశ ఫండ్స్ పరిశ్రమలో సుమారు 45 సంస్థలు ఉన్నాయి.

జియో కొత్త కస్టమర్లు 31.59 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిలయన్స్ జియో 2023 అక్టోబర్‌లో కొత్తగా 31.59 లక్షల మంది మొబైల్ కస్టమర్లను సొంతం చేసుకుంది. ట్రాయ్ ప్రకారం.. గతేడాది అక్టోబర్‌లో భారతీ ఎయిర్‌టెల్ 3.52 లక్షల మంది వినియోగదార్లను నూతనంగా చేర్చుకుంది. వొడాఫోన్ ఐడియా 20.44 లక్షల మంది చందాదార్లను పోగొట్టుకుంది. అక్టోబర్‌లో తోడైన వినియోగదార్లతో కలిపి రిలయన్స్ జియో మొత్తం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 45.23 కోట్లకు చేరింది. ఎయిర్‌టెల్ చందాదార్ల మొత్తం సంఖ్య 37.81 కోట్లకు ఎగసింది. వొడాఫోన్ ఐడియా వినియోగదార్ల సంఖ్య 22.54 కోట్లకు పడిపోయింది. అక్టోబర్ నాటికి మొత్తం యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు14 లక్షలు తగ్గి 104.5 కోట్లకు చేరారు. సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదార్లు 0.37 శాతం అధికమై 88.8 కోట్లకు చేరారు.

మార్కెట్ మళ్లీ లాభాల్లోకి..

- రెండు రోజుల నష్టాలకు చెక్
- సెన్సెక్స్ 491 పాయింట్లు అప్
- నిఫ్టీ లాభం 141 పాయింట్లు
- ఫైనాన్స్, రియల్టీ షేర్లకు డిమాండ్



ముంబై: రెండు రోజుల వరుస నష్టాల తర్వాత స్టాక్ సూచీలు మళ్లీ పుంజుకొని గురువారం లాభాలు ఆర్జించాయి. త్రైమాసిక రుణ వృద్ధి, వ్యాపారాలు మెరుగుపడినట్లు వెల్లడైన డేటాతో ఫైనాన్స్ కంపెనీల షేర్లు, కొత్త ఇళ్లకి డిమాండ్ పెరగొచ్చనే అంచనాలతో రియల్టీ షేర్లు, భారీ పెట్టుబడి ప్రణాళికల కారణంగా ఇంధన షేర్లు రాణించాయి. ఫలితంగా సెన్సెక్స్ 491 పాయింట్లు పెరిగి 71,848 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 141 పాయింట్లు బలపడి 21,659 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదలాయి. ఆటో, మెటల్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 598 పాయింట్లు బలపడి 71,955 వద్ద, నిఫ్టీ 169 పాయింట్లు బలపడి 21,686 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. కంపెనీల డిసెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై సానుకూల అంచనాలతో మార్కెట్లో చిన్న, మధ్య తరహా షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 1.50%, 1.04% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,513 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,387 కోట్ల షేర్లను అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 7 పైసలు పెరిగి 83.23 వద్ద స్థిరపడింది. ఫెడరల్ రిజర్వ్ మినిట్స్‌లో ఈ ఏడాది వడ్డీ రేట్ల తగ్గింపు ఎప్పటి నుంచి అనే అంశంపై స్పష్టత కొరవడడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. బ్యాంకుల ప్రకటించిన ఆరోగ్యకరమైన గృహ రుణాల పంపిణీ డేటా, వడ్డీరేట్లు తగ్గే అవకాశం అంచనాలతో రానున్న రోజుల్లో ఇళ్లకు డిమాండ్ పెరగొచ్చనే ఆశావహ అంచనాలతో రియల్టీ రంగ షేర్లకు ఊపునిచ్చింది. సెన్సెక్స్ 491 పాయింట్లు పెరగడంతో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.24 లక్షల కోట్లు పెరిగి రూ.368 లక్షల కోట్లకు చేరింది.

డిసెంబర్‌లో 'తయారీ' నెమ్మది

18 నెలల కనిష్ట స్థాయికి సూచీ



న్యూఢిల్లీ: తయారీ రంగం డిసెంబర్‌లో పేలవ పనితీరును ప్రదర్శించింది. ఎస్ అండ్‌పీ గ్లోబల్ నిర్వహించిన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ 54.9కి పడిపోయింది. ఇది 18 నెలల కనిష్ట స్థాయి. కాగా ఈ సూచీ 50 పైన కొనసాగితే వృద్ధి ధోరణిగా పరిగణిస్తారు. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా విశ్లేషిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	608-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
4-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	582-00
వరంగల్	584-00

తక్కువ సుంకాల విధానానికి మళ్లాలి

డీపీఐఐటీ కార్యదర్శి రాజేశ్ కుమార్



న్యూఢిల్లీ: దేశీయంగా పరిశ్రమ శైశవ దశలోనే ఉండటూ, తయారీదారుల ప్రయోజనాలను పరిరక్షించే ఉద్దేశంతో కస్టమ్స్ సుంకాలను అధిక స్థాయిలో కొనసాగించే పరిస్థితి ఎంతో కాలం ఉండదని డీపీఐఐటీ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. భారత్ క్రమంగా తక్కువ సుంకాల విధానాలకు మళ్లాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి టారిఫ్‌లను ఆదాయ వనరుగా పరిగణించలేమని తెలిపారు. టారిఫ్‌ల విధింపుతో బలహీనంగా ఉన్న రంగాలను పరిరక్షించాల్సిన అవసరం తప్పకుండా ఉన్నప్పటికీ.. మెరుగ్గా ఉన్న రంగాలకూ అధిక సుంకాల రక్షణ కల్పించాల్సిన అవసరం ఉండదని సింగ్ చెప్పారు.అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలకు మరింత అనుసంధానమయ్యేందుకు భారత్ దిగుమతి సుంకాలను తగ్గించాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతుండగా, ఆటోమొబైల్ తదితర రంగాలు దాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

అధిక పింఛను వివరాలకు వ్యవధి

మే 31 వరకు పొడిగింపు



న్యూఢిల్లీ: అధిక పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న సభ్యుల తరపున వేతన వివరాలు అప్‌లోడ్ చేసేందుకు యాజమాన్యాలకు ఈపీఎఫ్‌వో మరింత గడువు ఇచ్చింది. తొలుత ఇచ్చిన గడువు డిసెంబర్ 31తో ముగిసిపోగా, దీన్ని ఈ ఏడాది మే 31 వరకు పొడిగించినట్టు కేంద్ర కార్మిక శాఖ వెల్లడించింది. అధిక పింఛను కోసం వేతనం నుంచి మరింత చందా చెల్లించేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చే అవకాశాన్ని ఈపీఎఫ్‌వో లోగడ కల్పించడం తెలిసిందే. 2023 ఫిబ్రవరి 26న ఆన్‌లైన్ ఆప్షన్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. తొలుత 2023 మే వరకు అవకాశం ఇవ్వగా, రెండు విడతలుగా పెంపుతో జూలై 11 వరకు వెసులుబాటు కల్పించింది. మొత్తం 17.49 లక్షల మంది సభ్యులు అధిక పింఛను కోసం ఆప్షన్ ఇచ్చారు. తాజా నిర్ణయంతో వేతన వివరాలను అప్‌లోడ్ చేసేందుకు యాజమాన్యాలకు మరింత వ్యవధి లభించింది

కాఫీ డే చెల్లింపుల వైఫల్యం

రుణాలు, వడ్డీలు కలిపి రూ. 434 కోట్లు



న్యూఢిల్లీ: కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ తాజాగా రూ. 434 కోట్ల రుణ చెల్లింపుల్లో విఫలమైంది. డిసెంబర్ త్రైమాసికానికల్లా బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అసలు, వడ్డీ కలిపి రూ. 434 కోట్లు చెల్లించవలసి ఉండగా.. చెల్లించలేకపోయినట్లుగా కంపెనీ వెల్లడించింది. ఆస్తుల పరిష్కార ప్రక్రియ(రిజల్యూషన్) ద్వారా రుణ భారాన్ని తగ్గించుకుంటున్న కంపెనీ లిక్విడిటీ సంక్షోభం కారణంగా రుణ చెల్లింపులను చేపట్టలేకపోయినట్లు వివరించింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ. 183.36 కోట్లు, వడ్డీ చెల్లింపులు రూ. 5.78 కోట్లు చెల్లించలేకపోయినట్లు సీడీఈఎల్ పేర్కొంది. ఇదేవిధంగా రూ.200 కోట్ల విలువైన అన్‌లిస్టెడ్ రుణ సెక్యూరిటీలు, ఎన్‌సీఆర్‌పీఎస్‌లతోపాటు రూ. 44.77 కోట్లమేర వడ్డీ చెల్లింపుల్లోనూ విఫలమైనట్లు తెలియజేసింది. 2019 జూలైలో కంపెనీ వ్యవస్థాపకుడు, చైర్మన్ సిద్ధార్థ ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే.

వివో ఎక్స్ 100 సిరీస్


ధర రూ.89,999 వరకు



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివో తాజాగా ఎక్స్100 సిరీస్ ఫోన్లను భారత్‌లో ప్రవేశపెట్టింది. ఎక్స్100 ధర రూ.63,999–69,999, ఎక్స్100 ప్రో రూ.89,999గా ఉంది. ప్రీమియం సెగ్మెంట్‌లో వాటాను పెంచుకోవడానికి వీటిని పరిచయం చేసినట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. అత్యంత నాణ్యమైన చిత్రాలు, వీడియోల కోసం జైస్ కెమెరా పొందుపరిచారు. వినియోగదారులకు విప్లవాత్మక మొబైల్ ఫొటోగ్రఫీ అనుభవాన్ని అందించాలనే నిబద్ధతకు ఎక్స్100 నిదర్శనమని వివో తెలిపింది. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో సూర్యుని ఫోటోలను సులభంగా తీసేందుకు వీలుగా టెలిఫోటో సన్‌షాట్ ఫీచర్‌తో ఇవి రూపుదిద్దుకున్నాయి. రూ.30,000లు ఆపైన ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల విభాగంలో వివో మార్కెట్ వాటా 2023 రెండవ త్రైమాసికంలో 22 శాతానికి చేరుకుంది.

యూపీఐ చెల్లింపులకు చార్జీలు!

పెద్ద వ్యాపారులు చెల్లించాల్సిందే



ముంబై: వచ్చే మూడేళ్లలో పెద్ద వ్యాపారులు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఆధారిత చెల్లింపులకు చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఎండీ దిలీప్ అస్బే గురువారం వెల్లడించారు. నగదుకు ప్రత్యామ్నాయ చెల్లింపులను అందించడం, యూపీఐని విస్తృతం చేయడంపై ప్రస్తుతం దృష్టి సారించామని తెలిపారు. బాంబే చార్టర్డ్ అకౌంటెంట్స్ సొసైటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులు తమ ఐటీ బడ్జెట్‌లో సైబర్ సెక్యూరిటీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై ఖర్చులను ఇప్పుడున్న 10 నుంచి 25 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. యూపీఐ ఆధారిత చెల్లింపులపై చార్జీలు విధింపు అంశంపై పరిశ్రమ నుంచి విముఖత వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం యూపీఐ సేవలు అందించే సంస్థలకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తోంది.

"ఇది కూడా క్రికెట్ పిచే కదా. ఆడింది మ్యాచే కదా! మ్యాచ్ రిఫరీలకు, ఐసీసీకి ఏం జరిగిందో కనబడిందనే అనుకుంటున్నా. మరి దీనికేం రేటింగ్ ఇస్తారు? భారత్‌లో ప్రపంచకప్ ఫైనల్ కోసం తయారు చేసిన పిచ్‌పై ఓ బ్యాటర్ సెంచరీ చేసినా దానికి 'యావరేజ్' రేటింగ్ ఇస్తారు. ఇవేం ద్వంద్వ ప్రమాణాలు మరి! ఐసీసీ గానీ, రిఫరీలు గానీ తటస్థంగా ఉండాలి. కేప్‌టౌన్‌లో ఏం జరిగిందో అందరూ చూశారు. పిచ్ ఎలా ఉందో అందరికీ తెలుసు. నిజాయితీగా చెబుతున్నా... ఇలాంటి పిచ్‌లపై ఆడేందుకు నాకైతే ఎలాంటి ఇబ్బందులు లేవు. అలాగే విదేశీ జట్లు కూడా భారత్‌కు వచ్చినపుడు మూడు రోజుల్లో ముగిస్తే, స్పిన్ తిరిగితే ఇవేం పిచ్‌లు, ఇదేం చెత్త అని నోరుపారేసుకోవడం ఆపితే మంచిది. *–రోహిత్ శర్మ, భారత జట్టు కెప్టెన్*"

నేటి నుంచి రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ

దేశంలోని వివిధ నగరాల్లో భారత దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీకి శుక్రవారం తెర లేవనుంది. ఎలైట్ డివిజన్‌లో 32 జట్లు... ప్లేట్ డివిజన్‌లో 6 జట్లు ఉన్నాయి. ఎలైట్ డివిజన్ తొలి రౌండ్ మ్యాచ్‌లో విశాఖపట్నంలో బెంగాల్‌తో ఆంధ్ర జట్టు... ప్లేట్ డివిజన్‌లో నాగాలాండ్ జట్టుతో హైదరాబాద్ తలపడతాయి.



టి20 సిరీస్‌కు 'సై'

- నేడు ఆస్ట్రేలియాతో భారత్ తొలి మ్యాచ్
- రాత్రి గం. 7:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


నవీ ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత మహిళల జట్టు టి20 సిరీస్‌కు సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు ఇరు జట్ల మధ్య తొలి టి20 జరగనుంది. వన్డే సిరీస్‌లో నిరాశపరిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టు టి20ల్లో సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. స్మృతి మంధాన, రిచా, షఫాలీ వర్మ, జెమీమాలతో పాటు హర్మన్‌ప్రీత్ కూడా తనవంతు పాత్రను పోషించాలి. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి జోరు మీదుంది. ఫోబీ లిచ్‌ఫీల్డ్, తాలియా, అనాబెల్ మంచి ఫామ్‌లో ఉన్నారు.

ఆస్ట్రేలియా 116/2

సిడ్నీ: పాకిస్తాన్, ఆస్ట్రేలియా జట్ల మధ్య చివరిదైన మూడో టెస్టు రెండో రోజు ఆటకు వర్షం ఆటంకం కలిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 6/0తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా వెలుతురులేమి, వర్షం కారణంగా ఆటను నిలిపి వేసే సమయానికి 47 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. చివరి టెస్టు ఆడుతున్న ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ 34 పరుగులు సాధించి అవుటయ్యాడు. ఖ్వాజా (47; 4 ఫోర్లు) అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. లబుషేన్ (23 బ్యాటింగ్), స్మిత్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 313 పరుగులకు ఆలౌటైంది.

రాణించిన ప్రణవి చంద్ర

బెంగాల్‌పై హైదరాబాద్ గెలుపు



న్యూఢిల్లీ: బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు విజయంతో బోణీ చేసింది. బెంగాల్ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 24 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత హైదరాబాద్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 225 పరుగులు సాధించింది. ప్రణవి చంద్ర (88 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) బాధ్యతాయుత బ్యాటింగ్ కారణంగా హైదరాబాద్ గౌరవప్రద స్కోరు నమోదు చేసింది. 226 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగాల్ 49.3 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది.



బుమ్రా

రెండు రోజుల్లోనే...

ఆఖరి టెస్టులో భారత్ 7 వికెట్లతో జయభేరి | **చరిత్రకెక్కిన విజయంతో సఫారీ టూర్ ముగింపు** | **రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికాను కూల్చేసిన బుమ్రా** | **మార్క్‌రమ్ సెంచరీ వృథా**

తగ్గేదేలే... సినిమా డైలాగ్‌లా ఉంది సఫారీలో భారత పర్యటన తీరు! తొలి టెస్టును ఆతిథ్య జట్టు మూడు రోజుల్లోనే ముగిస్తే... రెండో టెస్టును టీమిండియా రెండు రోజుల్లోనే ఖతం చేసింది. మొదటి మ్యాచ్ ముగియగానే అందరూ 'భారత్ సొంతగడ్డపై పులి... విదేశాల్లో పిల్లి' అని నిట్టూర్చారు. ఇప్పుడదే విమర్శకులు 'ఔరా' అని విస్తుపోయేలా మన పేస్ పేట్రేగిపోయింది. అచ్చిరాని కేప్‌టౌన్‌లో కేక పెట్టింది. క్రీజులోకి దిగిన బ్యాటర్ల గుండెల్లో గుబులు రేపింది. ఇన్నేళ్లుగా ఏ వేదికపై గెలవలేకపోయామో అక్కడే చరిత్రకెక్కే గెలుపుతో భారత్ మళ్లీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది.

కేప్‌టౌన్: క్రికెట్‌నే శ్వాసించే భారత అభిమానులకు ఈ కొత్త సంవత్సరం కిక్ ఇచ్చే గిఫ్ట్‌ను టీమిండియా ఇచ్చింది. ఆఖరి రెండో టెస్టులో 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. మొత్తం సఫారీ పర్యటనలో మూడు ఫార్మాట్‌ల సిరీస్‌ను సాధికారంగా ముగించింది. గత డిసెంబర్‌లో టి20 సిరీస్‌తో ఈ పర్యటన మొదలైంది. టి20 సిరీస్‌ను 1–1తో సమం చేసుకున్న టీమిండియా... వన్డే సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. తాజాగా టెస్టు సిరీస్‌ను 1–1తో సమంగా ముగించింది. తద్వారా ఏ ఒక్క సిరీస్‌లోనూ తగ్గలేదు సరికదా... పైపెచ్చు వన్డేలతో ఒకమెట్టుపైనే నిలిచింది.

అలా మొదలై... ఇలా కుదేలైంది!

తొలిరోజే 23 వికెట్లతో ఆసక్తికర పేస్ డ్రామాకు తెరలేపిన మ్యాచ్... రెండో రోజు అదే పేస్ పదునుకు తెరపడేలా చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 62/3తో గురువారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 36.5 ఓవర్లలో 176 పరుగులకే కుప్పకూలింది. ఇంత తక్కువ జట్టు స్కోరులోనూ మార్క్‌రమ్ (103 బంతుల్లో 106; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ హైలైట్ కాగా... తొలి ఇన్నింగ్స్‌ను సిరాజ్ కూల్చితే... రెండో ఇన్నింగ్స్‌లో ఆ పని బుమ్రా (6/61) చేశాడు. 98 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం వల్ల భారత్ లక్ష్యం 79 పరుగులతో మరింత చిన్నదైంది. దీన్ని టీమిండియా 12 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 80 పరుగులతో చకచకా ఛేదించింది.

ఒకడి పోరాటం... మరొకడి పేస్ ప్రతాపం

టెస్టుల్లో ఆటంటే ఐదు రోజులు. నాలుగు ఇన్నింగ్స్‌లు... 15 సెషన్లు... 450 ఓవర్లు... 40 వికెట్లు... అంటే అందరూ (బ్యాటింగ్) డబుల్ యాక్షన్ చేయాల్సిందే! అన్ని రోజులు శ్రమించినా... ప్రతి సెషన్లోనూ చెమటోడ్చినా చాలా టెస్టుల్లో (డ్రాలతో) ఫలితమే రాదు! కేప్‌టౌన్‌లో మాత్రం పేస్ పదునుకు, భారత్ పట్టుదలకు ఒక వంతు (ఐదు సెషన్లలోపే)లోనే, రెండు రోజులు పూర్తవకముందే భారత్ జయభేరి మోగించింది. తొలి సెషన్లో దక్షిణాఫ్రికా ఓవర్‌నైట్ బ్యాటర్ మార్క్‌రమ్ వన్డేను తలపించే ఆటతీరుతో చకచకా పరుగులు సాధించాడు. మరోవైపు బుమ్రా... బెడింగ్‌హమ్ (11), కైల్ వెరిన్ (9)లను పడగొట్టడంలో సఫలమయ్యాడు. దీని వల్ల జట్టు స్కోరు వంద పరుగుల్లోపే సగం (85/5) వికెట్లను కోల్పోగా, మార్క్‌రమ్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. పిచ్ సంగతి, బుమ్రా పేస్ నిప్పులు వెంటనే అర్థమైపోవడంతో మార్క్‌రమ్ ధనాధన్ బౌండరీలతో సెంచరీ సాధించాడు. కానీ ఈలోపే బుమ్రా కూడా జాన్సెన్ (11), కేశవ్ మహరాజ్ (3) వికెట్లను చేజిక్కించుకున్నాడు. మార్క్‌రమ్ పోరాటానికి సిరాజ్ బౌలింగ్‌లో చుక్కెదురవగా... మిగతా టెయిలెండర్లు లంచ్‌లోపే అవుటయ్యారు. ఇక రెండో సెషన్‌లో లక్ష్యఛేదనకు దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో క్రీజులోకి దిగిన వారంతా వేగంగా బ్యాటింగ్ చేశారు. యశస్వి జైస్వాల్ (23 బంతుల్లో 28; 6 ఫోర్లు), గిల్ (11 బంతుల్లో 10; 2 ఫోర్లు), కోహ్లి (11 బంతుల్లో 12; 2 ఫోర్లు) అవుట్‌కాగా, కెప్టెన్ రోహిత్ (16 నాటౌట్; 2 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (4 నాటౌట్; 1 ఫోర్) అజేయంగా ముగించారు. సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ మ్యాచ్' అవార్డు లభించగా... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారాన్ని ఎల్గర్, బుమ్రా సంయుక్తంగా గెల్చుకున్నారు.



టెస్టు సిరీస్ ట్రోఫీతో భారత కెప్టెన్ రోహిత్ శర్మ, దక్షిణాఫ్రికా కెప్టెన్ డీన్ ఎల్గర్

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 55 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 153 ఆలౌట్; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) రోహిత్ శర్మ (బి) సిరాజ్ 106; ఎల్గర్ (సి) కోహ్లి (బి) ముకేశ్ 12; జోర్జి (సి) రాహుల్ (బి) ముకేశ్ 1; స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1; బెడింగమ్ (సి) రాహుల్ (బి) బుమ్రా 11; వెరిన్ (సి) సిరాజ్ (బి) బుమ్రా 9; జాన్సెన్ (సి అండ్ బి) బుమ్రా 11; కేశవ్ మహరాజ్ (సి) అయ్యర్ (బి) బుమ్రా 3; రబడ (సి) రోహిత్ శర్మ (బి) ప్రసిధ్ కృష్ణ 2; బర్గర్ (నాటౌట్) 6; ఎన్‌గిడి (సి) యశస్వి (బి) బుమ్రా 8; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (36.5 ఓవర్లలో ఆలౌట్) 176. వికెట్ల పతనం:** 1-37, 2-41, 3-45, 4-66, 5-85, 6-103, 7-111, 8-162, 9-162, 10-176. **బౌలింగ్:** బుమ్రా 13.5-0-61-6, సిరాజ్ 9-3-31-1, ముకేశ్ కుమార్ 10-2-56-2, ప్రసిధ్ కృష్ణ 4-1-27-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) స్టబ్స్ (బి) బర్గర్ 28; రోహిత్ శర్మ (నాటౌట్) 16; శుబ్‌మన్ గిల్ (బి) రబడ 10; కోహ్లి (సి) వెరిన్ (బి) జాన్సెన్ 12; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (12 ఓవర్లలో మూడు వికెట్లకు) 80. వికెట్ల పతనం:** 1-44, 2-57, 3-75. **బౌలింగ్:** రబడ 6-0-33-1, బర్గర్ 4-0-29-1, జాన్సెన్ 2-0-15-1.

642 భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య రెండో టెస్టులో ఫలితం రావడానికి వచ్చిన బంతులు (107 ఓవర్లు). తక్కువ బంతుల పరంగా, ఓవర్ల పరంగా టెస్టు క్రికెట్‌లో ఫలితం వచ్చిన టెస్టుగా ఈ మ్యాచ్ రికార్డు పుస్తకాల్లో ఎక్కింది. 1932లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్ట్‌లో 656 బంతుల్లో ఫలితం వచ్చింది.

3 రెండు రోజుల్లోనే ముగిసిన టెస్టులో భారత జట్టు నెగ్గడం ఇది మూడోసారి. గతంలో భారత జట్టు అఫ్గానిస్తాన్‌పై (బెంగళూరులో-2018), ఇంగ్లండ్‌పై (అహ్మదాబాద్‌లో-2021) ఈ ఘనత సాధించింది. ఓవరాల్‌గా ఇప్పటి వరకు 25 టెస్టుల్లో రెండు రోజుల్లోనే ఫలితం వచ్చింది.

1 కేప్‌టౌన్‌లో భారత జట్టు టెస్టులో నెగ్గడం ఇదే తొలిసారి. గతంలో ఈ వేదికపై భారత్ ఆరు టెస్టులు ఆడి రెండింటిని 'డ్రా' చేసుకొని, నాలుగింటిలో ఓడింది. దక్షిణాఫ్రికా గడ్డపై భారత జట్టు రెండోసారి బ్యాటింగ్ చేసి టెస్టులో గెలవడం ఇదే మొదటిసారి. గతంలో ఇక్కడ భారత్ నెగ్గిన నాలుగు టెస్టుల్లో తొలుత బ్యాటింగ్ ప్రారంభించింది.

5 దక్షిణాఫ్రికా గడ్డపై భారత జట్టు గెలిచిన టెస్టుల సంఖ్య (జోహనెస్‌బర్గ్‌లో-2, డర్బన్‌లో-1, సెంచూరియన్‌లో-1, కేప్‌టౌన్‌లో-1). దక్షిణాఫ్రికా గడ్డపై భారత్ మొత్తం 25 టెస్టుల ఆడగా ... ఐదు టెస్టుల్లో విజయం సాధించింది. 13 టెస్టుల్లో ఓడిపోయింది. ఏడింటిని 'డ్రా' చేసుకుంది.

2 ఒక టెస్టు మ్యాచ్‌లో ఇద్దరు భారత పేస్ బౌలర్లు (సిరాజ్, బుమ్రా) రెండు ఇన్నింగ్స్‌లలో ఆరు లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసుకోవడం ఇది రెండోసారి మాత్రమే. 2014లో ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో జరిగిన టెస్టులో భువనేశ్వర్ (తొలి ఇన్నింగ్స్‌లో 6/82), ఇషాంత్ శర్మ (రెండో ఇన్నింగ్స్‌లో 7/74) తొలిసారి ఈ ఘనత సాధించారు.

4 రాహుల్ ద్రవిడ్ (2006), ధోని (2010), కోహ్లి (2018, 2021) తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై భారత జట్టుకు టెస్టులో విజయాన్ని అందించిన నాలుగో కెప్టెన్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు.


2 దక్షిణాఫ్రికా గడ్డపై టెస్ట్ సిరీస్‌ను 'డ్రా'గా ముగించడం భారత జట్టుకిది రెండోసారి. ధోని సారథ్యంలో 2010-2011లో మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-1తో సమంగా ముగించింది. ఇప్పుడు రోహిత్ శర్మ కెప్టెన్సీలో రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా 1-1తో 'డ్రా'గా ముగించింది.

1 దక్షిణాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్‌లో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు గెల్చుకున్న తొలి భారతీయ క్రికెటర్‌గా బుమ్రా గుర్తింపు పొందాడు.

4 కేప్‌టౌన్‌లో రెండు రోజుల్లోనే ఫలితం వచ్చిన టెస్టులు. 1889, 1896లో దక్షిణాఫ్రికా-ఇంగ్లండ్ జట్ల మధ్య రెండు టెస్టులు... 2005లో దక్షిణాఫ్రికా-జింబాబ్వే జట్ల మధ్య ఒక టెస్టు రెండు రోజుల్లోనే ముగిశాయి.

ఏఐ చెప్పిన చిలక జోస్యం

రోబో మనుషులు వస్తున్నారు!



ఇంగ్లిష్ వాళ్ల నోస్ట్రడామస్ నుంచి మన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దాకా.. ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఎవరు గెలుస్తారో చెప్పే ఆక్టోపస్ నుంచి చిలక జోస్యం దాకా.. భవిష్యత్తులో ఏం జరుగుతుందన్నది చెప్పేవారికి ఎంతో డిమాండ్.. వినేందుకు మనం ఎప్పుడూ రెడీనే. మరి అలా 2024లో ఏమేం జరగవచ్చని 'కృత్రిమ మేధ (ఏఐ)' అని అడిగితే.. కాస్త మంచి ముచ్చట్లు చెప్తూనే.. మరికాస్త ఆందోళన రేపే అంచనాలే వేసింది. ఆ వివరాలేమిటో తెలుసుకుందామా..

మనంతగా కాకున్నా మనలా ఆలోచించి సమాధానం చెప్పేలా, కావాల్సిన సమాచారం ఇచ్చేలా రూపొందినవే కృత్రిమ మేధ (ఏఐ) ప్రోగ్రామ్‌లు. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్‌నెట్‌లో విస్తృతమైన సమాచారం, వివిధ వార్తాంశాలను క్రోడీకరించి, వడపోసి.. మనకు అవసరమైన సమాచారాన్ని దాదాపు కచ్చితంగా అందించేలా వాటిని రూపొందిస్తారు. ఓపెన్ ఏఐ సంస్థ రూపొందించిన 'చాట్ జీపీటీ', గూగుల్ అభివృద్ధి చేసిన 'బార్డ్', అమెజాన్ సాయంతో రూపొందిన 'క్లాడ్' ఏఐ ప్రోగ్రామ్‌లు అలాంటివే. 2024లో ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిణామాలు తలెత్తవచ్చనే అంశంపై 'డెయిలీ మెయిల్ వెబ్‌సైట్' ప్రతినిధులు ఇటీవల బార్డ్, క్లాడ్ ఏఐ ప్రోగ్రామ్‌లను ప్రశ్నించారు. అవి ఇచ్చిన సమాధానంలోని కీలక అంశాలను వెల్లడించారు. తాజా సమాచారం, వార్తలపై ఎక్కువగా ఆధారపడేలా రూపొందించడం వల్లే ఇతర ఏఐలకు బదులు బార్డ్, క్లాడ్‌లను ఎంపిక చేసుకుంటున్నట్టు తెలిపారు.

న్యూస్, నెట్.. శోధించి..

మనుషులను మించే..



2024లో కృత్రిమ మేధ ప్రోగ్రామ్‌లు మనుషుల తరహాలో వివేచనతో వ్యవహరించే 'ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)'ని సంతరించుకుంటాయని 'క్లాడ్ ఏఐ' అంచనా వేసింది. ''వస్తువులను గుర్తించడం, గేమ్స్ ఆడటం, లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వంటి అంశాల్లో ఏఐ ప్రోగ్రామ్‌లు ఇప్పటికే మనుషులతో సమానంగా, కొన్నిసార్లు మెరుగ్గా వ్యవహరిస్తున్నాయి. డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్‌లకు అవసరమైన శక్తివంతమైన కంప్యూటింగ్ వ్యవస్థలపై పెద్ద పెద్ద సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. మనుషులతో సమానంగా 'ఏజీఐ'ని చూపే ఏఐ ప్రోగ్రామ్‌ల రూపకల్పన కోసం డీప్‌మైండ్, ఓపెన్ ఏఐ, గూగుల్ బ్రెయిన్, ఆంత్రోపిక్ వంటి సంస్థలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో 2024లో ఏఐ ప్రోగ్రామ్‌లు మరింత తెలివి సంతరించుకుంటాయి..'' అని క్లాడ్ స్పష్టం చేసింది.

మనుషుల శరీరానికే యంత్రాలను అమర్చుకుని అత్యంత సమర్థవంతంగా మారేందుకు 2024 వేదిక అవుతుందని 'గూగుల్ బార్డ్' అంచనా వేసింది. మెదడులో అమర్చే చిప్‌లతో కంప్యూటర్‌కు అనుసంధానం కాగలిగే బయోటెక్నాలజీ రూపొందుతుందని పేర్కొంది. ''మనుషుల మెదడు–కంప్యూటర్ అనుసంధానికి వీలుకల్పించే 'బ్రెయిన్–కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ)'లు అభివృద్ధి చెందుతాయి. దీని సాయంతో కృత్రిమ చేతులు, కాళ్లు వంటి అవయవాల (బయోనిక్ లింబ్స్)ను, ఇతర పరికరాలను నేరుగా మెదడుతో నియంత్రించడానికి వీలవుతుంది. భారీ బరువులను ఎత్తడం, అత్యంత వేగంగా పరుగెత్తడం, కష్టమైన పనులు చేయడం, మిలటరీ ఆపరేషన్స్ వంటివి సాధ్యమవుతాయి. అవయవాలు కోల్పోయినవారు, పక్షవాతం వచ్చిన వారు తిరిగి సాధారణ జీవితం గడపవచ్చు. మెదడు–కంప్యూటర్లు కలగలిసి సృజనాత్మకత, మేధోశక్తి పెరుగుతుంది..'' అని గూగుల్ బార్డ్ పేర్కొంది. అయితే ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు చెందిన న్యూరాలింక్ సంస్థ తాము రూపొందించిన బ్రెయిన్ చిప్‌లను ఈ ఏడాదే మనుషులకు ప్రయోగాత్మకంగా అమర్చి పరిశీలించనుండటం గమనార్హం.

మెదడు–కంప్యూటర్ కలసి.. మానవ యంత్రాలు వచ్చి..



మనిషికి తగినట్టు.. మందులు

జ్వరం వచ్చిందా, మరేదైనా ఆరోగ్య సమస్య వచ్చిందా.. ఎవరికైనా దాదాపు ఒకే రకమైన మందులు వాడుతుంటారు. ఒకే తరహా చికిత్స అందిస్తుంటారు. ఇకపై వ్యక్తుల శరీరతత్వం, వారి డీఎన్‌ఏకు అనుగుణంగా వేర్వేరు ఔషధాలు, వేర్వేరు మోతాదుల్లో ఇచ్చేలా, భిన్నమైన చికిత్సలు అందించే వైద్య రంగం అభివృద్ధి చెందుతుందని 'గూగుల్ బార్డ్' పేర్కొంది. ''కృత్రిమ మేధ ఆధారిత వైద్యారోగ్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. వ్యక్తుల జన్యువులు, వారి జీవనశైలి, నివసించే పరిస్థితులు, పర్యావరణం ప్రభావం వంటివి పరిశీలించి.. భవిష్యత్తులో రాగలిగే వ్యాధులు, ఆరోగ్య సమస్యలను అంచనా వేసే సాంకేతికత వస్తుంది. వారు చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలనూ ఏఐ సూచిస్తుంది. వివిధ వ్యాధులకు ఉండే వేర్వేరు లక్షణాలు, వైద్య పరీక్షల రిపోర్టులు, వాడే మందులు, వాటి ఫలితాలను సమగ్రంగా పరిశీలించి.. ఎలాంటి చికిత్స అందించాలనేది తేల్చుతుంది.

అంతర్జాతీయంగా.. చైనా టెన్షన్



2024లో ప్రపంచవ్యాప్తంగా చైనా టెన్షన్ మరింత పెరుగుతుందని 'క్లాడ్' అంచనా వేసింది. కొన్నేళ్లుగా అమెరికా, చైనా మధ్య ఉన్న ఉద్రిక్తతలు పెరగవచ్చని పేర్కొంది. ''తైవాన్, చైనా మధ్య వివాదం, ఇతర అంశాలతో చైనాకు.. అమెరికా, ఇతర పశ్చిమ దేశాలకు మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగవచ్చు. 2024లో తైవాన్ పూర్తి స్వాతంత్య్రం ప్రకటించుకునే దిశగా అడుగులు వేయవచ్చు. ఈ విషయంలో చైనా మిలటరీతో దుందుడుకుగా వ్యవహరిస్తే.. దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా పడుతుంది..'' అని క్లాడ్ పేర్కొంది.


ఎన్నికలు.. హ్యాక్ అవుతాయి!



ప్రజాప్రతినిధులను, ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రక్రియ ఏఐ సాయంతో హ్యాక్ అవుతుందని 'గూగుల్ బార్డ్' అంచనా వేసింది. సోషల్ మీడియాలో, బయటా ఎన్నికల ప్రచారం కొందరికి అనుకూలంగా, పక్షపాతంగా ఉండేలా.. ఓటర్లను ప్రభావితం చేసేలా 'కృత్రిమ మేధ' సాయంతో ప్రయత్నాలు జరుగుతాయని పేర్కొంది. ''ఓటర్ల డేటాబేస్ హ్యాక్ కావొచ్చు. దాని సాయంతో ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేయవచ్చు. కావాల్సిన వారికి అనుకూలంగా వ్యవహరించేలా ప్రభావితం చేయొచ్చు. డీప్‌ఫేక్ సాయంతో తప్పుడు వీడియోలు, ఆడియోలు సృష్టించి వ్యతిరేక ప్రచారం జరుగుతుంది. అంతేకాదు ఓటింగ్ యంత్రాలు, ఫలితాలను వెల్లడించే వ్యవస్థలనూ ఏమార్చే ప్రయత్నాలు జరుగుతాయి..'' అని తెలిపింది.

బతికేదెంతో చెప్పేస్తామంటూ..

కావాల్సినట్టు, ఊహలకు తగినట్టుగా ఫొటోలు, వీడియోలను సృష్టించే ఏఐ ప్రోగ్రామ్‌లు ఎన్నో తెరపైకి వచ్చాయి. దీనికితోడు ఇటీవల మీరు ఎంతకాలం బతుకుతారో అంచనా వేసే 'లైఫ్2వెక్' వంటి కృత్రిమ మేధ ప్లాట్‌ఫామ్‌లూ మొదలయ్యాయి. వయసు, శారీరక స్థితి, ఆరోగ్యం, వ్యాధులు, అలవాట్లు, ఉద్యోగం, నివాస పరిస్థితులు వంటి వివరాలిస్తే.. విశ్లేషించి ఎంతకాలం జీవించవచ్చనే అంచనా వేసి చెప్పేస్తున్నాయి. ఎక్కువ కాలం జీవించాలంటే.. మన అలవాట్లు, పరిస్థితులలో ఎలాంటి మార్పులు చేసుకోవాలో కూడా సూచిస్తున్నాయి. ఇవన్నీ కచ్చితంగా కావాలనేం లేదు. కానీ 'ఏఐ' చెప్తున్నది మాత్రం దగ్గరగానే ఉందంటున్నారు నెటిజన్లు.



- సాక్షి సెంట్రల్ డెస్క్

యాదాద్రిలో గోదాదేవి పూజలు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం జరుగుతున్నాయి. గురువారం 19వ రోజు వేకువజామున 4 గంటలకే గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి మండపంలో అధిష్ఠించారు. అనంతరం శ్రీరంగనాథుడిని కొలుస్తూ గోదాదేవి పఠించిన 19వ పాశురాన్ని ఆచార్యులు పఠించి ఇష్టమైన నైవేద్యం కట్టెపొంగలిని ఆరగింపుగా పెట్టారు. కాగా, యాదాద్రి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఉల్లిపాలెంలో ఉన్న శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామిజీ గురువారం సందర్శించారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

రికార్డు స్థాయిలో యాదాద్రి హుండీ ఆదాయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో వచ్చింది. ప్రధానాలయ ఉద్ఘాటన తరువాత ఇదే పెద్ద ఆదాయంగా అధికారులు చెబుతున్నారు. గురువారం శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో 28 రోజుల ఆదాయం రూ.3,15,05,085 వచ్చినట్లు ఈవో వెల్లడించారు. ఇక మిశ్రమ బంగారం 100 గ్రాములు, మిశ్రమ వెండి 4కిలోల 250 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు విదేశీ కరెన్సీ సైతం వచ్చినట్లు తెలిపారు. వరుస సెలవులతో పాటు వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరం మొదటి రోజు కలిసి రావడంతో భక్తులు శ్రీస్వామి వారిని అధికంగా దర్శించుకున్నారు.

కేసీఆర్ కిట్ ఇక.. ఎంసీహెచ్ కిట్

నల్లగొండ టౌన్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్లపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోలపై ఇప్పుడు తెల్లని స్టిక్కర్లను అతికించి బాలింతలకు పంపిణీ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే బాలింతలకు అందజేస్తున్న కేసీఆర్ కిట్ పేరును మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసీఆర్ కిట్‌కు బదులు ఎంసీహెచ్ (మదర్ అండ్ చైల్డ్ హెల్త్) కిట్‌గా పేరు మారుస్తూ వైద్య, ఆరోగ్యశాఖ సర్క్యులర్ జారీ చేసింది. ప్రస్తుతం జిల్లాల్లో అందుబాటులో ఉన్న కేసీఆర్ కిట్లపై ఉన్న కేసీఆర్ ఫొటోపై తెల్లని స్టిక్కర్ అతికించి దానిపై ఎంసీహెచ్ కిట్ అని పేరు రాసి బాలింతలకు పంపిణీ చేస్తున్నారు. దాంతో పాటుగా గర్భిణులకు అందజేస్తున్న న్యూట్రీషియన్ కిట్‌లోని వస్తువులపై ఉన్న కేసీఆర్ ఫొటోలపై కూడా తెల్లని స్టిక్కర్ అతికించి ఇస్తున్నారు.

పేరు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం
- కిట్‌లో కేసీఆర్ ఫొటోలపై 'ఎంసీహెచ్' స్టిక్కర్లు అతికింపు



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం కిట్‌లు పంపిణీ చేస్తున్నాం. ఎంసీహెచ్ పేరుతో ముద్రించిన కిట్‌లు వచ్చే వరకు.. ఇప్పటికే జిల్లాలో ఉన్న కిట్‌ల స్టాక్‌పై ఉన్న కేసీఆర్ పేరు, ఫొటోపై స్టిక్కర్లు అతికించి ఎంసీహెచ్ కిట్‌ల పేరు రాసి పంపిణీ చేస్తున్నాం. అలాగే న్యూట్రిషియన్ కిట్‌లలోని వస్తువులపై ఉన్న కేసీఆర్ ఫొటోలపై కూడా తెల్లని స్టిక్కర్ వేస్తున్నాం.

– డాక్టర్ కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ, నల్లగొండ

తిరుమలలో నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. గతేడాది డిసెంబర్ 12న వైకుంఠ ఏకాదశికి 11 రోజుల ముందుగా ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ 25 రోజుల్లో ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను శ్రీవైష్ణవులు స్వామివారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో పారాయణం చేస్తున్నారు. 24వ రోజైన గురువారం శ్రీవరాహస్వామివారి ఆలయంలో సాత్తుమొర నిర్వహించారు. 25వ రోజైన శుక్రవారం తణ్ణీరముదు ఉత్సవంతో ఈ అధ్యయనోత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి పాల్గొంటారు.



మారిషస్ నుంచి అయోధ్యకు అక్షతలు

మారిషస్ తెలుగు సంఘం ప్రతినిధి సంజీవ నర్సింహ అప్పడు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న భారతీయులు పాలుపంచుకోబోతున్నారు. మారిషస్‌లో ఉన్న తెలుగువారు ఈ వేడుకను మరింత ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేపట్టినట్టు మారిషస్ తెలుగు సాంస్కృతిక సంఘం జాతీయ అధ్యక్షుడు సంజీవ నర్సింహ అప్పడు తెలిపారు. 'శ్రీ అయోధ్యరామ లిఖితజపం' పేరిట ప్రత్యేక భక్తి యజ్ఞం చేపట్టనున్నట్టు ఆయన పేర్కొన్నారు. మారిషస్‌లో ఉన్న లక్షలాది మంది తెలుగువారు తమ భక్తిని చాటుకొనే విధంగా వేడుకలు చేయనున్నారు. ఇందులో భాగంగానే మారిషస్ నుంచి అయోధ్యకు అక్షతలు పంపిస్తున్నారు. మూడు అడుగుల వెడల్పు, రెండు అడుగుల ఎత్తు కలిగిన తెల్ల కాగితంపై 'శ్రీరామ' అని పెద్దగా రాసిన అక్షరాలపైన పసుపు, ఎరుపు రంగు అక్షతలను అతికిస్తున్నారు. శ్రీరాముడి నామస్మరణ చేస్తూ పసుపు, ఎరుపు రంగు బియ్యపు గింజలు 108 చొప్పున అతికించే పనిలో నిమగ్నమయ్యారు. ఇలా ఒక్క శ్రీరామ నామంపైన 300 సార్లు అక్షతలు అతికిస్తారు. ఇవి ఈ నెల 15వ తేదీన అయోధ్యలోని శ్రీరాముడి పాదాల వద్ద సమర్పించనున్నట్టు ఆయన చెప్పారు. 'మారిషస్‌లో ఉంటున్న తాము అయోధ్య వేడుకలకు హాజరుకాలేకపోతున్నాం. కానీ ఉడతాభక్తిగా తాము చేసిన రామనామ లిఖితపూజ ఆ రామచంద్రుని సన్నిధిలోకి చేరుతుంది.' అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

నిమ్స్ వైద్యసేవలు భేష్!

త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి అమర్నాథ్ సంతృప్తి



లక్డీకాపూల్(హైదరాబాద్): నిమ్స్ ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి టి.అమర్నాథ్ గౌడ్ సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆస్పత్రికి వచ్చిన ఆయన సాధారణ వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్డియాలజీ విభాగం సీనియర్ వైద్యుడు సాయిసతీశ్, జనరల్ మెడిసిన్ సీనియర్ వైద్యులు నాగేశ్వరరావు, శెట్టి, పల్మనాలజీ విభాగం అధిపతి డాక్టర్ పరంజ్యోతి ప్రత్యేక పర్యవేక్షణలో వైద్యబృందం వైద్యపరీక్షలు నిర్వహించింది. అనంతరం నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్పని న్యాయమూర్తి కలిసి నిమ్స్‌సేవల గురించి ఆరాతీశారు. పేదరోగులకు అందుతున్న సేవలపై న్యాయమూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.